ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



4 అణాలు

3-3-5

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY




మద్రాసు బీచివద్ద దృశ్యం

★

పల్లెబాట

ఫొటోలు: బి. రంగనాథన్-మద్రాసు.



సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతి 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 47
సంచిక 25
3-3-54

విజయ మాఘ బహుళ త్రయోదశి బుధవారం



"ఖెడ్డా"

ఆటవిక మదగజాలను "రోప్" వేసి నదిలో తీసికొనిపోతున్న దృశ్యం.

ఫోటో : కె. సుబ్రహ్మణ్యం. (మైసూరు)

*పిత కరిభ్రమించెడు
 పనేక విధంబుల సంచిత ధ్రువా!!
కాలిడు విక్రమించు
 మేలగు పుణ్యకర్మ మూరేడు యనుచు
తలంచు గదుః – నీ దలచు
 మించిన కార్యముః–భావికార్యమున్
పాలన వృత్తిగోరః – విధి
 లబ్ధఫలంబులు నే భుజించెదన్."

ఓ! మనసా! అనేక విధములుగా ఎందుకు ఆందోళన పడతావు? ఏదో ఒక స్థిరస్థావరం కలిగి ఓర్పుతో విశ్రాంతి పొంది ఉండు – మేలుగాని కీడుగాని ప్రయత్నము లేకుండానే జరుగుతాయి. కనుక నేను గతించిన దానినిగూర్చి తలంపను. రానున్న దానికొరకై లాలించినట్లుగా కోరను. విధి నిర్ణయప్రకారము లభించిన ఫలితములనే నేను అనుభవిస్తాను.

"విధినిర్ణయప్రకారము లభించిన ఫలితములనే నేను అనుభవిస్తాను" అని తన సంకల్పం సంతోషపూర్వకంగా తెలియజేశాడు. "అనుభవిస్తాను" అనే మాట యొక్క అంతరార్థమేమిటి? అక్కడే ఉంది, యీ వేదాంతంలో ఉన్న తెలుసుకుకు రహస్యం అంతా. ఈ వేదాంతికి,

కాలక్షేపం

మాటవరుసకు తేలుకుట్టిన దనుకోండి. అట్టి వృశ్చికం ప్రతిహతముగుగాక! అతని బాధ అప్రతిహతముగుగాక! అప్పుడు అతడు ఏమిచేస్తాడు? తేలుకుట్టితే కొందరికి విషం పైకెక్కుతుంది. అందువల్ల ఓర్వలేని బాధ కలుగుతుంది. నిప్పులో కాలుపెట్టినట్లుగా భగభగమని మంట పెడుతుంది. అది తొడల వరకుఎక్కి పోట్లు పొడిచినట్లుగా, దుర్యోధనుని తొడలు భీముడు గదతో కొట్టి చీల్చినట్లుగా, ఘోరభంగ విషాదాంతనాటకము కంటె యీ విషదోష ప్రమాదంవల్ల ఎక్కువ దుర్భర విషాదావస్థ కలుగుతుంది. పెంకు లేగిరిపోయేటట్లుగా ఏడుస్తాడు. "దేవుడా! యీ బాధను నేను భరించలేకుండా ఉన్నానురా!" అంటాడు. "ఏడుకొండలవాడా! నా మీ పాలుగాలు నీ పాదాల సమీపమున సమర్పించి నేను నిజమైనజోగినై, ప్రతి శనివారం నీ దీపారాధన చేసుకుంటాను – తండ్రీ! ఈ ముప్పునుంచి తప్పించి, నా తప్పు క్షమించు" అని అర్తనాదంచేసి ఆస్వామికి ఆత్మార్పణం చేస్తాడు. ఇదంతా సహజసిద్ధంగానే చేస్తాడు – చెయ్యకపోతే ఎట్లా? దస్నీళ్లు ధారగాపోసినా, బాధపోదు. ఉప్పున్నా కిరసనాయిలున్నా తెచ్చిరుద్దినా బాధ తగ్గదు. తేలుమందుకణిక అరగదీసి పూసినా ఇంకా ఎక్కువై ఎక్కుతోందిగాని దిగడం లేదు. పొటాసియం పర్మాంగనేటున్నా, సిట్రిక్ ఆసిడున్నా తెచ్చి ఒకదాని తర్వాత ఇంకొకటి చిటికెడుచొప్పున కాలి వేలి మీదపెట్టి రెండుమూడు నీళ్లుచుక్కలు వేస్తే తగ్గుతుందని అగ్రకారం చేస్తే, అమందు ఇప్పుడునిపొంగి, పొంగుతడిసదేగాని భగ్గుమనుచుంట తగ్గలేదు. మంత్రం వేసినా మంట చల్లారలేదు. అటువంటిసమయంలో ఆ వేదాంతికి మనశ్శాంతి ఎట్లా? కొంతసేపటికి ప్రక్క యింటి పెద్దమనిషివచ్చి చక్కని చిక్కని బెల్లపుపానకం తయారుచేసి, "ఇది ఒక దివ్యౌషధం" అని చెప్పి అతనికడుపుపట్టి వంతవరకు గడగడ త్రాగించాడు. ఆపానకం ఎంత చిక్కగా తయారుచేశాడంటే, యిక ఆనీటిలో అంతకంటె ఎక్కువబెల్లం కరుగుటకు అవకాశం లేదన్నంత చిక్కగా తయారుచేశాడు. ఆ పానకం త్రాగించిన తర్వాత నరసింహమూర్తిఅవతారం చాలించినట్లుగా కొంతసేపటికి బాధ మెల్లిగా తగ్గినది. ఉగ్రనరసింహుడు నిజంగా పానకాలరాయడే అని అర్థమైంది. ఆ పరమహంస క్రియా ప్రయోగంతో,—తానొక పరమహంస నని ప్రకటించుకొని గోళ్లు పెంచుకొన్న వేదాంతికి కూడా,—తేలంటే ఏమిటో తేటతెల్లమయింది.

అయితే, ఒక్క విషయం ఉంది. ఆసమయంలో గంజాయి దమ్ము పీల్చినట్లయితే, ఈ బాధ ఏమీ లేకుండా, తేలు కుట్టగల్గినది శరీరమునేగాని ఆత్మను కాదు అని పోయిగా "జై! సద్గురూ! జై! సీతారాం!" అంటూ నిశ్చలంగా ఉండవచ్చునని, విజ్ఞానుభవం కలవాడు వాదించవచ్చు. ఆ మాటకు వస్తే, "మార్ఫియా" ఇంజెక్షనుతో మత్తెక్కిచ్చినంతసేపు నిశ్చింతగా నిద్రపోవచ్చునని, దాని సత్తా తెలిసిన వైద్యశాస్త్రజ్ఞుడు కూడా వాదిస్తాడు. "మార్ఫియా" అంటే మనకు తెలియని మందు కాదు. అది నల్లమందు. నల్లమందుయొక్క అరఖు ప్రధానంగా ఉన్నటువంటి ఔషధం, సారాయి కలిపెట్టి, మనిషి దేహస్థితి కనిపెట్టి, తేలుబాధ సహించక తల్లడిల్లుతున్న మనిషికి ఇంజెక్షనుగా యిచ్చి, మరుపు వేసి నిశ్చయమైనచోట కరంటనిచ్చి విసనకర్రతో విసురుతున్నట్లయితే, కొలది నిముషములలో కన్నుమూసి పోయిగా నిద్రపోగలడు. ఎటువంటి బాధ అయినప్పటికీ, ఆ బాధ కత్తిపోటువంటిదైనా, సుత్తిపాటువంటిదైనా, బాధ కన్పించకుండా ఇంత నిద్ర పట్టవచ్చు. ఇంత నిద్ర రాకపోయినా కంటినిండా నిద్రపట్టగలదు. ఆరీతిగా విశ్రమించిన పిమ్మట, శరీరశ్రమ క్రమశః తగ్గ

విషయానుక్రమణిక

ముఖచిత్రం: — మనోహరా వారి 'మనోహర'లో టి. ఆర్. రాజకుమారి.

28, 29 పేజీలలో ఫోటోలు పంపిన వారు కె. బి. కృష్ణవేణి, మైసూరు.

పోయి, బ్రతుకుజీవుడా అని ప్రక్కనుండి లేవవచ్చు. కాబట్టి మత్తుపదార్థంలో ఆ మహాత్తు ఉంది.

ఈ తేలు బాధవల్లనూ యీ తేలుమందుల వల్లనూ, తేలిన సారాంశం ఏమిటంటే, విషం ఎక్కనటువంటివారికి తేలు కుట్టినా ఒక్కటే, కుమ్మరిపురుగు కుట్టినా ఒక్కటే. కాని, ఏ విషమువిషయవిషమైనా సుల భంగా మొలవరకు తలవరకు ప్రాకిపోయి, పంచబాణాలు ప్రయోగించినట్లుగా పంచ ప్రాణాలు తల్లడిల్లేవారివిషయంలోమాత్రం పై. జెప్పిన పద్యంలోని వేదాంతసారం ఎంత చెప్పినా వారి వంత శాంతించదు. "ఏల పరిభ్రమించెద వనేకవిధంబుల వెర్రి చిత్తమా! తాలిమి విశ్రమింపు మొకతావున" అని మానసప్రబోధం ఎంతచేసినా, భరింప రాని బాధ మరింత ఎక్కువవుతుంది. "ఓర్చుకోనాయనా! ఓర్చుకోనాయనా! అని కబుర్లు చెప్తావ్ నీకేం? నీకు కుట్టి నప్పుడు తెలుస్తుంది ఎంత మంట పెట్టు తుందో - నాబాధతో నేను చస్తూఉంటే, చెవిలో జోరీగలాగున, యీ నీతులు ఉప దేశిస్తే నాబాధ తగ్గుతుందా? నీకో నమ స్కారంబాబూ! నీ వేదాంతం, నీ శ్రీరంగ నీతులూ కట్టిపెట్టి నీవిక్కడనుంచి లేచి పోతే నాకంతే చాలు. నంబీ నంబీ నాకు ఎదురురాకుండాఉంటే అంతే చాలు అన్న ట్లుగా ఆమాత్రం నంబిసహాయం నీవుచేస్తే నీ పెద్దలూ నా పెద్దలూ అటు ఏడుతరాలూ ఇటు ఏడుతరాలూ తరిస్తారు. నీవు ఇక్కడ నుంచి లేచిపోతే, నాబాధ సగం తగ్గుతుంది. నాఏడ్పు నేను ఏడుస్తాను" అని వృశ్చిక బాధ పేధిస్తున్న వేదాంతి వాంతి చేసికొన్న ట్లుగా జనాంతికముగా ఎదుటఉన్న కళ్ళెన మీద విరుచుకొని పడ్డాడు. "నా తేలుబాధ కంటె నీ నీతుల బాధ దుస్సహంగా ఉన్న" దన్నట్లుగా కస్సుబుస్సుమంటాడు.

కాని, ఆ బాధలోనైనా భగవంతుణ్ని స్మరించనివాడు ఉండవచ్చు. "కలడు కలండనెడివాడు కలడో లేడో" అని గజేంద్రునివలె అవసానదశలోకూడా అనుమానించే పామజములవంటివారు మానవసమాజంలో లేకపోలేదు. ఫ్రాన్సు దేశంలో వాలేర్ అనే ఒక గొప్పపండి తుడు ఉండేవాడు. ఇతడు పరమనాస్తి కుడు. కాని నీతిగా బ్రతికినవాడే. పరమ నైతికుడైనా పరమనాస్తికుడు. అతనికి ప్రాణంపోతున్న సమయంలో క్రయిస్తవ మత గాఢవిశ్వాసియైన అతని శ్రేయోభి లాషి అతనివద్దకువచ్చి "స్వామీ! ఇప్పు డైనా ఒకసారి దేవా! రక్షించు! రక్షించు! పాహిమాం! పాహిమాం" అని భగవంతుణ్ని ఒక్కసారి మనసార మీరు

సామ్య పద్ధతి

★

నండూరి రామమోహనరావు

ఇదిజనన మది మరణ
మీ రెండు తీరముల
నడుమ జీవితమహా
జడధి ఘూర్ణిలుచుండు.

ఏ యొక్కనిది కాని
ఈ బ్రదుకుకడలి ప్రతి
యొకనికోసము సుమ్ము
హారెత్తు నిత్యమ్ము!

ఒకని కొదవిన నొదవు
ఉదధిగత మణిగణము;
ఒకని కొదవును శిలా
శకల సందోహమ్ము.

ఏ యొక్కనిది కాని
ఈ మహా ధనరాశి
ప్రతి యొకనికోసమ్ము
వనధినిక్షిప్తమ్ము!

ఒకడు ధనశాలి, వే
రొకడు నిర్ధనుడైన,
ఒకడు బలశాలి, వే
రొకడు దుర్బలుడైన,

ఒకడు యజమాని, వే
రొకడు భృత్యుండైన,
ఒకడు విజ్ఞాని, వే
రొకడు అజ్ఞుండైన,

మనిషి మనిషే నన్న
మహిత సత్యము తెలిసి
మనుటగన్న దినమ్ము
మహియె స్వర్గము కాదా?

చివరికెల్లరి గమ్య
మవలి తీరమ్మైన,
అతడధికు డితడల్పు
డనెడి భేదమ్మేలా?

వేడుకుంటే మీ ఆత్మకు మోక్షం కలుగు తుంది" అని సలహాయిచ్చాడు. ఆ స్తమిత్రుని మాట త్రోసివేయడం అప్రశస్తమని యెంచి, పోనీలే ఎందుకైనా మంచిదే అన్న ట్లుగా "పరమాత్మ అనే దొకటి ఉన్న ట్లయితే, జీవాత్మ అనేది ఒకటి ఉన్న ట్లయితే, 'ఆ పరమాత్మ యీ జీవాత్మను రక్షించుగాక!" అని కళ్లుపైకెత్తి పళ్ల బిగు వున "అనవలసినమాట ఏదో అన్నాను" అని కళ్లు మూసికొన్నాడు. మళ్ళీ కళ్ళు తెరవ లేదు. "అనవల సంటిగా కెరుగవా యొక మాటనె మర్మ కర్మముల్?" అని చెప్పి నట్లుగా, అతడు అనవలసిన మాట ఏదో అన్నాడుగాని, అతని కర్మవిమో చన అతనికి అయిందో లేదో అతని అంతరాత్మకే తెలిసింది. అతడు నిష్కపటంగా ప్రవర్తించాడో, కపటంగా ప్రవర్తించాడో అతని మనస్సుకు అతని మనస్సే సాక్షి. లోకాన్ని మోసం చేస్తూ మనస్సులో ఒకటి నమ్మి పైకి ఇంకొకటి చెప్పి, ఆవిధంగా ప్రవర్తించడం తప్పు అని మనస్సులో తెలిసియుండినప్పటికీ, లోకా నికి కళ్లు మూయవచ్చుననే భావంతో కప టంగా అతడెప్పుడైనా ప్రవర్తించియుండి నట్లయితే, తాను కపటంగా ప్రవర్తించితి ననే ఆత్మజ్ఞానం అతనికి విధిగాఉంటుంది. లోకాన్ని మోసగించగలడే గాని, తన్ను తాను మోసగించుకోలేడు. లోకం విష యంలో తన మోసం బయటపడకపోవచ్చు. కాని, తన విషయంలో తన మోసం, తన

★ కాలక్షేపం ★

చర్యం తనకు బయటపడక తప్పదు. "వెర్రి చిత్తమా! ఏల పరిభ్రమించెదవు?" అనే మానసప్రబోధం చేసుకుంటే చాలు. అదే ఆత్మప్రబోధం. నీవు నీవు త్రికరణశుద్ధిగా ప్రవర్తిస్తే చాలు. నీ మనస్సు భ్రమించకుండా, ఆత్మ పరిభ్రమణ పొందకుండా, ఆత్మవంచన చేసికొనకుండా ఉంటే అంతే చాలు. అంతకన్నా పరమ ఆస్తికుడు యింకొకడు లేడు. ఆత్మారాముణ్ని నమ్మకొని ఆరాధిస్తే చాలు. తన్ను తాను గౌరవించుకొని తన శక్తిని తాను తెలుసుకొనుట మేలు. ఆత్మ సాక్షాత్కారం పొందితే మేలు. అహంబ్రహ్మ అని గ్రహించాలి అహోరాత్రాలు.

అయితే, తాను అని చెప్పకొని వ్యవహరించేది దేనిని గూర్చి అనే ప్రశ్న వస్తుంది. "తాను" అని చెప్పకొనేది తనదేహాన్ని గురించి కాదు. దేహం, ప్రాణం కాకుండా యింకొకటె ఉంది. అదే శాశ్వతమైన పదార్థం అవునా కాదా? అనే మీమాంస మనదేశంలో కనీసం యే మూడు వేల సంవత్సరాల క్రిందటనో పరిష్కరించి నిష్కర్షగా తేల్చి తీర్పు చెప్పివేశారు.

"విధిలబ్ధఫలంబులు నే భుజించెదన్" అని పై పద్యంలో ముగింపబడింది. విధాయకంగా అనుభవించవలసిన ఫలితములను నేను అనుభవిస్తాను అని చెప్పడంలో విశేషం ఏమీ లేదు. ఎవడికోసం అనుభవిస్తాడు? కొన్ని ఫలితములను అనుభవిస్తాను అనిగాని, మరికొన్ని అనుభవించను అనిగాని వాదించడానికి వీలులేదు. కర్మఫలితములన్నీ అనుభవించి తీరవలసిందే. అయితే యిప్పు డనుభవిస్తున్న ఫలితములు ఏవో కొన్ని కర్మలను చేసి యుండుటవల్లనే ఆ కర్మల ఫలితంగా అనుభవిస్తున్నాను అని అంగీకరించినట్లుగా ఆ వాక్యంలోనే ఉంది. లేకపోతే "ఫలంబులు" అనే మాట ప్రయోగించాడు. ఇదివరకు కొన్ని కర్మలను చేయడంవల్లనే వాటి ఫలితాలు యిప్పుడు అనుభవిస్తున్నా నని అంగీకరించినట్లయితే, కర్మచేయకుండా ఫలితం అనుభవించడానికి వీలులేదు. మామిడి టెంకలు నాటకుండా మామిడి ఫలములు భుజించడం అసంభవం. కాబట్టి "ఫలంబులు నే భుజించెదన్" అనేవాడు "వనంబులు నేను పెంచెదన్" అనే మాటకూడా అనాలి. "యత్నము లేకయే యగున్ మేలును గీడు" అని యీ పద్యంలో చెప్పిన సిద్ధాంతము శుద్ధఅబద్ధము. మేలుగాని, కీడుగాని ఒక ఫలితంగా అనుభవించడం ఇప్పుడు సంభవించినట్లయితే, ఫలితము అనుభవించడానికి కారణభూతమైన యత్నము జరిగిఉండాలి. ఇప్పుడు కాకపోతే ఇదివరకే ఒకప్పుడు యత్నము జరిగిఉండాలి. ఒక తోడేలు ఒక గొర్రెపిల్లతో కయ్యానికి దిగింది. కాని ఆ గొర్రెపిల్ల తాను ఏపాపమూ ఎరుగనని వాదించింది. "నీవు కాకపోతే నీ అబ్బ నాకు అపకారం చేసిఉంటాడు. నీ అబ్బ కాకపోతే నీ తాత నాకు అపకారం చేసిఉంటాడు." అని గద్దించి కయ్యం పెట్టుకొని ఆ గొర్రెపిల్లను అన్యాయంగా సంహరించింది. కాని, ఆ తోడేలు చెప్పిన మాటలలో న్యాయం ఉంది. గొర్రెపిల్ల యే నేరం చేయకపోతే యీ చావు చావదు. ఈ అవస్థపాలు కాదు. ఈ జన్మలో కాకపోతే క్రిందటి జన్మలోనైనా ఏదో అపచారం చేసినందువల్లనే దానికి ఫలితంగా యీ మృత్యువు దాపరించింది. కర్మలేని ఫలితం ఉందంటే నిప్పులేని పొగ కూడా ఉంటుంది. అందుకనే మన పూర్వులు పూర్వజన్మ ఉన్నదన్నారు. ఉత్తరజన్మకూడా ఉండక మానదన్నారు. తండ్రిచేసిన ఋణాలు తండ్రియిచ్చిన ఎస్టేటును బాధిస్తూనే ఉంటాయి. కర్మఫలితం కూడా ఋణానుబంధంలాగున వెంటాడుతూ ఉంటుందన్నారు.

ప్రభుత్వ మంత్రివర్గం మారినా, ప్రభుత్వం సాగుతూనే ఉంటుంది. ఆత్మ ఒకటె స్థిరంగాఉండి అనేక లావాదేవీలలో దిగి అప్పులపాలవుతూ ఉంటుంది. తిరిగి తిరిగి వ్యాపారంచేస్తూ ఉంటుంది. ఇదే ఆత్మవ్యాపారతత్వం అన్నారు.

కనీసము మూడువేల ఏండ్లక్రిందట యీ విషయాన్ని మన భారతదేశంలోని మహామహులు, మహామునులు, యోగులు, బైరాగులు గ్రహించి లోకానికి బోధించారు.

ఈ దేశానికి గ్రీసుదేశమునుంచి అలెగ్జాండరు చక్రవర్తి క్రీస్తుపూర్వము 326 సం॥ లో దండెత్తి వచ్చాడు. ఈ అలెగ్జాండరు చక్రవర్తికి గురువు అరిస్టాటిల్ అనే గ్రీకు తత్వవేత్త - అతని గురువు ప్లేటో అనే తత్వవేత్త - అతని గురువుపేరు సోక్రటిస్. అలెగ్జాండరు చక్రవర్తి యీ దేశానికి దండెత్తి రాకపూర్వమే గ్రీసుదేశంనుంచి పరిషియాదేశం మీదుగా భారతదేశానికి చాలామంది ప్రముఖులు వచ్చిపోతూ ఉండేవారు. భారతీయ పండితులు సోక్రటిస్‌తో కలిసి సంభాషించినట్లుగా అనేక సాక్ష్యాధారములున్నాయి. క్రీస్తు పుట్టక పూర్వము 399 సం॥లో సోక్రటిస్ మరణించెను. ఆత్మ అనేది స్థిరమైన దనే సిద్ధాంతం యీ తత్వవేత్త లంగీకరించారు. జన్మలు మారినా ఆత్మ స్థిరంగా ఉంటుందనే సంగతి గ్రీసులకూ గ్రీసు పండితులకూ బోధించినది మన తత్వవేత్తలే— సాక్రటిస్ మనతత్వసిద్ధాంతం జీర్ణం చేసుకున్నాడు.

సోక్రటీస్ జీవించియున్న కాలంలో గ్రీసుదేశంలో సోక్రటిస్ బోధించిన విషయాల మూలంగా గ్రీసుదేశంలోని యువకుల మతి విరిగిపోతున్న దనిన్నీ, సోక్రటీస్ యీవిధంగా సంఘానికి ద్రోహం చేస్తున్నాడనిన్నీ, ప్రభుత్వమునకు కూడా ఎదురుతిరిగే తత్వంగల యువకులను తర్ఫీయతు చేస్తున్నాడనిన్నీ, అతనిమీద సంఘవిద్రోహ నేరం ఆరోపించారు.

కాని సాక్రటీస్ చెక్కుచెదరని ఆనాటి

సత్యాగ్రహానాయక శిఖామణి. అతనిని జెయిలులో పెట్టి బంధించారు. అతనికి యిద్దరు కొడుకులున్నారు. వారు జెయిలుకు వచ్చి ఆయన దర్శనం చేశారు. కాని సోక్రటీస్ కంటినుంచి ఒక్క నీటిబొట్టయినా రాలలేదు. ఇటువంటి నిశ్చల నిర్మల హృదయుణ్ని ఈ జగత్తులో చూడలేదని జెయిలు అధికారి అన్నాడు. ఆ జెయిలు అధికారి గుండె నీరైపోయి దుఃఖించాడు. 30 రోజులు జెయిలులో ఉంచి సోక్రటీస్‌కు మరణశిక్ష విధించారు. అతనిని చంపివేయడానికి ఆనాటి గ్రీసు ప్రభుత్వం భయపడింది. అందువల్ల హెమ్లక్ అనే విషమును ఒక గిన్నెలో పోసి, ఆ విషమును అతని చేత్తో అతడే త్రాగవలెనని శిక్ష విధించారు.

జెయిలు అధికారులకు అతని శిష్యులు లంచము లిచ్చారు. అతనిని ఎట్లాగైనా జెయిలులోనుంచి తప్పించి తీసికొనిపోయి ఒక ఓడలో ఎక్కించి పరదేశములకు పలాయనం అయ్యేటట్లు శిష్యులు ఏర్పాటు చేశారు. ఇదంతా సోక్రటీస్‌కు తెలియజేశారు ఆ శిష్యులు. కాని, యిటువంటి దొంగ కుట్రపనులుచేసి, అసత్యమార్గములను అనుసరించకూడదని అతడు తన శిష్యులను మందలించాడు. "సత్యమార్గం ఎక్కువైనది గాని, దానికంటె నా ప్రాణం ఎక్కువైనది కాదు" అన్నాడు.

విషం నిండినపాత్రను రాజభటులు అతని చేతికి యిచ్చారు. ఆపాత్రలో ఉన్నదంతా ఒక్కసారిగా ఆనందంగా సోక్రటీస్ త్రాగివేశాడు. కాళ్ళూ చేతులూ కించిత్తయినా వణక లేదు. అతనిశిష్యులైన ప్లేటో, క్రిటో, అప్పల్లో, డోరస్ మొదలైనవారు అది చూచి కన్నీరు మున్నీరుగా దుఃఖించారు. అప్పుడు సోక్రటీస్ వారితో యిల్లా అన్నాడు. "ఈ విధంగా ఏడుస్తారనే కారణంచేత నే స్త్రీలనందరినీ పంపించివేశాను. మీరు చేసేపని ఏమిటి? స్త్రీల మాదిరిగా దుఃఖిస్తున్నారు. ఇది తప్పు. శుభశకునములతో యీ జీవుడు బయలుదేరి వెళ్ళిపోవాలి. కనుక శాంతచిత్తంతో దుఃఖం భరించాలి." అని శిష్యులను హెచ్చరించాడు. హెమ్లక్కు విషం తాగిన కొంతసేపటికి కాళ్లు క్రమేణ బరువెక్కిపోయినాయి. తనకు మృత్యువు సమీపించిందని సోక్రటీస్ గ్రహించాడు. అప్పుడు తన ప్రక్కనున్న తన శిష్యుడను క్రిటోను పిలిచి అతనితో ఒక విషయం చెప్పి ప్రాణం విడిచిపెట్టినాడు. "క్రిటో! అయిస్కులపియాసు అనే అతనికి మనమొక కోడిపుంజును యివ్వాలి. ఆ బాకీని నీవు తీర్చివేయి. శ్రద్ధగా జ్ఞాపకముంచుకొని ఆ పని తప్పక నెరవేర్చు" అన్నాడు. క్రిటో ఆ మాట విని, "చిత్తం. ఆ ప్రకారం యిచ్చివేస్తాను" అన్నాడు. ఆ మాట విన్న పిమ్మట సోక్రటీసు మహాయోగి కళ్లు మూసికొన్నాడు. వెళ్ళిపోయింది ప్రాణం.

అటువంటివాళ్ళనే స్థితప్రజ్ఞు లంటారు. భగవన్నామస్మరణవల్ల కూడా బాధలు కన్పించవు.

"అంబుజోదర దివ్య పాదారవింద
చింతనామృతపాన విశేషమత్త
చిత్త మేరీతి నితరంబు జేరనేర్చు
వినుత గుణశీల మాటలు వేయునేల?"

భగవన్నామస్మరణవల్ల "మత్తచిత్తము" ఏర్పడి, కష్టాలు బాధలు కన్పించకుండా మనస్సు నిబ్బరంగా ఉంటుందని అనుభవసిద్ధంగా అమరజీవులైన మహాత్ములు ఆదర్శప్రాయంగా నిదర్శనప్రాయంగా నిరూపించి నిర్వచించారు.

గాంధిమహాత్ముడు తన ప్రాణరక్షణకై పోలీసు బందోబస్తులు అనవసరం అన్నాడు. ఆయన రామనామస్మరణచేసి "ఏల పరిభ్రమించెద వనేకవిధంబుల వెర్రిచిత్తమా?" అని ప్రశ్నించిన పురుషోత్తముడు. "విధిలబ్ధఫలంబులు నే భుజించెదన్" అనగలిగిన వాడే "జగదీశు ననంతుని నే భజించెదన్" అని కూడా అంటాడు. ★

త్వరలో కొత్త సీరియల్

మెహ్రా"

రచన: శ్రీ "శారద"

ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక పాఠకులకు త్వరలోనే ఒక కొత్త సీరియల్ నవలను అందించగలుగుతున్నందుకు ఆనందిస్తున్నాము.

ఆర్థిక స్తోమతు లోపమైనప్పుడు సమాజంలో జీవనం ఎంత యాతనామయమౌతుందో, ముఖ్యంగా స్త్రీలకు. అట్టి పరిస్థితులలో ఎంతటి ఘోరపతనం సంభవిస్తుందో ఈ చిన్న నవల యథాతథంగా చిత్రిస్తుంది. అయితే అమానుషమైన ఈ దుఃఖాంధకారంలో సహజ మానవ సౌశీల్యం, ప్రేమార్ద్రితలు వెలుగుదారులు చూపగలవు. నేటి సామాజిక జీవనాన్ని వాస్తవికంగా చిత్రించడానికి రచయిత శ్రీ 'శారద'గారు చేసిన కృషి పాఠకులలో ఔత్సుక్యం రేకెత్తించగలదని ఆశిస్తున్నాము - సంపాదకుడు.

వానర గ్రంథులు

మూలం: **శరదిందు వంద్యోపాధ్యాయ**

అనువాదం: **మోటూరి వెంకటేశ్వరరావు**

గోదావంటి గంభీర శాంతిగుణములు గలిగినకోతిని నేనింతవరకు చూడలేదు. బహుశా అది బెంగాలుది లేక సుమత్రాదిఅవటమే అందుకు కారణమేమో. స్వభావములోనే కాకుండా స్వరూపములో కూడా యితర వానరములకంటె భిన్నమైనది. తిన్నగా నిలుచుంటే అయిదడుగుల ఎత్తు వుంటుంది. నాలుగు సంవత్సరాలకు పూర్వము శశిధర్ బాబు దానిని సుమత్రా నుంచి తీసుకొని వచ్చాడు.

శశిధర్ బాబు మా పేటకంతా షావుకారు. నేను ఆయన యింటి డాక్టరుగా పదునైదు సంవత్సరాలనుండి వుంటున్నాను. ఆ పరివారంలో గోదా ఆయనతప్ప మరెవ్వరూ లేరు. ఆయన సరళస్వభావము కలిగి ఎంతో వినయంగా కనబడేవాడు. కాని ఎందువల్లనో పేటలో ఎవరికీ ఆయనంటే గిట్టదు. ఆయనకు వెనుక వెనుక నే శశిధర్ బాబు అనిగాక 'విషధర్ బాబు' అని అంటూ వుండేవారు. ఆ పేటంతా కూడా యిదే పేరు ప్రఖ్యాతిగాంచింది.

తన ఆస్తి ఏబదిలక్షు లయ్యేవరకూ పెళ్ళి చేసుకోనని పట్టుబట్టాడు. ముప్పదియేండ్లు కష్టపడి అనేకవ్యాపారాలద్వారా ధనమార్జించాడు. అప్పటికి ఆయన యౌవనము పరిసమాప్తి చెందింది. ఇప్పుడు ఆయన వయస్సు ఏబదియైదుసంవత్సరములు. ఆయన మాదిరిగానే ఒంటరిజీవితము గడిపేవాళ్ళ వద్ద, చిలుకలు, కుక్కలు, పిల్లులువుండడము పరిపాటి. కాని యీయన ఒక్కడే కోతిని పెంచుతున్నాడు. యిది అందరికీ కొత్తలో ఆశ్చర్యాన్నే కలిగించింది. తర్వాత అది కూడా పేటలో మనిషిమాదిరిగానే గణించబడుతోంది.

ఆరోజు సాయంత్రం నేను వసారాలో కూర్చుని వున్నాను. శశిధర్ బాబువద్దనుండి గోదా వుత్తరం తీసుకొచ్చింది. వుత్తరం చించి చూశాను. ఆయన వెంటనే రమ్మని వ్రాశాడు. మాయింటినుండి ఆయన యిల్లు ఎంతో దూరంలేదు. అయిదు నిమిషాలకంటె ఎక్కువ టైముకూడా పట్టదు. ఆయన డ్రాయింగ్ రూమ్‌లో నా కొరకెదురుచూస్తున్నాడు. నేను వెళ్లడంతోనే రండి, రండి, డాక్టరుగారూ కూర్చోండి. అని తన దగ్గరనున్న కుర్చీ చూపించాడు. గోదాను మూలనున్న కుర్చీమీద కూర్చోమని ఆజ్ఞాపించి తాను నాదగ్గర నేవున్న వేరె కుర్చీలో కూర్చున్నాడు.

ఆరోజు ఆయన చాలా సంతోషంగా కన్పించాడు. ఆయన కండ్లలో వుత్సాహం మెరిసిపోతూంది. ఆయన నవ్వుతూ "నేను మీకొక సంతోషవార్త వినిపిస్తున్నాను. ఇక ఒంటరితనాన్ని విడిచిపెట్టడానికి నిశ్చయంచేసుకొన్నాను. పెళ్లి చేసుకుంటాను" అన్నాడు.

నేను ఆయనవంకచూచి మౌనం వహించాను. ఆయన ప్రతిజ్ఞ ఫలించింది. వివాహం చేసుకునే రోజులుకూడా సమీపించినయ్. కాని వివాహమెలా అవుతుంది అనేదే సమస్య. ఇప్పటికే ముప్పాతిక జీవితం గడిచిపోయింది.

"సరే. మీ అపారధనసంపత్తి ననుభవించేవారెవరో త్వరలో కనిపించగా" అన్నాను.

"మీకు నావిషయం చెప్పనక్కరలేదు. నేను సంపూర్ణమైన ఆరోగ్యవంతుణ్ణి. యేరోగమూ రొదా లేదుకూడా. అయినప్పటికీ...!"

నేను ఆయనను అర్థంచేసుకోగలిగాను. ఆయన కే రోగమూ లేదు. కాని వయస్సదే ప్రశ్న. వయస్సు పెరిగినకొలదీ మానవగ్రంథులలోని జీవాణువులు నశించిపోతూవుంటవి. ఇదే వార్ధక్యదశ. శశిధర్ బాబుకు గూడ కలిగింది యిదేసందేహం.

"అయినా మీరు మీ కుటుంబజీవనాన్ని సుఖవంతం చేసుకోగలరా అనేదె ప్రశ్న" అన్నాను.

"నేను యిదికూడా ఆలోచించకపోలేదు. అందుకొక వుపాయం వుంది. వియన్నా వెళ్ళబోతున్నాను" అన్నాడు.

"వియన్నా!"

"అవును. డాక్టరు వారోనోఫ్ చికిత్సగురించి మీకు తెలిసుండవచ్చు. ఆయన పాతగ్రంథులస్థానంలో కొత్తగ్రంథులుచేర్చి వృద్ధులను యువకులుగా చేయగల సమర్థుడు."

"అవును, వారోనోఫ్ గురించి విన్నాను."

"మొట్టమొదటే నాకీ సందేహంకలిగింది. నాలుగు సంవత్సరాలనుండీ గోదా నిందుకే పెంచుతున్నాను. దీనికెక్కువఖర్చుకూడా అవసరంలేదు. విశేషశ్రమకూడా అనవసరము."

నా కిదంతా ఆశ్చర్యాన్ని కలిగించింది. శశిధర్ బాబు ప్రకృతినికూడా జయించాలనుకుంటున్నాడు. గోదా గ్రంథులు తీయించి తన గ్రంథుల స్థానంలో వినియోగించుకుంటాడు. ఆయన దూరదృష్టికి నే నచ్చెరువొందాను.

శశిధర్ బాబు మీ వుద్దేశ్యమేమిటని అడిగాడు.

నేను డాక్టర్ని. డాక్టరుహోదాలో విజ్ఞానాన్ని కాలదన్నడము అనూహ్యము.

నేను గోదావైపు చూశాను. గోదా నిశ్చలంగా మావైపు చూస్తోంది. బహుశా ఏదో చెప్పాలని చూస్తున్నట్టున్నది. కాని అసమర్థతవలన ఆ మూగజీవము చెప్పలేకపోతూంది.

గోదా బ్రతకదు. మొట్టమొదట బ్రతికినా, తర్వాత తొందరలోనే చచ్చిపోవడము తథ్యము అన్నాను.

దీని విషయంకూడా ఆలోచించాను. నా గ్రంథులు దానికి వుపయోగిస్తయ్. అప్పుడదిచాలా కాలం జీవిస్తుంది. అన్నాడు.

అయినా కష్టమైనపనే ననుకుంటూ దీనిద్వారా మానవగ్రంథులు వానరశరీరంలో ఎలా పనిచేస్తవో కూడా తెలుసుకోవచ్చు అనుకున్నాను. శశిధర్ బాబువద్ద సెలవుతీసికొని అదే ఆలోచనతో యింటికి తిరిగివచ్చేశాను.

అయిదారు మాసముల తర్వాత శశిధర్ బాబు వియన్నానుండి తిరిగివచ్చేశాడు. ఆయన వచ్చినది తెలిసి ఆయనను కలుసుకొనడానికి వెళ్ళాను. గోదా ద్వారంవదనే కూర్చొనివుంది. దానిలో ఏమీ మార్పు కనబడలేదు. పూర్వం మాదిరిగానే గంభీరంగాను శాంతంగానూ వుంది. కాని శశిధర్ బాబు ఆరోగ్యం పూర్తిగా మారింది. ఆయన వెనకటికంటె పదిసంత్సరాలు తక్కువగా కన్పిస్తున్నాడు. నేను నవ్వుతూ

"ఇప్పుడు మీ ఆరోగ్యం పూర్తిగా మారిపోయింది." అన్నాను.

శశిధర్ బాబు కళ్లెర్రజేసి క్రోధంతో అరిచాడు.

"ఛీ. నువ్వే నన్ను సర్వనాశనం చేశావు. నువ్వు వళ్ళవద్దని సలహాయిస్తే నా జీవితం యీవిధంగా నాశనమయ్యేది కాదు."

ద్వారమువంక చూపిస్తూ—"యిక నా యింటివద్దకు రావద్దు. మళ్ళీ ఎప్పుడైనా వస్తే గెంటిస్తా జాగ్రత్త" అని కండ్లెరిమాడు.

నేను నిర్విణ్ణుడనయ్యాను. శశిధర్ బాబు యీ స్వరూపం యిత:పూర్వ మెన్నడూ నాకల్పనకుకూడా రాలేదు. ఈయన

★ వానర గ్రంథులు ★

యీ విధంగా ఎందుకు క్రోధోద్రిక్తుడయ్యాడో కూడా నాకర్థం కాలేదు. యీ మార్పుకు కారణమేమిటి? తేజస్వంతమైన గోదాగ్రంథులే ఆయన నీవిధంగా మార్చినయ్యా?

ఈ సంఘటన జరిగిన కొద్దిరోజుల తర్వాత సంగతి యిది. ఒకరోజు వుదయానే డిస్పెన్సరీకి వచ్చాను. అక్కడిస్థితి చూచి ఖిన్నత జెందాను. ఎవరో కిటికీ విరగగొట్టి లోనికి ప్రవేశించారు. మందుల సీసాలన్నీ ముక్కలు ముక్కలై పోయినై. అయిదు వేల రూపాయిల నష్టం ఇలా చేసినందువల్ల లాభమేమిట? అని నాకు బాధ కలిగించింది తలవనితలంపుగా శశిధర్ బాబు గుర్తుకొచ్చాడు. అనవసరంగా ఆరోజున కోపోద్రిక్తుడవటము, ఆయన శరీరంలో వానర గ్రంథులు పనిచేస్తూ వుండడము యివన్నీ గుర్తుకు వచ్చాయి. బహుశా వానరగ్రంథులు మానవత్వాన్ని వానరత్వంగా మార్చి వేసినవేమో.

కాని ప్రతిరోజూ యిదేవిధమైన సంఘటనలు ప్రారంభించినై ఏదో ఒకయిల్లు కిటికీలు విరుగుతూన్నై. ఏదో ఒకనష్టం సంభవిస్తూనేవుంది. పేటలోనివాళ్ళంతా దీనివల్ల విసిగిపోయాం. పోలీసులకు రిపోర్టిచ్చాం పేటంతా యీ విచిత్రమైన దొంగను పట్టుకోవడానికి యువకులు కాపలా కాశారు. కాని నా సందేహము యింకా దృఢమయింది. ఇదంతా శశిధర్ బాబే చేస్తున్నాడని విశ్వసించాను. కాని యిది ఎవరికీ తెలియదు. తెలిపినా ఎవరూ విశ్వసించరు ఆయన నామీద పరువునష్టం దావా కూడా వేయవచ్చు అందుకనే మౌనంగా వూరుకున్నాను.

ఆఖరుకు దొంగ పట్టుబడ్డాడు. ఇది చాలా ఆశ్చర్యకరమైన సంఘటన గంభీర శాంతగుణాలు కలిగియుండి, ఆజ్ఞ లేనిదే ఆకైనా అంటుకోని గోదాయే దీనికంతా కారకురాలు అని తేలింది

క్షణంలో నే నిదంతా అర్థంచేసుకున్నాను. పాపపంకిలమైన శశిధర్ బాబు గ్రంథులు పాపరహితమైన గోదాలో పని చేస్తున్నయ్. గోదాలో మనుష్యత్వం లేని కారణంగా అపరాధాలు మరుగుపడక వెంటనే పట్టువడింది. శశిధర్ బాబు యివే దోషాల్ని చాకచక్యంతో ముప్పది సంవత్సరాలు కప్పిపుచ్చి సంఘాన్ని మోసం చేయగలిగాడు.

ఆరోజు శశిధర్ బాబు కోపాన్ని కూడా వూహించగలిగాను. ఆయన తన జీవితాన్నంతా సుఖమయం చేసుకోవాలనుకుంటున్నాడు. కాని నిష్కలంకమైన గోదా గ్రంథులు ఆయన దుర్వృత్తులనుండి మాన్పించుతున్నవి. ఆయన పాపపంకిలమైన జగత్తులో కాలిడలేక పోతున్నాడు. ఈవిధంగా ఆయన తన చిరాకాంక్షలను పూర్తిచేసుకోలేక ఆ కోపాన్నంతా నామీద కక్కాడు.

దినదినమూ శశిధర్ బాబులో నూతనమైన మార్పులు కలిగినయ్ ఇలాగే ఒకరోజు ఆయన వివాహవాంఛకూడా త్యజించివేశాడు. భోగంకంటె యోగమే ఆయనకెక్కువయ్యింది. నెమ్మది నెమ్మదిగా ఆయన యీ ప్రపంచపు మాయామోహాలన్నీ పరిత్యజించి విరక్త యోగిత్వాన్ని పొందాడు. ఇప్పుడు ఆయనకు సమాజంలో ఎక్కువ గౌరవంకూడా లభించింది. కాని నిష్కల్మషమైన గోదా జీవితమే దుర్భరమైపోయింది. పోలీసులు దానిని యినపకటకటాలలో బంధించివేశారు. అది ఆఖరుకు పిచ్చిదైపోయింది ★

కాలానికి విలువలేదు

సరిగ్గా ఎనిమిదయ్యేటప్పటికి కాలాంతకరావు 'యూనివర్సల్ టైమ్‌కీపర్స్' అనే వాచీకంపెనీ గుమ్మందగ్గర కొచ్చేడు. అతనక్కడ పనిచేస్తున్నాడు.

కుర్రాడు అప్పటికే తలుపులు తెరిచి, బూజులు దులపడం పూర్తిచేశాడు.

హోటల్లో 'చా' తాగి అహమ్మద్ హుస్సేనీ అనే మరోగుమాస్తాకూడా తిరిగి వచ్చాడు.

కాలాంతకరావు పని అంతా 'రిపేరింగు' శాఖలో. అక్కడ టేబిల్‌దగ్గర కూచుని వొచ్చిన ఆర్డర్లను తీసుకుని, డాళ్లవద్ద అడ్వాన్స్ తీసుకుని, రసీదుల్లో మళ్లీ ఏరోజు రావల్సిందీ రాసి రమ్మనమనడం.

వ్యాపారసరళిలో, మాటల చమత్కారంలో, కష్టమర్సుని బోల్తా కొట్టించే చాకచక్యంలో అతనిది పెట్టిందిపేరు.

అబిడ్ రోడ్డులో వున్న ఆ దుకాణానికి మీరూ ఒకసారి కాకపోతే మరోసారయినా వెళ్ళివుంటారు, మీకు వాచీ అనేదస లొకటుంటే.

కాలాంతకరావు కీ రాష్ట్రంలోని ఐదు భాషలే కాక అరవం, బెంగాలీకూడా కొంచెం కొంచెం తెల్సు.

అతని ఈ భాషాప్రావీణ్యమే అతనికి ఆ శాఖలో ఉద్యోగాన్ని తెచ్చిపెట్టింది.

బూజులు దులిపాక కుర్రాడు చెయ్యాల్సినపని గడియారాల్ని అన్నిటిని ఒకే టైముకు తీసుకురావడం. 'ఏ రెండు వాచీలు ఒకే కాలాన్ని చూపవు' అనేదానికి ప్రత్యక్షసాక్ష్యం కావాలంటే ఏ వాచీకంపెనీనైనా తెరిచేటప్పుడు చూస్తే కనపడుతుంది.

గడియారాలన్నీ సరిదిద్దేటప్పటికి తొమ్మిది అయింది.

కాలాంతకరావు కాఫీకి ఆర్డరిచ్చి తన 'కస్టడీ'లో వున్న గడియారాలనన్నీ పైకి తీసి 'షోకేస్'లో తగిలించసాగాడు. ప్రతీ వాచ్‌కీ రిపైర్ చార్జీ 8 నుంచి 30 రూపాయలవరకూ ఉంటుంది. మరమ్మతీలకోసం రోజుకి ఓ వంద వాచీలన్నా రాకమానవు. సాధారణంగా వాచీకంపెనీలకి అదే ఓ పెద్ద రాబడి.

సొంత వాచీ అనేది ఒకటీ లేకపోయినా అతని చేతిని ఎప్పుడూ 800 రూ.లు విలువచేసే వాచీ వుంటుంది. మరమ్మత్తులకొచ్చిన దాంట్లో మంచిదాన్ని ముందు బాగుచేయించి చేతికి అలంకరించుకుంటాడు. ఒకవేళ దాన్ని స్వంతదారు చూస్తే 'టెస్ట్' చేస్తున్నాను అంటాడు.

ఆ కంపెనీలో ప్రపంచంలో దొరికే రకరకాలైన వాచీలన్నీ వుంటాయి. ఆ కొట్టుకి మొత్తం విలువకట్టడం అసాధ్యం. అందులోకి ప్రతీవాడూ ఆకర్షించబడతాడు; ఆకర్షించబడిన ప్రతీవాడి పనీ సాలిగూటిలో దూరిన ఈగలా అవుతుంది; ఏదో ఒకటి కొనకండా బయటికి రాలేడు – బీదవాడైనా ధనవంతుడైనా! 20 నుండి 1500 రూపాయలవరకూ విలువచేసే వాచీలున్నాయి. అక్కడి గుమాస్తాలు 'కాఫీ' 'టీ'లు ఇచ్చి, 'కాప్స్టన్' సిగరెట్‌లు ఇచ్చి ఎలాగో ఒకలా వాళ్ళని లోబర్చుకోగలుగుతారు. 'ట్రాప్'లో పడుతున్నామనే ఆలోచన ఆ ఖాతాదార్లకి తెలీదు. ఏదో లాభసాటి బేరంతో బయటపడుతున్నామనుకుని సంతోషిస్తారు, ఆ అమాయికులు. కాని వాళ్ళు వెళ్ళగానే

శాంతి కృష్ణమూర్తి

గుమాస్తాలు వాళ్ళల్లోవాళ్లు నవ్వుకుని 'ఎంతలా టోపీ వేయగలిగిందీ?' 'ప్రజలు ఎంత అమాయికులైందీ!' తెల్సుకుని సగర్వులవుతారు.

అంతకంటె ఆశ్చర్యకరమైన విషయాలు కాలాంతకరావుశాఖలో జరుగుతాయి.

"ఏమండీ నావాచీ నాలుగు నిమిషాలు ఫాస్ట్ తిరుగుతోందండి"

"నావాచీ 8 నిమిషాలు స్లో తిరుగుతోందండీ."

"నావాచీకి రేడియం డైయల్, ముళ్లు, స్టెయిన్‌లెస్‌స్టీల్ కేనూ వెయ్యాలండీ."

"నావాచీకి ఓవర్ ఆయిలింగ్ (ఓవర్ హాలింగ్ అనడానికి బదులు) చెయ్యాలండి"

ఇలా అనేకులు అనేకవిధాలైన రిపేర్లకోసం వస్తూంటారు. వాళ్ల అమాయికత్వాన్ని చూస్తే అతనికి ఆశ్చర్యం, విషాదం కలుగుతాయి. ఓ నిమిషం ముందుగా నడుస్తేనేం, ఓనిమిషం ఆలస్యంగా తిరుగుతేనేం? ఏదో పుట్టె మునిగిపోయినట్టు ఎందుకూ ఈ అనవసరపు ఖర్చు. నిజంగా మనుషులు 'సెకన్ల'మీద నడుస్తున్నారా?"

అతనిలో అతను నవ్వుకునేవాడు. కాని అతనిఉద్యోగమే అది! ఎవళ్ళకిగాని వాళ్ళ అమాయకత్వాన్ని ఎత్తి చూపడంకన్న, నిర్లక్ష్యంచేస్తేనే ఎక్కువ సంతోషం కలుగుతుంది. 'పై ప్రజలు మూర్ఖులు; గ్రహించలేరు' అనుకుని ఆత్మసంతుష్టి చెందుతారు. కాని వెనకాల నవ్వులూ, హేళనలూ వాళ్ళకు తెలీవు.

కాలాంతకరావు ఇంటర్ ఫెయిలయ్యాడు. అతని విజ్ఞానశాస్త్రంమీద గల గాఢాభిమానం మాత్రం చావలేదు. అందువల్ల విజ్ఞానశాస్త్రంలో గల పుస్తకాల్నన్నిటినీ వీలుదొరికినప్పుడు చదివేవాడు. ప్రజల వింతభావాల్ని చూసినప్పుడు మనస్సులో ఇలా అనుకునేవాడు:

'కాలం అంటే ఏమిటి? దానికి ఓ విలువ వుందా? మనం అనుకునే కాలప్రమాణం, నెలలూ, రోజులూ, గంటలూ, నిమిషాలూ, క్షణాలూ, తారీఖులూ వీటన్నిటికీ నిజమైన విలువలున్నాయా? ఏ క్రీస్తుచావుతోనో, పుట్టుకతోనో లేక, ఇంక దేనితోనో సంబంధాన్ని పెట్టుకుని కాలపుకొలతలు నిర్ణయించుకుని దానికి దాసులమవడం మన మానసిక దౌర్బల్యాన్ని చూపించదా?'

ఎంత ఆలోచించినా అతనికి కాలానికి స్వంత విలువవున్నట్టు తోచలేదు, దేనితోనో 'రెలెటివ్'గా ఆలోచిస్తేనే తప్ప.

అదీగాక ఏ రెండు వాచీలు ఒకే కాలాన్ని ఎప్పుడూ చూపించవు అనే యధార్థాన్ని అతను కళ్ళారా రోజూ చూస్తేనే వున్నాడు. అందుకనే తన దుకాణంలో రోజూ మూడు గంటలకొకసారి గడియారాలటైంని కలపవల్సి వొస్తోంది. దానికోసం నలభైరూపాయల జీతంమీద ఒక కుర్రాడ్ని నియమించుకున్నారుకూడా!

'సూక్ష్మదృష్టితో చూస్తే ఏదో ఒక ప్రమాణంలేకపోతే సాధారణపు పనులు జరగడం కష్టం. అందుకే ఈగడియారాలూ, వాచీలూ' అనుకున్నాడు.

వాచీలు షోకేస్‌లో తగిలించి, కాఫీ సేవించేసరికి, ఎవరో వచ్చి "ఈ వాచీ చూడండి; మరమ్మతు కెంతవుతుందో" అనసాగారు.

కాలాంతకరావు లేని నవ్వుని తెచ్చుకుని తన పనిలో నిమగ్నమవసాగాడు. ★

సుఖం కావాలి

"నేను శూన్యాన్ని కాదు, నేను పదార్థాన్ని కాదు. నేను మంచిని కాదు. చెడ్డనూ కాదు. నేను గౌరవం కాదు. అగౌరవాన్నీ కాదు........." పెరుమాళ్లు గారి ఉవాచ ప్రారంభమైంది. ఎంత ప్రశాంతంగా కూర్చున్నాడు! కృష్ణాజినంపై పద్మాసనం వేసుకొని కూర్చున్నాడు. అర్థనిమీలిత నేత్రాలతనికున్నయ్. నున్నగా గొరిగించిన తల. మెడలో రుద్రాక్షమాలలు. విశాలమైన నుదిటిపై విభూతిరేఖలు. గంభీరమైన స్వరంతో, చిరునవ్వుతో కళ్ళార్పకుండా తీవ్రంగా బోధిస్తున్నారు.

"నేను ఆకాశాన్ని కాదు. నేను భూమినీ కాదు. నేను జలాన్ని కాదు. నేను వాయువునీ కాదు, నేను అగ్నిని కాదు........." చెప్పుకుపోతున్నారు.

సూరమ్మగారు రెండు కలకత్తా జామపండ్లు వారెదుటుంచి నమస్కరించి జనంలో కూర్చొంది. రంగమ్మ కూతురు పంపరపనసపండొకటి వారి పాదాలదగ్గరుంచి ప్రణమిల్లి తరించింది. ఫలాలు సమర్పించారు. ఒక్క క్షణంలో ఆ వేదిక పళ్ళదుకాణంలా అన్ని విధాల ఫలాల్తో నిండింది. తల్లులొడిలో కూర్చున్న పిల్లలు గుటకలు మింగతూ చూస్తున్నారు. ఒక రాకాయల్ని భద్రంగా మూటగట్టి వారి ప్రక్కనుంచారు.

ఇదంతా జరుగుతున్నా పెరుమాళ్ళవారు చెప్పట మాపలా. వారు కొనసాగిస్తూనే ఉన్నారు. "నేను నిత్యం కాదు, నేననిత్యం కాదు. నేను వెలుతుర్ని కాదు, వెలుగునూ కాదు. చీకటినీ కాదు........."

ఇందాకటినుంచి వింటున్న సుబ్బయ్యకిక ఓపిక లేకపోయింది వినటానికి. అయినా ఏంచేస్తాడు వడిచే శక్తిలేనప్పుడు. చల్లని ఆ పందిరినీడలో అట్లాగా చతికిలబడి వింటున్నాడు.

ఏమిటని వింటాడు. అతని కేమీ అర్థం కావటం లేదు. వెలుగు కాదట, చీకటీ కాదట, ఏదీ కాదట. మరేమిటిక వీడి మొఖం. ఒక్కటీ సరిగ్గా చెప్పడేం. ఏదీ కాదంటాడు. ఏది మరి? అన్నీ లేకపోతే, ఏదీ కాకపోతే ఇక మిగిలిం దేమిటి? ఆలోచిస్తున్నాడు ప్రశ్నలు వేసుకుంటూ సుబ్బయ్య.

ఆలోచించి ఆలోచించి ఒక నిశ్చయాని కొచ్చాడు — దారేదో తనకు తెలియనిది చెప్పుకుంటున్నారు. వెధవ నిశాని కొయ్యకు నాకేం తెలుస్తుంది. ఆ అర్థం ఆ వేదాంతం అనుకున్నాడు.

అసలు వేదాంతమంటే అర్థం కానిదని అతనికి తెలియదు. ఈ వేదాంతులంతా ఏ విధంగా పీఠంపై కెక్కారో అతనికేం తెలుసు మరి. వేదాంతమంటే ఇతరు లర్థం చేసుకోలేనిది. వాక్యంలోని అన్ని పదాల కర్థం తెలుస్తుంది. తాత్పర్యం తెలుసుకోవాలని ప్రయత్నిస్తే అంతుచిక్కదు.

'గుప్పిట మూయండి ఏమిటి చూస్తున్నావు. గుప్పిట తెరువు. ఏమిటి మార్పు. ఈ రెంటికీ తారతమ్యమే నిశ్చలతత్వం.' ఇట్లా ఉంటుంది వేదాంతం. చెప్పేవారి కర్థమాతుందా? అది వారికే తెలియరానిది. తెలుసుకోవాలని ప్రయత్నించినా తెలుసుకోబడనిది. కొందరు ప్రయత్నించి ఒక్కో అర్థం ఒక్కొక్కరు సాధిస్తారు. అదీ వేదాంతం.

జి. సి. హెచ్. వెంకటేశ్వర్లు

ఈ చిక్కులన్నీ సుబ్బయ్య కేమి తెలుసు. ఇన్ని మెలికలున్నాయని అతనెప్పుడూ అనుకోలేదు.

"అశాశ్వతంలోనుండి శాశ్వతం జనిస్తుంది. అనిత్యంనుండి నిత్యముద్భవిస్తుంది. అపకారంనుండి ఉపకారం పుట్టుకొస్తుంది. కష్టంనుండి సుఖం పుడుతుంది..."

అక్కడాపాడు. వెనుతిరిగి రాగిచెంబు పాలు గుక్క త్రిప్పకోకుండా సేవించారు. కండువాతో మూతి తుడుచుకొని చిన్న తేపు తేమిల్చాడు. ఎదురుగా పసిపిల్లవాడు వాళ్లమ్మను కౌగలించుకొని వణికాడు. దూరంగా గాటికి కట్టివేసిన పెయ్య పారిపోదామని తన్నుకుంది, 'అంబా' అని అరచింది.

అతని ఆఖరు వాక్యాలు విన్నాడు సుబ్బయ్య - 'కష్టంనుండి సుఖం పుడుతుంది' నిజంగానా? అతనికళ్ళు మెరిసినై. సంతోషంతో పొంగిపోయాడు. తన కష్టాలుపోయి ఎప్పుడయినా సుఖం వస్తుందా. స్వాముల వారు చెపుతున్నారు నిజమెందుకు కాకూడదు!' అతని కనుమానంలో ఆనందం పొటమరించింది.

స్వాములవారి ఆ వాక్యం సుబ్బయ్యకు సరిపడింది. ఇందాకటినుండి వింటున్న దతనికేమి రుచించలా. దాని సారం యీ ఒక్క వాక్యంలోనే ఉందనుకున్నాడు. అతని అజ్ఞానంలో వెలితిగా ఉన్న కొరవను ఆ మాటలు పూర్తిచేసినై. తన దుఃఖపు లోతుల్లో సుఖమనే ముత్యాలున్నాయని అతను సంతసించాడు.

'నాకేం తెలుస్తయ్ వారిమాటలు. తెలుసుకోక మొదట తిట్టాను. తప్పు చేశాను.' చెంపలు వాయించుకోబుద్ధేసింది సుబ్బయ్యకు.

తన కష్టాలనుండి సుఖం వస్తుందా? ఎట్లా వస్తుంది? ఎప్పుడు వస్తుంది? అతను భవిష్యత్తులో షికారు చేశాడు.

సుబ్బయ్య చక్కిడాలమ్మకునే సుబ్బయ్య. కాంతమ్మదగ్గర అరువుకేసుకొని అమ్ముతుంటాడు. రోజూ మూడుబందలు చక్కిడాలమ్ముడు పోయేటప్పటికి గగనమౌతుంది. ఆ ఊళ్ళో సుబ్బయ్య ఒక్కడేనా! పొట్ట చేత్తో పట్టుకుతిరిగే సుబ్బయ్యలు చాలమందున్నారు. అందరూ ఒకే పని చేసుకుంటున్నా, ఒకర్ని చూస్తే ఒకరికి కోపం. ఉన్న బేరమంతా వాడే కాజేస్తున్నాడని వీడు. వీడు కాజేస్తున్నాడని వాడు.

పోటీలు పడినట్లు బస్సుస్టాండుదగ్గరా, సినిమాహాల్సుదగ్గర, అరచినవాడు అరచినట్టే ఉంటాడు సుబ్బయ్య. సాయంత్రం ఎనిమిది గంటలదాకా చచ్చి చెడి తిరిగి కాంతమ్మింటికి చేరుకుంటాడు. వచ్చిన కానుల్ని అర్థణాల్ని ఆమె చేతిలోపోస్తాడు. ఇచ్చిన కూలీ జేబులో వేసుకొని ఇంటికి పోతాడు. త్రోవలో ఒకర్థణా బీడీలు కొనుక్కుంటూ తేనా.

ఇంటికంటే వాళ్ళింటికి కాదు. సుబ్బయ్యకిల్లు లేదు. వల్లాటి పెద్దమ్మల్లే తన కాదరమిచ్చేది. అక్కడికెళ్ళి కాస్త అన్నం వండుతాడు. అవిసమాత్రం ఊరికే పెడుతుందా. పావలా ఫీజు చెల్లించుకుంటాడు. వర్షంలో కాలత్రప్రకారం ఒక కవరు మేసి, ఇంత కొరివి కారమో, గోంగూర పచ్చడో వేస్తుంది. దాంతో సరిపెట్టి లేవాలి. అంతటితోనే ఆ పెద్దమ్మ ఋణం తీరదు. మూడువు గడ్డి కావాలన్నా, ఇంట్లో నెచ్చాలు తెచ్చి పెట్టాలన్నా సుబ్బయ్యే చేయాలి ఆ పనులన్నీ.

అన్నం తిన్న తరువాత కడుపునిండా మంచినీళ్లు పోస్తాడు. "ఇంట్లో నీళ్ళన్నీ నీ పొట్టకే పోస్తున్నా. ఎక్కడ నీళ్లు నీకే హరించిపోతున్నయ్"అని ఒకవైపు తిడుతూ పోసిన ఆ నీళ్లు త్రాగుతాడు. బీడి కాల్చుకుంటూ సినిమాహాలుదగ్గర కెళ్తాడు మిగిలిపోయిన చక్కిడాలు వేసుకొని. సినిమా వదిలిపెట్టేదాకా ఉంటాడు. సూరమ్మకు రెండో లెక్క అప్పజెప్పి మళ్ళీ బజారు వెళ్తాడు. కొంచెందూరం నడిచి అటు ఇటు

★ సుఖం కావాలి ★

చూచి ఒక సందులోకి వెళ్తాడు. అదొక పూరిల్లు. దాంట్లో ప్రవేశిస్తాడు జేబులో డబ్బులు తడువుకుంటూ. వచ్చేటప్పుడు దొంగల భయముండదు. పూర్తిగా మత్తెక్కి ఇంటిముఖం పడతాడు. అతని కిల్లు లేదు. మరెక్కడికి? పెద్దమ్మింటికా? రాత్రి అక్కడికి రానీయదు. అన్నం తినేవరకే అది సుబ్బయ్యిల్లు. రోడ్డువెంబడి ఏ చెట్టు క్రిందనో, కొట్టు అరుగునో త్రోవతీస్తాడు. కొంచెంసేపు హుషారుగా పాడతారు. ఆ పాట కంతుంపెదు. సినిమా పాటలు అవీ అన్నీ దాంట్లో ఉంటయ్. సంగీతంతో పాడుతున్నానని సంతసిస్తాడు. ఎప్పుడో నిద్రపడుతుంది. తెల్లవారేదాకా ఏమీ తెలియదు. అప్పటికిగాని కైపు దిగదు. అతనికి కలలుకూడా రావేమో. తెల్లవారగానే మళ్ళీ మొదలు 'చక్కిడాలు! చక్కిడాలు!'

ఎంతకాలంనుండలా! ఎన్ని రోజుల నుండి అరుస్తున్నాడు! ఎన్నిసార్లు అరచాడు! చక్కిడాల సుబ్బయ్యని ఊరంతా గుర్తించగలిగారంటే ఎన్నిసార్లు గొంతు పారించుంటాడు?

ఎవరు పిలిచినా 'చక్కిడాల సుబ్బయ్యా'నే. అతని కింటిపేరు లేదు. ఉన్నా అతనికి తెలియదు. అతనెవరో అసలతనికి తెలియదు. ఇక యితరుల కెలా తెలుస్తుంది? ఒకటిమాత్రం అతనికి బాగా గుర్తు - చచ్చిపోయిన పుల్లమ్మపిన్ని బ్రతికుండగా చెప్తుండేది. 'మీఅమ్మ చెడి నిన్నుకని భూమిమీద పడేసి చచ్చింది. అప్పటినుండి నేనే పెంచాను. నిన్నింతటివాడిని చేశాను. నాకూ ఎవ్వరూ లేరు. నేనూ అడుక్కుతినేదాన్నే. నన్నెట్లా ఎల్లమారుస్తావో' అనేది. ఆమాటలు గుర్తుకొచ్చినప్పుడేడుస్తాడు. ఎవరికీ చెప్పడు. అడిగినా బదులు చెప్పడు. ఏమిటేమిటో ఆలోచించుకొని కుమిలిపోతాడు. అతని జీవితంలో కంటతడిపెట్టి విచారించేవిషయ మదొక్కటే.

తను హాయిగా బ్రతుకుతున్నాడో సుఖంగా బ్రతుకుతున్నాడో అతనికి తెలియదు. అతని జీవితం కష్టమో, దరిద్రమో అంతకన్నా తెలీదు. ఆ పదాల కర్థమే ఊహించలేదు.

ఏవో నాలుగు డబ్బులు సాయంత్రానికి మిగుల్తయ్. వాటితో రెండుడ్రాములసారా వస్తుంది. అది త్రాగి ఊరుకుంటాడు. లేకపోతే సినిమాకు పోతాడు. ఎక్కడో పడుకుంటాడు. తెల్లవారి లేచేదాకా అక్కడున్నానని అతనే తెలుసుకోలేడు. దుమ్ముదులుపుకొని రత్తమ్మదగ్గర కెళ్తాడు. 'చక్కిడాలు! చక్కిడాలు!' అరవటం మొదలుపెడతాడు.

అతనికి రెండువారాలనుండి తెలుస్తుంది కష్టమంటే ఏమిటో. చలిజ్వరం తగిలింది. ఉండుండి నరాలుండచుట్టుకు పోతయ్. పనిలో కెళ్ళటం మానేశాడు. ఇన్నాళ్ళు రత్తమ్మ కొదాచేసిచ్చినా అవసర మొచ్చినప్పుడాదుకోలా సుబ్బయ్యను. అప్పేమీయాయలా. పెద్దమ్మ మహాకష్టంమీద అన్నం పెడుతుంది. అదీ ఒకపూట పెడితే మరోపూటుండదు. ధర్మాసుపత్రి మందు త్రాగాడు. ప్రయోజనమేమీ లేదు. ప్రయోజనం ఏ సుబ్బయ్యకూ ఉండదు. మంచినీళ్ళకన్నా తేలికా మందనబడే సీసాల్లో ద్రావకాలు. వాటి కేరుచులూ ఉండవు. రెండు వారాలనుంచి సేవిస్తున్నాడా మందు. ఏమీ తగ్గలేదు. సూదిమందేస్తే త్వరగా పోతుందని డాక్టరు చెప్పాడు. కాని రెండు రూపాయలన్నా యిచ్చుకోవాలట. ఎవర్నడిగినా ఉత్తచేతులు బోర్లించేవారేకాని 'యిదుగో సుబ్బయ్యా యీ అర్థపుచ్చుకో, ఇంకెవరినైనా మరో అర్థ అడుగు' అన్నవారు లేకపోయారు. చలిజ్వరంతో దగ్గుకూడా ప్రారంభమైంది. అన్నంలేక ఎండుకున్న డొక్కల్ని దగ్గుతో బాధపరచేసరికి రొప్పు, ఆయాసం ప్రబలినై. సుబ్బయ్యింకెన్నో రోజులు బ్రతకడని రత్తమ్మింకెవరితోనో అంటుండగా కూడా ఒకసారి విన్నాడు. ఇదంతా అతనికి కష్టమనిపించింది.

చలివేస్తుంది, అది అతని కష్టం. దగ్గు వస్తుంది. అదే అతని కష్టం.

"కష్టంలోనుండి సుఖం పుడుతుంది. నిజమేనా? నా చలిజ్వరం పోతుందా? సుఖపడతానా?" అని ఆలోచిస్తున్నాడు.

కష్టమంటే చలిజ్వరం

సుఖమంటే జ్వరం పోవటం

అదీ అతను గ్రహించింది. అతనికి సుఖం కావాలి. అంటే కట్టుకోటానికి సిల్కుపంచెలు,పట్టుఉత్తరీయాలుఅవసరం లేదతనికి. తింటానికి హల్వాలు, పల్వాలు, లడ్డూలతను కోరటంలా. ఉండేందుకు మిద్దెలు, మేడలు వాంఛించటం లేదు. అవేమీ సుబ్బయ్య కవసరంలా. అవి సుఖం కాదు. చలిజ్వరం పోవాలి, అది సుఖం. అది కావాలతనికి.

"ఈశావ్యాసం. మనుజునకొక ప్రకృతి. లోకోభిన్నరుచిః. కాని కామం అందరికీ ఉంది. అది వీడాలి. అది నిశ్చలమైన స్వరూపం. భోగాన్ని త్యాగం జేయాలి. ఆనాడావిర్భవించిన సుఖాని కంతుండదు"

మళ్ళా సుబ్బయ్య సుఖమనే పదం విన్నాడు. 'ఉంది సుఖం' అనుకున్నాడు. పూర్తయింది కాలక్షేపం. హారతిచ్చారు. లేచిపోయారు భక్తులు. సుబ్బయ్య చలితో వణుకుతూ అన్నాడు.

"సుఖం కావాలి"

"సుఖం కావాలి"



“బలరామ్‌పూర్ ఆస్పత్రిలో ఉన్న తోకేలుబాలుడిని తోకేళ్లు పెంచి ఉండవు. అదంతా నాటకం”

“మైసూర్ జంతు ప్రదర్శనశాలలో ఆమరణాంతం నిరశనవ్రతం పట్టిన పాము అసలు నిరాహారదీక్షే పూనలేదు”

“కూర్గు ధనలక్ష్మి నిజంగా అన్నపానాదులు ముట్టుకోటం లేదు”

“మార్క్సు ఆర్థిక సాంఘిక సూత్రాలు తప్పు”

“శ్రీనాథుడికి సీసపద్యం రాయడం రాదు”

“విశ్వనాథ సత్యనారాయణగారు రామాయణం మూలం చదవలేదు. చదివినా అది వారికి బోధపడి ఉండదు”

ఒక్క వారంలో ఎన్ని వార్తలు విన్నా! పూర్వం నిత్యసత్యాలుగా చెలామణీ అయిన విషయాలు టపీమని అబద్దాలు అని వింటే ఏమిటో అనిపిస్తుంది. ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్కరి ప్రకటనలని ఖండించుకూనే ఉన్నారు. స్వవచోఘాతాలు మరీని. “అప్పుడప్పుడు ఒపినియన్సు ఛేంజి చేస్తూఉంటే నే గాని పొలటీషియన్ కానేరడు” అని గిరీశం గారు సెలవిచ్చాడు. రాజకీయవేత్తలు ఏమన్నా-మనమేం లక్ష్యపెట్టం. ఏమంటే, లక్ష్యపెట్టినా పెట్టకపోయినా వాళ్ళు అంటూనే ఉంటారు.

లోగడ అట్లాంటిక్ ఛార్టరు అని ఏదో ఉండేది. దాన్లో ప్రపంచం ఉద్ధరించడానికి పెద్ద పెద్ద బుర్రలు ఏమిటో ఏమేమిటో నిర్ణయించేరని మనమంతా భ్రమపడ్డాం. చాలాకాలం పత్రికలు పతాక శీర్షికలు పెట్టి సదరు అట్లాంటిక్ ఛార్టరుగురించి ఏవేవో ప్రచురించాయి. తీరా ఒక మంచి చెడ్డరోజు చూసి అది తిలకాష్ఠ మహిష బంధనం అని తేల్చేశారు.

అలాగే, “శ్రీబాగు పాక్టు” అని అరవ బలసినంత అరిచారు. దాన్ని ఆచరించకపోతే అటు సూర్యుడిటు ఉదయిస్తాడు; సాగరాలు ఇంకిపోతాయి; గ్రహాలు గతులు తప్పుతాయి; ప్రళయం సంభవించేస్తుంది అన్నారు. కర్నూలులో రాజధాని పెట్టేశారు. వైజాగులో హైకోర్టు అంటున్నారు. “శ్రీ బాగుపాక్టు” ఏమయిందో మనకి తెలియదు; ఏంచేశారో చెప్పరు. ఇవన్నీ గిరీశం గారి ధోరణిలో “అప్పుడప్పుడు ఒపినియన్సు ఛేంజి చేయడం.” రాజకీయాలు

ఇలాగే అఘోరిస్తూ ఉంటాయిగాని తదితర విషయాల్లోకూడా తక్కిన ప్లేటు మార్పుగాస్తే మనస్సు చివుక్కుమంటుంది.

అమెరికా రచయిత ఒకడు మార్క్సు సిద్ధాంతాలు తప్పఅని ఋజువు అయినట్టు రుజువుచేస్తూ ఒక పుస్తకం రాశాడట. మార్క్సు సిద్ధాంతాలు రైటో తప్పో తేల్చవలసినది మహామహా తెలివైన వాళ్ళకి గాని చేతకాదు. మనలాంటి సగటు బుర్రలకి అది కొరుకుడు పడదు. అయినా ఓ ఇరవై ఏళ్ళపాటు కాంగ్రెసులో ఉంటూఉండే సోషలిస్టులూ – ఆ రోజుల్లోనే నెహ్రూగారూ మరీమరీ పెద్దవాళ్లు “మార్క్సిజం - మార్క్సిజం” అంటే “ఓహోహో” అన్నాం. మార్క్సు ఇలా అన్నాడు కాబట్టి ఇలా జరుగుతుంది అని ఎవరైనా తెలిసినవాళ్ళు చెప్తే టక్కున నమ్మేవాళ్లం. కాలం మారిపోయింది.

రాజకీయాలు, సాంఘిక ఆర్థిక సిద్ధాంతాలు ఎలాగా ఇలా ఉంటాయని, మనల్ని తికమకలు పెడతాయని మనకు తెలిసిందే వాటిని కొంచెం పట్టించుకోడం మానేద్దాం. మరి తతిమ్మా విషయాలు? “శ్రీనాథుడికి సీసపద్యాలు రాయడం చేతకాదు.” “విశ్వనాథ సత్యనారాయణగారు రామాయణం మూలం చదివిఉండరు” వగైరా వగైరా విషయాలు ముందు మనవిచేశానే - అవి వింటే ఎలా ఉంటుంది. సాహిత్యం విషయం తరవాత మాట్లాడుకొందాం గాని “తోకేలు బాలుడు” “పాము ఉపోషం” వాటిని చిత్తగించండి.

రుడ్‌యార్డ్ కిప్లింగ్ కథానాయకుడిలాంటివాడు మనతిరంలో మన కళ్లముందు (పేపర్లలో) కనబడ్డాడని ఎంత మురిసిపోయాం. తీరా అదంతా అబద్ధం అంటే ఎలా నమ్మడం. ఎంత ఆశాభంగం! మద్యనిషేధం తొలగిస్తామంటే ఉపోషంఉంటానని బెదిరించేవాళ్ళు, రావలసినది రాకపోతే అభోజనం ఉండేవాళ్లు రోజురోజుకీ పెరిగిపోతున్న రోజుల్లో ఒక పాముకూడా నిరాహారదీక్ష పూనిందంటే ఎంత ముచ్చటగా ఉంటుంది.

నాగరాజు నిరశనవ్రతంగురించి చదివిన రెండురోజులకే “అబ్బే అలాంటిదేం లేదు పాము ఘనపదార్థాలు తినటం లేదుగాని నీళ్లు ముట్టుకూ తాగుతున్నాది. అది నిరశనవ్రతం కాదు” అంటూ ఖండనవార్త పడ్డాది. ఇది ఎలా నమ్మమంటారు చెప్పండి. రాజకీయ

నాయకులు నిరశనవ్రతాలు చేస్తున్నా మంచినీళ్ళుముట్టుకూ తాగుతూ ఉంటారు. నాగరాజు తప్పకుండా నిరాహారదీక్ష పూనినట్టే అని భావిస్తున్నాను. దాని కనీసపు కోర్కెలు తీర్చేస్తే మంచిది.

ఈమాదిరిగా పూర్వంపడ్డ వార్తలని ఖండించుతున్నట్టే మరికొన్ని వార్తలకి ఖండన జరిగితే చాలా సంతోషిస్తాం. కుంభమేలాలో చచ్చిపోయినవాళ్ళు బ్రతికే ఉన్నారు అని వార్తవస్తే ఎంతబాగుంటుంది! కాని అలాంటివి కాక ఎందుకూ పనికిరాని ట్రామ్‌వార్తలే తప్పని సవరణలు పడుతూ ఉంటాయి. లోకంలో ఇలాగ జరిగే విషయాలు మన నిత్యజీవితంలోకూడా జరిగితే బాగుండును.

మా కిరాణాకొట్టువాడు బాకీ నూరు రూపాయలు దాటిందని ఒక వార్త ప్రకటించాడు. అది వెంటనే తీర్చకపోతే “ఏదో చేయగలను” అని బెదిరింపుకూడా ప్రచురించాడు. ఈ రెండు వార్తలు అబద్ధం అని, అదంతా నాటకం అని తెలియకూడదూ? వట్టిది. అలాంటివి జరుగుతాయా?

* * *

మనకి ఒక సామెతఉంది. “పిల్లికి బిచ్చం పెట్టడు” అని. దీని పూర్వగాథ విజ్ఞులకే తెలుసుగాబోలు. ఈ సామెత నిజమో ఏమో కాని “పిల్లికి పింఛను ఇవ్వడం” ఈమధ్య జరిగింది. పంజాబులోని ఒక కోర్టువారు - వినయవిధేయతలతో, స్వామిభక్తితో, విశ్వసనీయంగా ఒక పిల్లి పని చేస్తూ ముసిలిదయిపోవడంవల్ల దానికి యావజ్జీవ పింఛను మంజూరు చేయడానికి నిశ్చయించారు. పిల్లిని ఆఫీసులో నియోగించడానికీ, కింద ఆఫీసు పై ఆఫీసుకీ, పై ఆఫీసు ఆ పై ఆఫీసుకి ఉత్తరాలు రాయడం మొదలైన తతంగాన్ని చిత్రిస్తూ హేళన చేస్తూ ఒక ప్రఖ్యాత విదేశీ కథ ఉంది. దాన్ని ఒకళ్ళిద్దరు తెనిగించారు కూడా. అటువంటి “రెడ్ టేపు” సంకెళ్ళలో పడ్డాదో లేదో గాని పంజాబు కోర్టులోని పిల్లి రిటైరుఅవడానికి ముందు అదృష్టవంతురాలనాలి. దక్కగా ఉద్యోగం చేసుకొంటూ ఉండేది. “అయమ్ పటాటోపః” అన్న బాధలేకుండా అదాలత్ వారు దానికి పాలుపోస్తూ ఉండేవారు. తీరా రిటైరు

(40-వ పేజీ చూడండి)

నిద్రపోతున్న నిజం

"నాన్నా! నేను చచ్చిపోతున్నాను నాన్నా! - విషం - విషం పెట్టారునాన్నా! నా - నాకు కాఫీలో విషం - విషం కలిపి - ఇచ్చారునాన్నా! నా - నా - న్నా! పోతున్నాను. పో - పో - తూన్నాను నాన్నా!"

విశదమై - నోటినించి నల్లటి ద్రవపదార్థం వెలువడుతూవుండగా - మాట్లాడ లేక - మాట్లాడ లేక - దీనాతిదీనంగా తోచే ముఖంతో మంజుల లీలగా ఎదుట నిలువగా గాఢనిద్రలోనించి ఉల్కిపడి లేచాడు మాధవరావు. కలలోని మంజులరూపం - మాటలు - స్మృతినించి దూరం కాక పోవడంమూలంగా గుండెలు - అంతటి గాంభీర్యాని గుండెలూ జలదరించేయి నిద్ర కండ్లతోనే గోడగడియారాన్ని చూచాడు. తనకలలో గాంచిన ఘటన యథార్థమే అంటూన్నట్లుగా టంగు - టంగున అయిదు గంటలు కొట్టింది గడియారం. ఆ అయిదు గంటలూ అయిదు సమ్మెట పెట్లులుగా గుండెల్ని తాకి నిలువునా వడవడ వణికించినై! - ఆక్షణికంలోనే ప్రపంచంలోని దుఃఖితుల దుఃఖాన్ని ఏకగొంతుతో వెలిపెట్టినట్లు మ్యునిసిపల్ సైరన్ పెనుమ్రోతతో కూతకూసి విరమించింది.

రెండుమూడునిముసాలు అలానే మంచం మీద కూర్చుండి కండ్లు మూసుకున్నాడు మాధవరావు. - కలలను, అందులో పగటి కలలను విశ్వసించేవాళ్లు ఈ ఇరవయ్యోశతాబ్దిలో నూటకీ కోటికీ ఒక్కరైనా వుండడం కష్టమే. అలాంటప్పుడు పెద్దగా ఇంగ్లీషు చదువులు చదివి - పూర్వాచారాలను నమ్మకాలనూ ఏనాడో పరిత్యజించి - నవనాగరీకతాజీవితవిధానంలో కొంకలుతీరిన మాధవరావువంటివారు కలలో చూచినదాన్ని నిజంగా భావించడమంటే నమ్మశక్యం కానివిషయమే. అయినా మాధవరావు ఆ క్షణాలలోమాత్రం - తనలో తాను లేడని చెప్పక తప్పదు. తన ముద్దుబిడ్డ మంజుల విషప్రయోగంతో ప్రాణాలను ఆక్షణంలో కోలుపోతూన్నట్టే బాధపడి పోయాడు. సాయంకాలం ఎండపడమట కిటికీలనించి తన కాళ్ళముందుకు పాడుచుకుంటూ వుండగా స్థంభీభూతుడై అటేమాస్తూ వుండిపోయాడు చాలా సేపు. హృదయంలో చెప్పరానంత వేదన బయలుదేరింది.

సుమారు పావుగంట అలా నిశ్శబ్దంగా-నీరవంగా గడచిపోయినతరువాత వానిచెదరిన హృదయం కుదుటబడింది. లేచి ఒళ్లు విరచుకున్నాడు. ఈ కొద్ది సమయంలోనూ తనలో ఏర్పడిన ఈ దుర్బలతను తలచుకొని ఆశ్చర్యపోయి—"ఎంత విచిత్రం! కలతో ఇంతటి కల్లోలమైపోయిందే హృదయం! నాలాంటివాడినే ఇంత భయపడిపోతే- మూర్ఖులైనవాళ్ళు ఏమైపోయేవారో?" అనుకుంటూ స్నానంచేసేందుకు పంపుదగ్గరకు పోయాడు తుండుగుడ్డ భుజాన వేసుకుంటూను.

జగం

కలకల్ల! తాను మహావిజ్ఞాని. కనుక ఇలాంటి వాటిగురించి ఆలోచించడం ఎంతో అజ్ఞానం-అనుకుంటూ దాన్ని మరచిపోయేందుకు ఎంతగానో ప్రయత్నించసాగాడు. కాని తాను మరచిపోదామనుకుంటూండగానే—"నాన్నా! నేను చచ్చిపోతూన్నాను నాన్నా! విషం-విషం పెట్టారు నాన్నా!" అని దీనంగా-విలవిలలాడుతూ మంజుల పలుకుతున్నటు లీలగా వినిపించేది. అంతతో గంభీరమైన వాని మనస్సు విశీర్ణమైపోయేది. వణకిపోయేవాడు. స్నానం పూర్తయ్యింది బట్టలు వేసుకున్నాడు. గబగబా బయటకుపోతే- పదిమందిలో కలసి వుంటే మనస్సు ఈ భ్రాంతినించి-దుర్బలత్వం నించి తేరుకుంటుందనుకుని బయటకు బయలుదేరాడు. నడుస్తున్నాడు దారివెంట మనస్సులోనించి ఈ తలపులను దూరంచేసుకునేందుకు-దృఢత్వాన్ని పొందేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తోన్నాడు. పార్కులోని స్పీకర్లుసైతం వానిపై బద్ధవైరమూనినట్లు దుఃఖగీతాన్ని ఆలాపిస్తోన్నాయి ఆనందాన్ని వాంఛించే ప్రజకు దుఃఖగీతాలతో గుండెల్ని తూట్లు పడజేసే రేడియో వాళ్ళపై ఎంతగానో ఆగ్రహం కలిగింది వానికి తొందర తొందరగా వాటిశబ్దం వినిపించనంత దూరంగా వెళ్ళిపోదామని అడుగులు వేశాడు. ఆ రోడ్డు మలుపుతిరిగాడు. రెండడుగులు ముందుకు వేశాడు. కొంత ప్రశాంతంగా వుంది ఆ సందు. అయినా కలతచెంది పోతోన్న ఆ మనస్సుకు ఆ ప్రశాంతత మరింత ఆవేదనాకరమైపోయింది.

"నాన్నా! విషం-కాఫీలో విషం-విషం కలిపారు నాన్నా!" అవే ముక్కలు గుండె లోతుల్లో సుళ్ళు తిరిగాయి. ఎప్పుడూ ప్రశాంతతతో - చిరునవ్వుల్నిచిందించే మాధవరావు వదనపద్మం ఆ సంధ్యారుణ కిరణ కాంతుల్లో వాడి-వన్నెల దొరగి ముకుళించుకు పోసాగింది. అడుగులు సైతం తడబడ్డాయి. తూలి గాలిలో తేలిపోతున్నట్టు తోచింది చేతికఱ్ఱ వూతంతో రెండు అడుగులు వేసి ఎదుటకు చూచాడు. తూముదగ్గర అయిదారుగురు కాలేజీ స్టూడెంట్స్ సైకిళ్ళతో ఉత్తరాభిముఖులై నిలచి వారిలో వారు ఏమేమో అనుకొంటూన్నారు. పదిగజాల దూరంలో ఓ ఇంటి గుమ్మంలో ఇద్దరు యువతులు నిలచి వారిని చూస్తో కిలకిలాడుతోన్నారు. బాధతో - ఆ వేదనతో అల్లాడిపోయే మాధవరావు స్వాంతానికి వారి ఆకృత్రిమ దరహాసం చల్లదనానికి మారు కారుశిఖల్ని రగుల్కొలిపింది. - "తాము సంసారులై - పైగా అగ్రకులస్థులై - సిగ్గు ఎగ్గులు లేకుండా సంస్కృష్టం తడవుగా వలకు వీధిని నిలచే వెలయాండ్రలా గుమ్మంలో నిలచి - ఆ విద్యార్థుల యౌవనహృదయాల్లో వత్తియాశల ఎరలుజూపె - ఆకర్షించి ఉన్మత్తుల జేసి తామే మహాప్రజ్ఞావంతులమని కిలకిలాడే ఆ సోదరీద్వయాన్ని చూడ్డం - చూచి సహించడం ఆ వీధిని నివసించే మిగిలిన సంసారులకు కీర్తిప్రదమా? అలాంటివారికి తగిన బుద్ధిచెప్పడం మిగిలినవారి కర్తవ్యం

కాదా?..." అనే ప్రశ్నలు తోచాయి వానికి.


ఎంత అహంభావం! వీధిని పెద్దా-చిన్నా పోతూన్నారనైనా తలపే లేదే వారికి! ప్రపంచం మొత్తంలో తామే ఘనులమని - మిగిలినవారంతా పరివాజమ్మలని తలపు కాబోలు. లేకుంటే వీధిలో పడి ఆ ఇకఇకలు-పకపకలు ఏమిటి?... ఈ తలపులతో వానిలో తిరిగి కొంత జవసత్వాలు ఏర్పడ్డవి. ఆ సందుమలుపులు తిరిగి మరోరోడ్డు ఎక్కాడు. కొంతదూరం నడిచాడు. - "నాన్నా! విషం-విషం పెట్టారు నాన్నా!". ఉలిక్కిపడ్డాడు మాధవరావు. "కలలు-కలలు కల్లలే కావచ్చు. కాని నిముస నిముసమూ తన హృదయంలో ఈ పలుకులు ములుకులుగా నాటుతో విచలితుణ్ణి గావించడం ఏమిటి? సంవత్సరం నించి ఎప్పుడూ జ్ఞాపకమైనా రాని తన మంజుల అంతిమ విలాపంలా ఈ పలుకులు తన వీనులనించి గుండెలలోకి చొచ్చుకుపోవడం - తన హృదయదౌర్బల్యమా? లేక జరిగిన యథార్థఘటనకు నిదర్శనమా? ఎక్కడ తమవూరు? ఎంతదూరం వారివూరు? ఇన్ని వందలమైళ్ళదూరంలో ఏదో సంఘటన జరిగితే దాని ఛాయలు లీలగానైనా తోచడమంటే - ఈనాడు - అంటే విజ్ఞానంలో ఇంత పురోగమించిన ఈనాడు ఎంతపూర్వాచారపరాయణులే అయినా - పూర్వశాస్త్ర నమ్మకస్థులే అయినా - దీన్ని నిజమని నమ్మగలరా? - అజ్ఞానంలో పడివుండే ఆ అనాగరిక కాలంలో ఇలాంటివాటిని విశ్వసిస్తే విశ్వసించి వుండవచ్చు. కాని ఈనాడు మాత్రం వీటిని విశ్వసించడం వెఱితనమే. గాఢనిద్రలో నరాల బలహీనతవల్ల ఇలాంటి భావం తనలో ప్రవేశించి - తన ఆధిపత్యాన్ని గుండెల మీద నెలకొల్పుకుని - ఇంతగా కలవరం కలిగిస్తోంది. కనుక ఈ భావాన్ని తక్షణం తనలోనించి తొలగించుకోవడం అవసరం" అనుకుంటూనే - ముందుకు సాగడంమాని - ఎడమచేతి వైపు సందులోకి తిరిగాడు.

ఇంటికి తొందరగా చేరాలనే మాధవరావు తలపు అడుగులు వేగంగా వేస్తోన్నాననుకుంటూన్నాడు. కాని నిముసానికో అడుగుపడటం ప్రారంభించింది గుండెలమీద పెద్దకొండ వున్నంతబరువుగా కృంగిపోతోన్నాడు. నరనరాలలోనూ పోట్లు బయలుదేరాయి. ఒంట్లోని నెత్తురు ఉవ్వెత్తుగా ప్రవహించి ఒక్కసారిగా నిలచిపోయినట్లు ఒళ్ళంతా మొద్దుబారింది. తలపోటు ప్రారంభించింది. నిట్టూర్పు వెలువడింది.

ఎలానో కష్టపడి ఆ సందు మొగకు జేరి ముఖ్యమార్గాన్ని పాదముంచాడు. తగిలిన దెబ్బపైనే తగులుతుందన్నట్లుగా వికలత్వమందినవాని మతిని పార్కులోని స్పీకర్లు మరింతగా వేదనపరిచాయి. ప్రపంచంలో ఆనందమే కరువైనట్లు సారంగి మీద దుఃఖాన్ని మనసార పలికిస్తూన్నాడో హిందూస్థానీ సంగీత విద్వాంసుడు. ఆరాగప్రసారం ప్రకృతినే విలపింపజేస్తోన్నంత వెఱ్ఱిగా పైపైకి ప్రాకిపోతోంటే సహించడమే దుర్భరమైపోయింది.

ఎంతగానో పగలంతా అలసి - కష్టలను - శ్రమను ఏ కొంతకాలమో మరచి కాలక్షేపంచేసేందుకు ఏర్పడిన ఈ విశ్రాంతిస్థానాలలో ఏడుపుతో వెఱ్ఱి ఎత్తించే పురపాలక సంఘాల మనోప్రవృత్తి ఎవరు అర్థం చేసుకోగలరు? సంగీతంలో ఎంతటి పారవశ్యకతశక్తి నిండి నిబిడీకృతమైవుందో -అంతగానే ఏడిపించేశక్తి వుంది అలాంటి సమయంలో ఉచితానుచితాలను గుర్తించక దాన్ని ఉపయోగించే ప్రబుద్ధుల మూలంగా ఎన్ని హృదయాలు నొచ్చుకుంటూ - తమ అసమర్థతకు లోలోన బాధపడుతో ఆ స్థానాలనించి లేచిపోతూ వుంటవో పశ్నించగలమా? - అసహ్యతతో మాధవరావు ఉద్విగ్నుడైపోయాడు. వింత వింత మార్పులు ఆ విద్యుద్దీపాల కాంతుల్లో వాని ముఖాన తోచాయి. అకస్మాత్తుగా ఆ సమయంలో వానిని బాగా ఎరిగిన వ్యక్తి చూస్తే తెల్లపోయి - 'అతడు ఇతడేనా?' అనే అనుమానానికి రావడంలో ఆశ్చర్యమేమీ వుండదు కూడాను.

కల - ఒక్కకల మూలంగా ఎంతో గాంభీర్యుడూ - ఉన్నత విద్యావంతుడూ-



ఒకరు: ప్రపంచంలో నీరున్న ప్రదేశం అంతా భూమిగను, భూమిఉన్న ప్రదేశం అంతా నీరుగాను మారితే ఏం అవుతుంది?

ఇంకొకరు: మనమంతా చేపలు అవుతాం! మన నాయకులంతా తిమింగిలాలు అవుతారు.

—కాజ వెంకట శ్రీనివాసరావు, విజయవాడ.

ధనికుడూ - సంఘంలో పెద్ద పలుకుబడిగల వ్యక్తి ఇంతగా - మూడుగంటల కాలంలో ఇంతగా మారిపోయి అమాయకునిలా అల్లాడిపోవడం చూస్తే అనేకమందికి అసహజంగా అనిపిస్తుంది. కాని మానసిక శాస్త్రవేత్తలు మాత్రం ఇది సహజమేనని అంగీకరిస్తారు. ఎంతగానో ప్రేమించే బిడ్డ విప్రయోగంతో మరణిస్తూన్నట్టు భ్రాంతిగానే ఆ హృదయంలో ఒక భావం ప్రవేశించడంతో - ఒకవిధమైన దుర్బలత వానిలో అంకురించి తన ప్రభావాన్ని వానిపై కొంతసేపైనా ప్రదర్శిస్తుందనేది వారి దృష్టిలో యధార్థం. అయినా దానిని మనం అంగీకరించేందుకు మాత్రం ఎప్పుడూ సన్నద్ధులం కాము. కారణం? మనం నాగరీక సమాజంలో - ఆంగ్లభాషా విజ్ఞానంలోని నిర్మాణం కావడమే. మన దృష్టిలో ఇవన్నీ మూర్ఖ నిర్ణయాలూ - పద్ధతులూను!!

మెల్లగా ఇంటికి చేరుకున్నాడు మాధవరావు. కొంచెంసేపు విశ్రాంతి తీసుకుంటే మనస్సు స్థిమితపడుతుందనే భావంతో పడుకు వాల్చాడు వాలుకుర్చీలో. తేజోవంతంగా విద్యుద్దీపం వెలుగొంది పోతోంది. గుండెలపై చేతులు చేర్చుకొని గోడపైకి దృష్టి సారించాడు. చిరునవ్వులతో-విశాలమైన నేత్రాలతో తండ్రి చూపుల్లో చూపు కలిపినట్టు మంజుల చిత్రపటం గోడనువుంది.

అప్పటికి వానిలో కొంత శాంతి ఏర్పడి ముఖంలో కాంతి వెలిగింది. ప్రక్కదొడ్డిలో అప్పుడప్పుడే విప్పారిన మల్లెల సుగంధం కిటికీలనించి లోనకు ప్రవేశించి గదిని నింపి మాధవరావు మదికి పరవశత్వం కలిగించింది. ఆ మధురత్వంలో మంజులను గురించి ఆలోచించాడు ఆ కన్నతండ్రి.

మంజుల మాధవరావు పెద్దకుమార్తె. ఆమె ఎంతో లావణ్యవతీ సౌందర్యవతీని. ఉన్నత విద్యాభ్యాసంలో ప్రథమురాలుగా పరిగణింపబడ్డా ఏమాత్రం అహంభావం లేక అందరిచేతా ఉత్తమురా లనిపించుకునేది. ఆ అమ్మాయి పలుకులు తేనెల సోనలే! ఆ గులాబీ పెదిమల నెప్పుడూ మధుర మందహాసలే! ఆ కన్నులు సంతోషం తొణికిస్తే, ఎంతో అమాయకత్వాన్ని వెలిక్కేసేయి.

కుమార్తెకు తగిన వరుని జూచి, వివాహం అత్యంత వైభవంగా చేయాలనే తలపు కలిగింది తండ్రికి. ఆ ప్రయత్నంలో అనేకమంది వరుల్ని చూచాడు. కాని అందులో ఒక్కరూ తన మంజులకు తగినవారుగా కనిపించలేదు. అయినా ప్రయత్నం విరమించలేదు. దూరమే అయినా అనుకూల వరుని అన్వేషించడమే మంచిదని వాని భావం. ఆ భావంతో దూరమైన ఓ సంబంధం నిశ్చయించుకో దలిచాడు. బంధువులలో కొందరు ఆ వరుని నడవడిగురించి కొంత వ్యతిరేకభావం వ్యక్తపరిచినా అంత పట్టించుకోలేదు అతడు.—మంచి సంబంధాలు చూచుకుంటే మధ్య పడగొట్టి పాడుచేసేవారు వుంటారనే అతని వుద్దేశ్యం. కనుక ఏమాత్రం ఆలస్యం చేయకుండానే కుమార్తె పెండ్లి చేసివేశాడు. అల్లుడు డాక్టర్ పరీక్షు ప్యాసయి క్రొత్తగా ప్రాక్టీసు ప్రారంభించాడు. అలాంటప్పుడు తనకు ఇంక కావలసింది ఏముంటుంది?

పెండ్లి అయిన కొన్నాళ్ళకు అల్లుని గురించి కొన్ని విషయాలు తెలిసేయి. అయినా వాటినీ అంత లక్ష్యపెట్టలేదు మాధవరావు. సుశీల గనుక మంజుల మగని ప్రవర్తనను గురించి ఒక్క వాక్యమైనా తండ్రికి తెలియజేసేది కాదు. పెండ్లిఅయిన అయిదవ మాసంలోనే తన యింటిలోకే ఓ క్రిష్టియన్ యువతిని తీసుకువచ్చిపెట్టాడు మగడు. అయినా బాధపడలేదు మంజుల. భర్త ఆనందమే తన సౌభాగ్యంగాభావించి తన పడకలో ఆమెకూ సగభాగం యిచ్చి తోడబుట్టినదానిలా ఆదరించింది.

ఆమెలోని ఈ సద్గుణం ఆ మగనికీ ఆయన వలపుగత్తె అయిన ఆ క్రైస్తవ యువతికీ తెలివితక్కువగా అనిపించింది. వారి దృష్టిలో మహాతేలికగా కూడా అయిపోయింది. ఇంతవరకూ రాకుండానే తన అధికారాన్ని తానుముందే నిలబెట్టుకుని వుంటే ఏమయ్యేదో కాని ఇందుమూలంగా మాత్రం మంజుల ఆ చుట్టుప్రక్కల వారికి - పెండ్లియాడినభర్తకే చెప్పలేనంత లోకువ అవడమే కాక తిరస్కారం కూడా పొందేస్థితికి వచ్చింది. అయినా ఒక్కనాడూ ఎవరినీ నిందించడం కనీసం కష్టపెట్టుకోవడమైనా జరుగలేదు. అతి మంచితనమూ అనర్థకమే అవుతుందనుకోకపోవడం వల్ల డాక్టరు బాబు కొంచమైనా ఉచితానుచితాలు గుర్తించకుండానే ఆమె చేత తన క్రైస్తవప్రియురాలికి సేవ కూడా చేయించడం ప్రారంభించాడు. అక్కడికీ మంజుల తన అయిష్టాన్ని చూపడం కాని-తన వారికి ఉత్తరాలద్వారానైనా తెలపడం కాని జరుగలేదు.

కుమార్తె సహజగుణాన్ని తెలిసినవాడు కావడంచేత మాధవరావు స్వయంగా తన బంధువులకు జాబులు వ్రాసి వారిమూలంగా మంజుల సంసారజీవితంలోని కష్టనిష్ఠురాలను తెలుసుకుంటూ వచ్చాడు. అయిన వాళ్లంతా మంజులలోని ఈ అతిమంచికి ఆగ్రహపరవశులై ఆమెకు తగువిధంగా బోధించి ఇలాంటి అవమాన జీవనాన్నించి కాపాడవలసిందని తండ్రికి వ్రాసేవారు. ఎవరినించి వార్తలు తెప్పించుకున్నా వారంతా ఇవే విషయాలు వ్రాయడంవల్ల నమ్మక తప్పిందిగాదు మాధవరావుకి. ఇప్పుడిప్పుడు వానిలో తాను తొందరపడి ఈ సంబంధంచేసి మంజుల బ్రతుకును ఈ స్థితికి తెచ్చానేమో!' అనే భావం పాటమరించసాగింది.

తాను కన్నతండ్రి కనుకనే తన మనస్సుకు విరుద్ధంగా పోక కట్టపెట్టినవానినే దేవతగా భావించి పూజించి సేవిస్తోంది మంజుల. ఆమె తన ధర్మాన్ని తాను అక్షరాల పాటిస్తోంది. మరి తాను తనకర్తవ్యాన్ని ధర్మానుసారంగా నిర్వహించాడా? బంధువులు కొందరు వానిగురించి చెప్పినప్పుడు-వాళ్ళు స్వార్థంతో ఈ సంబంధాన్ని చెడగొట్టదలుస్తున్నారనుకొని తొందరపడి పెండ్లికార్యం పూర్తిచేశాడు. పెండ్లిచేయడమైతే చేశాడు. కాని కుమార్తె అస్తిత్వానికి తగిలిన ఈ అఘాతాన్ని ఏవిధంగా మాన్పడం?...ఎంతగానో ఆలోచించాడు. కుమార్తెకు జాబు వ్రాస్తూ - తనకు తెలియవచ్చిన సమాచారమంతా ఉదహరించి ఆపైన -

"...ఇదే కనుక నిజమైతే మంజూ! నేను స్వయంగా నీకొంతకు పుత్రికాశే తగిలించానుకోవాలి. మన వంశకీర్తికి ఎప్పుడూలేని కళంకం ఈనాటికి కోరి కొని తెచ్చుకున్నట్లే భావించాలి. చేతులు కాలిపోయినై. ఆకులకు వెతికినా నిష్ప్రయోజనమే. అయినా మంజూ! ఈ అఘాతాన్ని జీవితాంతం భరిస్తో - పదిమందినోళ్ళతోనూ మనంగురించిన చర్చలను వింటూ సహిస్తే

కన్నా – నీవు కష్టపెట్టుకోకు. యథార్థానికి- నీవు తత్క్షణం వచ్చివేసి ఇక్కడనే జీవించడం ఎంతో వుత్తమమైన పని. – ఇప్పుడు నీతండ్రి గుండెలమధ్య రగిలే అనుతాపాగ్నిని ఎవ్వరూ గుర్తించలేరు. కాని తల్లీ! చేసినదానికి కొంత పరిష్కారంగా జీవితాంతం నిన్ను గౌరవనీయంగా పెంచాలని ఈ తండ్రి ఎంత దురపిల్లుతూన్నాడో కొంచెం ఆలోచించి నీ నిర్ణయాన్ని తెలియజేయి...” అని తనలోని బాధలనూ – కోరికలనూ వెల్లడించాడు.

తండ్రి ఈజాబుకు జవాబు వ్రాసింది మంజుల. అందులో దీర్ఘంగా పేజీలు పేజీలు నింపి పంపలేదు. తమ క్షేమాలు మొదలైనవి రాస్తూ ఆఖరున –

“నాన్నగారూ! మీ హృదయాన్ని నేనే అర్థం చేసుకోలేకుంటే ఇక ప్రపంచంలో ఆశక్తి ఎవకీ వుండనే వుండదు. మీరు విన్న విషయాలలో నిజం లేకపోలేదు. అయినా కర్తవ్యపాలన నాకాపురం గురించి నాకు తెలిసినంతగా లోకులకు ఎలా తెలుస్తుంది? పెద్దలు మీరు. మీకు చెప్పవలసినదాన్ని కాను. అయినా ఈ విషయంలో మీ నిర్ణయం ఇప్పుడూ తొందరతో కూడుకున్నదే అయ్యింది. మీరు సూచించినట్లు చేతులు కాలినై! ఆకులు పట్టుకున్నా ఫలితం? మనవంశ గౌరవమంటారు! మగని విడచి పుట్టింటిలో పడివుంటే అది వంశానికి గౌరవమేనా? ఎంతగా నేను ఇంగ్లీషు చదువు చదివినా – మన వంశీయులపవిత్ర రక్తం నాలో ప్రవహిస్తోనే వున్న కారణానవారి ఆచారాలు – ధర్మాలు నన్ను విడిచిపోలేదు. అందుచేతనే నా మనస్సు నవీనాచారాల మీద – ఆదర్శాలమీదకు పరుగు పెట్టడంలేదు. కనుకనే నేను పూర్వపు భారతరమణుల్లానే జీవితాన్ని నవ్వుతోనే గడపదలిచాను. మీరుమాత్రం హృదయాన్ని క్షోభపెట్టుకోకండి. అమ్మగారికి నమస్కారాలు. చెల్లెండ్రకూ – తమ్ములకూ దీవెనలు...” అంటూ వ్రాసి ముగించింది.

ఆనాటినించీ తిరిగి మాధవరావు ఎప్పుడూ ఈ విషయాలను పునరుశ్చరణ చేయడం కాని, కుమార్తెను చూచేందుకు పోవడం గాని చేయలేదు.

ఆలోచిస్తూ – ఆలోచిస్తూ మగతగా కన్నులు మూశాడు అతడు. గోడగడియారం టక్కు – టిక్కు’ మంటూ తన విధాయకాన్ని విరామమంటూ లేకుండా గడుపుకుంటూ పోతోంది. టంగ్‌న అరగంట కొట్టింది.

“నాన్నగారూ!”—

మగత విడిపోయింది. తృళ్ళిపడ్డాడు.

“నాన్నగారూ! భోజనానికి రమ్మంటోంది అమ్మ!” అని లోనకువచ్చి చెప్పింది విమల. పిలుపు విని కలతపడిన తన నిర్బలత్వానికి తనలో తానుగానే నవ్వుకున్నాడు మాధవరావు. అనురాగంతో చిన్నకుమార్తెను దగ్గరకు తీసుకుని ముద్దుపెట్టుకుని – “వస్తూన్నాను పద! వడ్డించమని చెప్పు అమ్మతో!” అన్నాడు.

★ నిరూపించలేని నిజం ★

"ఊఁహూఁ! మిమ్మల్ని దగ్గరవుండి తీసుకుని రమ్మంది అమ్మ! - లేవండి నాన్నగారూ!" అంటూ గారంగా చేయిపట్టుకు లాగింది. ఆ పసిదాని మాటలూ - గారమూ-ముఖంలో దోబూచులాడే అమాయకత్వమూ చూస్తూ చూస్తూ మాధవరావు పరవశుడైపోయాడు. భారమైన మనస్సు తేలిక పడినట్టయ్యింది. వాలు కుర్చీనించి లేచాడు. గది విడచి పోదామనుకొంటూ వుండగానే బలంగా తనవైపు ఆకర్షించుకున్నట్టు వాని దృష్టులు గోడపైని మంజుల చిత్రపటం వైపుగా మరలినై. నిలబడి అట్టే రెండు క్షణాలు చూచాడు. చిరునవ్వుల చిందించే మంజుల ప్రతి రూపంలా తోచలేదు. - గుండె ఝల్లుమనిపోయింది. తన కన్నులు సైతం మనస్సులానే తమ శక్తిని గోలుపోయినట్టు భావించాడు. చరచర ఆ గదిని విడిచి వడ్డన శాలలోకి దారితీశాడు చిన్న కూతురు విమలతో.

* * *

భోజనంముందు కూర్చున్నా నవ్వుతో - మాటలతో భోజనం ముగించేవాడు మాధవరావు. అలాంటివాడు ముద నోట్లో పెట్టుకోవడమే నిముసం పట్టుతోవుంది. ఉత్సాహాన్ని తెచ్చుకుందామని ప్రయత్నిస్తూన్నాడు. కాని అసమర్థుడై తన ఊహ్యాకుల పాటును భార్య గుర్తించకుండేందుకు తల వంచుకొని బలవంతంగా నమిలి మ్రింగుతూన్నాడు.

"ఏమ్మండీ! ఈపూట ఇంత దిగులుగా కనిపిస్తూన్నా రెందుకని?"-ఏ విషయాన్ని తన భార్యా దృష్టిలో పడకుండా దాచేందుకు పూనుకొన్నాడో ఆ విషయమూ వెల్లడి అయిపోయినట్టు భార్య భాగ్యవతి ప్రశ్నతో నిర్ధారణమైపోయింది. మంచి నీళ్ల గ్లాసులోని నీళ్ళనన్నీ త్రాగి గ్లాసు క్రిందపెట్టుతో—

"ఏమోకొని భోజనం సహించడంలేదు." అని భార్య ముఖంలోకి చూచి నిర్ఘాంతపోయాడు. ఇంతసేపటివరకూ తనలోని వేదన వెల్లడి అవుతుందేమోనని భార్య మొగం చూడలేదు. ఇప్పుడిలా ఆకస్మికంగా చూచి ఆమె ముఖమూ కళావిహీనంగా కనిపించడంవల్ల మరింత తెల్లబోయాడు.

భర్తను చూస్తూ - వాని వెలతెలబాటును గుర్తించి - "ఎందుచేతనోకాని సాయంకాలంనించి ఒకేవిధంగా మంజుల జ్ఞాపకానికి వస్తుందండీ! గుండెల్లో దడగా కూడా వుంది. తక్షణంపోయి దాన్ని ఒకసారి చూడా లనిపిస్తోంది. రేపు మెయిల్‌కి వెళ్లి రమ్మంటే—"

తలుపులు బాదుతూన్న చప్పుడుతో మాట అంతతో ఆగిపోయింది. మాధవరావు లేవబోయాడు. "ఆఁ! ఆఁ!! అదేమిటి. సగం భోజనంలో - విస్తరిముందునించి లేవకండి. నేనుపోయి చూచివస్తాను వుండండి." అని గబగబా వీధిగుమ్మందగ్గరకు పోయింది భాగ్యం.

కలిపినముద్ద పిడికిటనుంది. దాన్ని నోట్లో పెట్టుకోవాలనే బుద్ధికూడా పుట్టలేదు మాధవరావులో. పద్మాసనంలో విస్తరి ముందు మహాసమాధి వహించిన మునిలా కూర్చుండి గుమ్మంవైపుగా చూస్తూ వుండిపోయాడు. తలుపు తీసిన చప్పుడు వినిపించింది. మరి కొద్దిక్షణాలలో తలుపులు మూసి గడబెట్టిన చప్పుడయ్యింది. ఎవరు ఎందుకో సంవచ్చారో తెలుసుకోవాలనే ఆత్రంతో అర్థాంగి ఆగమనాన్ని నిరీక్షిస్తోన్నట్టు ఆ చూపులు తేజస్ఫూరితో వెలుగొందాయి.

అడుగులు తడబడుతూండగా—వణకుతూన్న చేతితో టెలిగ్రామ్‌ఫారాన్ని పట్టుకొని వచ్చే భాగ్యాన్ని చూచి అలా కూర్చుండలేకపోయాడు అతడు. విస్తరి ముందునించి విసురుగా లేచాడు. "ఏమిటి? ఏమిటి? నిజంగా మంజుల మరణించిందా? కల నిజమైందా? మాట్లాడవేం? నిన్నే! మాట్లాడవేమే!"

పాపం! ఎంత చదువు చదివితేనేం? ఎంతటి విజ్ఞానవంతుడైతేనేం? మొత్తానికి అతడూ మానవుడే! బిడ్డలకన్న తండ్రే!! పిడుగుపాటుగా సంభవించే ఇలాంటి సంఘటనల్ని ఓరిమితో భరించి - వెనుకముందులు ఆలోచించే జ్ఞానం అలవడ్డమంటే అంత తేలికా?

భాగ్యం ఏదో చెప్పబోతూంది..అయినా మాటలు తొందరగా బయటకు రావడం లేదు. అలాంటి సమయంలో మగని తొందరపాటుతో ఆ మాటలు కాస్తా గుండెల్లోకే దించుకుపోయాయి. కన్నులలో మాత్రం నీరు తిరిగి విద్యుద్దీప కాంతితో తళుక్కన మెరశాయి. టెలిగ్రామ్‌ఫారం లాక్కొని తొందర తొందరగా—ఆ ఎంగిలి చేతితోనే పట్టుకొని చదివాడు. తల గిర్రున తిరిగినట్టయ్యింది. కొంచెం తూలి—అంతలోనే స్థిమితపడి పడిపోకుండా నిలిచాడు. తనలో తను మాట్లాడుకొంటూన్న వెఱ్ఱివానిలా—

"అవును! [illegible] ఇంత వికలత్వమందింది. సాయంత్రంనించీ మాటమాటకూ మంజుల జ్ఞప్తికి రావడానికీ-గుండెల్లో ఇంత బాధ కలగడానికీ కారణం ఇదే. అవును. ఇదే."

"అంటే ఏమిటో కొంచెం వివరంగా చెప్పండీ! మంజులకు ఏమైంది? టెలిగ్రామ్‌లో ఏముందీ? తొందరగా చెప్పండీ!" అంది భాగ్యం. తినే తిండిని విడిచి తల్లిదండ్రుల ఈ విచిత్రప్రవర్తన ఏమీ అర్థంగాక-దీనంగా వాళ్లి ముఖాలు చూస్తూ విమల నిలచింది లేచి.

"ఆఁ! ఏమంటున్నావ్. టెలిగ్రామ్‌లో ఏముందనా? మంజులకు చాలా ఎక్కువగా వుందట! తక్షణం బయలుదేరి రమ్మని."

"మంజులకు చాల ఎక్కువగావుందా? ఏమిటి! చాల ఎక్కువగా వుండటమేమిటండీ! ఏమైంది నా బిడ్డకు! ఏమండీ! ఏమైందో చెప్పరేమండీ!"

"ఏమో! ఏమైందో! నాకుమాత్రం ఎలా తెలుస్తుంది? ఎందుకింత ఖంగారుపడి కళ్ళ నీళ్లు పెట్టుకుంటావ్. తొందరగా భోజనం చేసిబటలూ అవీ సర్దు. ఇంతకుముందే—'తక్షణంపోయి ఒకసారి దాన్ని చూడాలని వుంది' అన్నావుకదూ! అలానే ప్రొద్దుట మెయిల్‌లోపోయి దాన్ని చూద్దాం.ముందు కొంచెం ఎంగిలిపడు." అని కొంచెం ఆగి బెంబేలుపడి తమనే చూస్తూన్న విమలను దగ్గరకుతీసుకుని— "ఎందుకమ్మా! నువ్వు ఏడుస్తావ్. కళ్ళు తుడుచుకో. అక్కయ్యకు ఏం భయంలేదు. అన్నం తిను. అమ్మతో కలసి నువ్వూ అన్నంతిను. రేపు సాయంకాలానికి అందరం అక్కయ్యదగ్గర వుంటాం." అని తల-వీపునిమిరాడు.

కలమూలంగానే కలగుండుపడిపోయిన మాధవరావులోని ఈ నిశ్చలత్వం దృఢత, వింతగానే తోచాయి. వాని మనస్సు ఈ టెలిగ్రామ్ ద్వారాయథార్థ విషయాన్ని తెలిసిన అనంతరం ఈ పరిణామానికి రావడంలో కలబలవత్తర కారణమేమోఊహించి నిర్ణయించడానికి మనకు సామర్థ్యం లేదనుకోవడంలో కించ ఏమీ వుంటుందనుకోను. అంతా మానవులమే. అయినా ఒకనిలాగ మరొకరంవుండం. ప్రతి వ్యక్తి రూపంలోనూ ఓ ప్రత్యేకత ఎలావుంటుందో మనస్సూ అలాంటిప్రత్యేకతనే కలిగివుండడం కాదనలేని నిజం. కనుకనే మాధవరావు మనస్సూ ఆ సమయంలో పొందిన మార్పు అలాంటి ప్రత్యేకతనే పొందివుండవచ్చు. మరి దానిని మన మనోభావనతో వర్ణించడం ఎలాంటి న్యాయమైన కార్యం?

అసలే సాయంకాలంనించీ మనస్సులో ఆలోచిస్తుంది భాగ్యవతికి. పైగా ఈ టెలిగ్రామ్! ఇట్టస్థితిలో తిండిపైన ఏం మనసు

పుట్టుతుంది? అయినా పాపం! మగని బలవంతంమూలంగా రెండుముద్దలు ఎంగిలిపడి లేచింది. ప్రయాణానికి వలసిన వస్తుసముదాయాన్ని ట్రంకుల్లో సర్దడంలోనే సగం రాత్రిని గడిపింది. భగవంతుడు ఆమెకే రెక్కలు పెట్టివుంటే ఆక్షణంలోనే ఆకాశంలోకి ఎగిరిపోయి తన బిడ్డముందు వ్రాలాలన్నంత తీవ్రమైన ఆకాంక్ష పొడమింది మనస్సులో.

విమలను మంచంపై పండుకో బెట్టి తట్టుతూ - ఓదార్పు మాటలతో నిద్రపోయేట్టు చేశాడు మాధవరావు. అభమూ శుభమూ తెలిసికోలేని ఆ అమాయక అలానే కన్నులనీటితో రెప్పలు మూసుకొని కొద్దిసేపట్లోనే నిద్రపోయింది. నిద్రలో వులికి వులికిపడుతూండగా నిశ్చలులై ఆముఖాన్ని చూస్తూ ఆరాత్రంతా ఓ సజీవ ప్రతిమలా గడిపివేశాడు అతను.

తెలతెలవారుతూండగా జూట్ మిల్లు కూతతో వులికిపడి లేచి నిలిచాడు. అప్పటికి భాగ్యంకూడా ప్రయాణానికి సన్నద్ధమై లోనకువచ్చింది. పండుకొని నిద్రపోతూన్న విమలను లేపి మొగం కడుక్కునేందుకు పెరటిలోనకు కొనిపోయింది. మాధవరావు కూడా కాలకృత్యాలు తీర్చుకునేందుకు వారివెంటనంటాడు మంటలమూలంగా కళ్ళనించి నీళ్ళు కార్తుతూండగాను.

2

మహోగ్రవేగంతో మైళ్ళను మైళ్ళనే మ్రింగుకుంటూ — మహాభారమైన తన హృదయావేదనను, లయబద్ధమైనగీతంగా ఆలాపిస్తో — తనలో కూర్చొని ఎప్పుడు తమ గమ్యస్థానాన్ని చేరుతామా అనే ఆత్రంతో వున్న ప్రయాణీకులపై జాలిగొని తన భారాన్ని మరచి పరుగులు పెట్టుతోవుంది మెయిల్. స్టేషన్ పై స్టేషన్ దాటిపోతోవుంది సంధ్యా సమయపు నీరెండతో - చల్లటి సముద్రపవనము దీర్ఘప్రయాణబడలికను వుపశమింప జేసి నరాలలో ఓ నహోత్సాహాన్ని ప్రవేశ పెట్టుతూండగా 'గమ్యస్థానంలో మెయిల్ దిగారు భాగ్యం, విమలా మాధవరావులు.

సామాను కూలినెత్తిన బెట్టి స్టేషన్ విడచి- జట్కాబండి మాట్లాడి దానిలో సామాను సర్దించి తామూ ఎక్కి అల్లుని ఇంటికి పోసాగారు. ఇల్లు దగ్గరవుతూన్న కొద్దీ ఏమి వినవలసి వస్తుందో ననే భావం ఇరువురి మనస్సుల్లోనూ ఉదయించింది. రైలులో ప్రయాణంలో మనస్సులు అంతగా చింతాకులితం కాకపోయినా ఒక్కో గజం తను ప్రేమపాత్రురాలిని చూచే దూరం సమీపమౌతూంటే హృదయాల బరువు అధికమైంది. ఇరువురూ తలకొక విధమైన భావంతో కుమార్తెను గురించి ఆలోచిస్తున్నారు. తల్లి కుమార్తెకు ఏ జ్వరమో వచ్చివుండవచ్చుననీ, తండ్రి తన బిడ్డశవాన్ని చూడవలసి వస్తుందేమోనని.—అయినా ఇంతవరకూ తనకల నిజమని నమ్మనూలేదు. ఆకలవిషయమై భార్యతో చెప్పనూలేదు. ఒక నిశ్చయానికి రాలేని భావాలతో ఇరువురూ అస్తవ్యస్తమైపోతూ - ఒకరి బాధను వెలిబెట్టితే మరొకరు మరింత కృంగిపోతారనే భావనతో ఎవరి వ్యాకులతను వారు లోలోననే అదుముకుంటూ వచ్చారు.

జట్కా ఇంటిముందు ఆగింది. ముగ్గురూ బండిదిగారు. బండివాడు ఒక్కో సామాను ఇంటిలోకి జేర్చవేసే ప్రయత్నంలో వుండగా, ఇంటివైపు దృష్టిని మళ్ళించారు ముగ్గురూను.

తుఫాను పిదప సముద్రం పొందిన శాంతిలాంటి శాంతితో వుంది ఇల్లు. ఇదమిద్ధమనే నిర్ణయానికి వచ్చే అవకాశమైనా లేకుండానే - విమల అక్కయ్యగారింటికి జేరామనే ఆనందంకొద్దీ-"అక్కా! అక్కా!!" అంటూ లోనకు పరుగు పెట్టింది. కుమార్తెను అనుసరించింది భాగ్యం. ఆమెను అనుసరించాడు మాధవరావు. — విమల రెండుమూడుసార్లు నెల - నెల చొప్పున అక్కగారిదగ్గర వుండివచ్చింది. కనుక ఇల్లంతా ఆమెకు చిరపరిచయం. ఏ మూల ఏగది వుందో - అక్కయ్య ఎక్కడెక్కడ వుంటుందో ఆస్థానాలన్నీ వెదకి-వెదకి నిరుత్సాహంతో అమ్మ దగ్గరకువచ్చి-"అక్కయ్య ఎక్కడా కనిపించడంలేదే!" అంది తెలియని దుఃఖంతో గొంతుక పూడుకుపోతూండగాను.

చావడిలో అలానే నిలచిపోయారు వారు. వచ్చి పలకరించినవారైనా కనిపించక పోవడంతో మాధవరావు గుండె భగ్గుమంది. దూరానవున్న పడకగదినించి కిలకిల నవ్వు వినిపించింది. అంతలోనే తలుపులు తెఱచుకున్నయ్. ముగ్గురూ ఆరిపోయే ఆశలు ప్రకాశింపగా అటే చూచారు. అమాయకమైన చూపులతో-'అక్కయ్యా!' అని పిలిచింది విమల.

విమల పిలుపు చాలా ఉత్తేజంగా వెలువడ్డంతో ఆ తలుపు తీసిన వ్యక్తి తలఎత్తి చూచాడు. ఎదుట ముగ్గురూ తెల్లబోయారు. ఆ క్షణానికిముందు ఎంతో ఆనందంతో శయ్యాగారంలో కిలకిలలాడిన ఆ వ్యక్తి ముఖం అంతలో ఎంతో శోకదగ్ధమైపోయినట్లు నల్లబడిపోయింది. గదినుంచి బయటకువచ్చి తలుపులు మూసివేశాడు. అడుగులో అడుగు వేస్తూ- మహా విచారాన్ని అభినయిస్తూ - "వచ్చారా అత్తయ్యగారూ! రండి! మీకోసం ఎదురుచూచి - ఎదురుచూచి, టెలిగ్రామ్ ఆలస్యంగా అందివుంటుంది; అందుచేత రేపటికి వస్తారేమో అనుకున్నాను." అని పంచె కొంగుతో కన్నుల నీళ్లు ఒత్తుకుంటూ మాటలు రావడమే కష్టమైనట్లు మాట్లాడి - ప్రక్క గదిలోనికి దారితీస్తూ - "లోనకువచ్చి కొంచెం విశ్రాంతి తీసుకోండి, మామయ్యా! ఇంతలో—"

మాధవరావుకు అల్లుని ముఖం చూస్తూంటే చెప్పలేనంత అసహ్యత కలుగుతూంది. అయినా దాన్ని లోలోపల అదిమి - భార్య ముఖం చూచాడు. ఆమెకూ అంతా అగమ్యంగా వుంది. విమల చనువుగా బావగారి దగ్గరకుపోయి చేయిపట్టుకొని - లాలనగా దాన్ని ఊపుతో - "అక్కయ్య గదిలో వుందా బావా!" అని అడిగింది.

ఆమెకు జవాబు చెప్పడానికి బదులు వెక్కి వెక్కి దుఃఖించసాగాడు డాక్టర్ విశ్వనాథం. వాని దుఃఖంతో భాగ్యం తన కలవరపాటును అణచుకోలేక పోయింది. ఆవేదనా వేశాలతో - "ఏమైంది! నా ముద్దుల మంజూకు ఏమైంది విశ్వం! మాట్లాడవేం? ఏదీ! మాబిడ్డ ఏదీ!" అంది.

అంతలోనే ఆమె మనస్సులో మరో భావం మెదలింది. ఉద్వేగాన్ని విడచి చిరునవ్వుతో—"మంజూ నువ్వూ కలసి మా మనస్సుల్లో ఎంత ప్రేమ వుందో తెలుసుకొనేందుకు ఇలా నాటకం ఆడుతున్నారా! కన్నకడుపుల తీపెని కాలిచే సాధనం ప్రపంచంలో వుంటుందా బాబూ!—" అని భర్తను చూచి— "చూచార్చా! మీ అమ్మాయి అల్లుని పన్నాగం. మనం సంవత్సరంనించీ వీళ్ళ ఆలనా పాలనా చూడ్డానికైనా రాలేదని - మనల్ని రప్పించేందుకు ఇలాంటి ఎత్తు ఎత్తారు. అలా తెల్లబోయి వెఱ్ఱివాళ్ళలా చూస్తారేం. పదండీ! పడకగదిలోని నవ్వులు వినలేదా? మంజుల దాక్కునివుంది. మనం ఏమనుకుంటున్నామో వింటూ వుంది కూడాను. నా తల్లి! తనలాంటి బంగారు తల్లిని ఏ కన్నతల్లి మర్చిపోతుంది. విమలా! పదవే! అక్కయ్య ఆ గదిలో దాక్కుని వుందే!......" అని అటు నడిచింది. తల్లికన్నా ముందుగా విమల గంతులు వేస్తూ అటు పోయింది.

అత్తగారి మాటలకుసైతం జవాబు చెప్పకుండానే తలవంచుకొని నిలిచాడు విశ్వం. మాధవరావుకు భార్య వూహించిన దాని మీద ఎందుకనో విశ్వాసం కలుగక అల్లుని చూచాడు. —"ఏం విశ్వం! మంజుల లోన వుందా?" అడిగాడు. తడబడుతూ—"మీవంటి పెద్దలవద్ద ఇలాంటి హాస్యాలు చేస్తామా! అత్తయ్యగారు భ్రమపడ్డారు. వారు విన్న నవ్వులు పడకగదినించి వచ్చినవి కావండీ!"

★ నిరూపించలేని నిజం ★

"మరి!"

"ప్రక్క ఇంటిలో ఎవరో నవ్వుతుంటే మీరు వినివుండవచ్చు."

"అయితే—"

"మంజుల ఆకస్మికంగా నిన్న సాయంకాలమే మరణించింది."

"ఆఁ! ఆఁ!! మంజుల - మంజుల మరణించిందా?"

"మీకు టెలిగ్రామ్ ఇచ్చిన గంటకు -"

"సరిగ్గా అయిదు గంటలకు—"

కంపించాడు విశ్వం. "ఔను. అయిదు గంటలకు."

"ఆమె - ఆమె మరణించింది. విశ్వం! కాఫీలో విషం - విషం కలిపి త్రాగించడం వల్ల మరణం - ఘోరదుర్మరణం పొందింది. అంతేనా?"

"ఆఁ! ఆఁ!! కాదు. కాదు. పొఱబడుతున్నారు మీరు. విషం - విషం కాఫీలో కలిపి ఇచ్చేందుకు ఆమెకు—అంతటి సౌజన్యవతికి విరోధులు ఎవరు - ఎవరు వుంటారు. పొఱబడుతున్నారు మీరు."

"పొఱబడుతూన్నాను నేను! నీలాంటి గోముఖవ్యాఘ్రానికి ఆమెను కట్టబెట్టినప్పుడే గొప్ప పొరబాటుపడ్డాను విశ్వం! ఆమె సౌజన్యవతి కావడంమూలంగానే నీ ప్రవర్తన హద్దులు మీరిపోయింది. పైగా విరోధు లెవరంటావు. ఎవరో నీ మనస్సుకు తెలియదా? ఏదీ! ఆ క్రైస్తవ యువతి ఎక్కడ? పిలు! ఇంతవరకూ అవిచ్ఛిన్నంగా జరిగిన మీ ఇద్దరి జీవిత చరిత్రలకు ఇక తగిన—" ఉద్రేకంతో పగిలిపోయే గుండెను అదుముకుంటూ—పడకగదివైపు నడుస్తూ—

"అక్కడ - ఆ గదిలో తన కాముకత్వానికి ఛాయామాత్రంగానైనా అధికారంతో అడ్డుగావున్న ఒక అమాయకురాలి అడ్డాన్ని తొలగించుకున్నామనే ఆనందంతో కదూ మీరు కిలకిలాడింది. మీ ఈ విష ప్రయోగం ఎవ్వరికీ తెలియదనేకదూ మీ ధైర్యం!—ఇక - ఇక ఆ ఆశలు వదలుకోండి. ఇన్నాళ్ళు మిమ్మల్ని—మీ దుశ్చేష్టల్ని తెలియక వూరుకున్నాననుకొని భ్రమపడి వుండవచ్చు. అది నిజం కాదు విశ్వం! అన్నీ తెలుసు. అయినా ఎందుకు ఉపేక్షించానో తెలుసా. మంజుల—మంజుల కోర్కె మూలంగానే. నీ ధర్మపత్నిగా - నీ శ్రేయోభిలాషిగా నీకు తెలియకుండా ఆమె ఎంత త్యాగం చేసిందో - పెద్దగా చదివిన మూర్ఖుడవు నీకేం తెలుస్తుంది? ఆమె కాలిగోటికి సమమవుతుందా ఇప్పుడు నీవు వ్యామోహంతో కొలుస్తున్న ఆడది........" కొంచెం ఆగి కొయ్యలా నిలచిన అల్లునిచూచి – "అలా నిలచిపోయావేం? రా! తప్పించుకుని పారిపోదామనుకుంటూన్నావా?" చరచర వెనుతిరిగివచ్చి వానిచేయి పట్టుకున్నాడు మాధవరావు. తనవెంట లాక్కుపోతూ – "ఇక పారిపోలేవ్. నీ చేతల పాపం పండిపోయింది. ఇందునించి నీకు నిష్కృతి లేదు. నన్ను ఈస్థితిలో వారించే ఒకానొక దివ్యమూర్తి – నాబిడ్డలేదు. కనుక నిన్ను రక్షించేది – "

అప్పటికి తన్ను తాను సంభాళించుకొన్నాడు విశ్వనాథం. బలంగా నిలబడి చేయి విడిపించుకొనే ప్రయత్నంచేస్తూ – "పెద్దవారూ, గౌరవనీయులూ అని ఇంతసేపు వూరుకున్నాను. కూతురిమీద గల ప్రేమతో మీ మతి చలించిపోయింది. కొంచెం విశ్రాంతి తీసుకోండి" అన్నాడు.

కన్నబిడ్డ మరణవార్తవల్ల కాలిపోతూంది మాధవరావుగుండె. విశ్వం నోటినించి వెలువడ్డ ఈమాటలు ఆమంటలో నేయిపోసినట్లయ్యింది. ఒక్క గుంజుతో ముందుకు తూలిపడేట్టులాగి – "ఏమన్నావ్. మతి చలించిందా? ఇంతవరకూ గౌరవనీయుణ్ణని వూరుకున్నావా? ఆ గౌరవంమూలానే ఇంతకాలం నేనూ వుపేక్షించాను. మరణించిన బిడ్డశవాన్ని నీలాంటి పాపిష్ఠులను శిక్షింప జేసేందుకు కోయించి పరీక్షింప జేయించకూడదనుకున్నాను. కాని – కాని – న్యాయకోసం, మరణించిన నా మంజుల ఆత్మకు శాంతిలేకపోయినా – న్యాయంకోసం నా మమకారాన్ని చంపుకొని – మీ దోషాన్ని ఋజూ పరచేందుకు కోసేందుకు ఒప్పుకుంటాను. అప్పుడు – అప్పుడు తెలుస్తుంది మతి చలించడమో - " మాటను మ్రింగివేసి క్రిందపడ్డ విశ్వాన్ని లేవదీసి నిలిపాడు. తిరిగి చేయిపట్టుకొని గదిలోనకు ఈడ్చుకుంటూ పోయాడు.

విమలా – భాగ్యవతులు ఆనందంతో గదిలోకిపోయి గదిఅంతా కలయ వెదికారు. కాని గదిలో ఎవరూ కనిపించలేదు. వెనుక గుమ్మంగడ తీసి దగ్గరకు చేరవేసి వుంది. తమను ఇంకా కొంచెంసేపు ఆడించడానికి అమార్గాన వెనుకభాగానికిపోయి వుంటుందేమోననుకొని వారూ అమార్గాన దొడ్లోకి పోయి వెతికారు. డాబామీదకు ఎక్కి కూర్చుండేమోనని డాబా ఎక్కారు. అప్పటికి కనుచీకటిపడింది. ఆశ నిరాశ కాగా నీరసంగా మెట్లుదిగి గదిలోనకువచ్చి గోడనున్న స్విచ్ నొక్కి దీపం వెలిగించి— నిలువలేక అక్కడనేవున్న మంచంమీద కూలబడిపోయారు.

అంతకు కొంత ముందుగానే ఆ మంచంమీద ఒక స్త్రీ పండుకున్నట్టుగా తలవైపు గులాబీ మల్లెరేకులు నలిగిపడివున్నయ్. మనోరంజితం ఆదుప్పటికి అంటుకుని మత్తువాసనతో ముక్కుపుటాలు మూతలు పడినట్లయినై! విమల ఆరేకులను పోగుచేసి ఎడమచేతిలో పోసుకుంది. తల్లినిచూస్తూ—

"అమ్మా! అక్కయ్య తలలోని పువ్వులివిగోనే!" అని వాటిని చూపింది. అదే సమయానికి మాధవరావు విశ్వనాథాన్ని లోనకు ఈడ్చుకుంటూవచ్చాడు. అది చూచి తల్లీ కూతుళ్లిద్దరూ తెల్లబోయిలేచి నిలిచారు. విమలచేతిలోని పూలరేకులు జలజల నేలరాలాయి.

ఉద్రిక్తస్వరంతో—"ఏదీ! చూపు! ఎక్కడ నామంజుల! నీ ప్రియురాలిని వెనుకదారిని పంపించి వేశావా? నా బిడ్డ శవాన్ని చూస్తూ దానితో కలసి నవ్వుతొన్నావా? ఎక్కడ పెట్టావ్ నా బిడ్డ శవాన్ని చూపవేం?"

బిడ్డశవం అనేమాట వినడమే కూలిపోయింది భాగ్యం. గుండెలు బాదుకుంటూ ఏడ్వసాగింది తల్లి ఏడ్పులో విమలకూడా గొంతుకలిపింది. ఆ ఇరువురి ఏడ్పులతోనూ ఇరుగుపొరుగువార్తా మంజుల తల్లిదండ్రులు వచ్చినట్టు గ్రహించి పరామర్శగా లోనకు వచ్చారు. వచ్చిన ప్రతివారూ మాధవరావు ఉగ్రరూపాన్ని చూచి దకితులైపోయారు. ఏడ్చేవారు ఒక్క రే వుంటే అది ఒక స్థాయిలో కొంతసేపుండి వుపశమిస్తుంది. కాని ఇరుగుపొరుగు అమ్మలక్కలు దగ్గర జేరి సానుతాప సూచకంగా మాట్లాడ్డం ప్రారంభిస్తే అది తార స్థాయినిజేరి వివిధ గమనాలతో వైచిత్రులతో ఎంతసేపుకీ ముగింపుకిరాదు. అలానే సంభవించింది ఇప్పుడూను. వచ్చినప్రతివారూ మంజుల సుగుణాలను మెచ్చుకోవడం, ఈ ఆకస్మిక మరణానికి ఆశ్చర్యపోవడమూను.

భార్యాబిడ్డల రోదన గుండెల్ని తరుక్కుపోతూండగా కన్నుల నిప్పులగురిపిస్తూన్నాడు మాధవరావు. అవనతవదనుడై నిలిచాడు విశ్వం. క్షణం గడిస్తే ఏంజరుగుతుందో ఊహించడమే కష్టంగా వున్న సందిగ్ధసమయంలో వేణుగోపాలరావు అందరిలానే వారిని చూచేందుకు వచ్చాడు. మాధవరావుకి వానిని చూడ్డమే దుఃఖం కట్టలు తెంచుకొని ప్రవహించింది. ఉగ్రత్వంతో పెనుదుఃఖంగా పరివర్తనమందగా – కన్నీళ్ళతో – గాద్గదికంగా – "వచ్చావా వేణూ. ఆఖరుకు మంజులని వీని పాటునబెట్టాను!

బస్సులో ఒక పెద్ద మనిషి బిచ్చగాళ్ళను గూర్చి అనర్గళంగా ఉపన్యసిస్తూ, ఎన్ని రకాల బిచ్చగాళ్లున్నారో, తిండికోసం ఎన్ని దొంగ వేషాలు వేస్తారో వివరించి వాళ్లను నిర్దాక్షిణ్యంగా తరిమి వెయ్యాల్సిన అవసరముందని చెప్పాడు. చివరికి నిట్టూర్చి "హు. ఏంచేస్తాం. కలియుగం మండిపోతోంది," అన్నాడు.

అంతా వింటున్న ఒక యువకుడు "కలియుగం కాదు. ఆకలియుగం అనండి," అని సవరణ పతిపాదించాడు.

నువ్వు ఉత్తరాల్లో వ్రాసినప్పుడైనా మంజులను తీసుకుపోయాను కాను. మణిలాంటి పిలను మట్టిపాలు జేశాను వేణూ!" అన్నాడు.

వేణుగోపాలరావు మాధవరావు బంధువు. పైగా ప్రాణస్నేహితుడూను. మంజుల కష్టసుఖాలగురించి మాధవరావుకు అప్పుడప్పుడూ జాబులమూలంగా తెలియజేస్తూ వుండేవాడు. చాలా వుత్తముడే అసాలి. లోకం రీతి నీతులను గ్రహించి కొంచెం జాగ్రతగా సంచరించే స్వభావం. అక్కడకు పోగైన అమ్మలక్కలముందు మాట్లాడటం అంత మంచిపనిగాదనుకుని - వారి దగ్గరకు పోయి మెల్లగా - "పెద్దవారు మీరే ఇలా కన్నీళ్లు పెట్టుకుంటే ఎట్లా? ఇలా రండి! మీరూ ఇక్కడవుంటే అక్కయ్య మరింత ఏడుస్తుంది. ఆ ప్రక్కగదిలోనికి పోయి మాట్లాడుకుందాం. పదపోయ్ విశ్వం! జరిగిపోయిన దానికి ఎవరేం చేస్తారు. పద." అని చెరో చేత్తో ప్రక్కనే వున్న గదిలోనకు లాక్కుపోయాడు.

గదిలోకి చేరినతరువాత తలుపులు దగ్గరకు చేరవేసి స్విచ్ నొక్కి దీపం వెలిగిస్తో - "నేను మీరు వస్తారనే వుద్దేశ్యంతో స్టేషనుకి బయలుదేరాను. మధ్యలో మావాడు ఒకడు తగిలి సమయానికి స్టేషన్‌కి చేరకుండా చేశాడు. బండి ఆలస్యంగా వస్తూంటుందని స్టేషన్‌కే పోయి తిరిగి ఇక్కడకు వచ్చాను. సరే! - అయిపోయినదాన్ని గురించి ఆలోచిస్తే లాభంలేదు. జరగవలసిన దానిగురించి-" అంటూవుండగానే మాధవరావు అందుకుని - "ఆఁ! జరుగవలసిన దానిగురించే మనం ఆలోచించాలి. తక్షణం నీవు పోయి ఒక టాక్సీని మాట్లాడుకురా." అన్నాడు.

ఆ మాటలకు ఇద్దరూ తృళ్ళిపడ్డారు. వేణుకు ఏమీ అర్థంకాక - "అదేమిటే అప్పుడే వెళ్ళిపోయేందుకు ఎలా వీలు?"

"వెళ్ళిపోయేందుకా! అప్పుడే వెళ్ళిపోతానా? వెళ్లేందుకుకాదు వేణూ! వీడినీ వీడి ప్రియురాలినీ తగినవిధంగా దండింపచేసేందుకు - నా మంజుల శవాన్ని హాస్పటల్‌కు తీసుకుపోవాలి. పరీక్ష చేయించాలి.- మంజూ - మామంజూ నిన్న సాయంత్రం ఏ సమయానికి ప్రాణాలు విడిచిందో అదే సమయానికి నాకు కనిపించి—

"నాన్నా! నేను చచ్చిపోతున్నాను నాన్నా!-విషం-విషంపెట్టారు నాన్నా! నా - నాకు కాఫీలో విషం - విషం కలిపి- ఇచ్చారు నాన్నా! నా - నా - న్నా! పోతూన్నాను. పో - పో - తూ-న్నాను నాన్నా!"

అని చెప్పింది వేణూ! అది - అది భ్రమ అనుకున్నాను. కలను నమ్మడం మూర్ఖలక్షణమనుకుంటే - మరి - మరి ఈ జరిగినదేమిటి? ఇదీ అసత్యమే అనుకోవాలా! ఏమైనాసరే నా మంజుల అంతిమవాక్యాలు నాకు నమ్మకాలు. మూర్ఖుణ్ణే అనుకోవచ్చు నువ్వు. కాని నేను పరీక్ష చేయించకుండా దహనకార్యం నెరవేర్చనివ్వను. పిలు! త్వరగా టాక్సీని పిలు!" అన్నాడు తిరిగి ఉద్విగ్నుడై మాధవరావు.

విశ్వం పెదాలమధ్య మెరుపులా ఓ హాసరేఖ తోచి అదృశ్యమయింది. వేణు అప్రతిభుడై కొంచెంసేపు అలే చూస్తూ నిలచిపోయాడు. సరళంగా ధారావాహినిగా వెలువడే వాని మాటలు తత్తరపాటును తెలిపాయి. - "కల! కలలో మంజుల కనిపించి చెప్పిందా?"

"ఔను వేణూ!"

"ఒక వేళ కలవచ్చి వుండవచ్చు. కాని అదే నిజమని నిరూపించడమెలా?"

"హాస్పటల్‌లో పరీక్ష చేయిస్తే నిజం తెలియదా? ఎంత తెలివితక్కువ ప్రశ్న వేస్తూన్నావు వేణూ!"

"మీరన్నది నిజమే. కాని పరీక్ష చేయించడానికి ఏముంది?"

"మంజుల శరీరమే."

అది—అది మీరు ఈ రోజు వస్తారనే భావంతో మధ్యాహ్నమే దహనం చేయబడింది."

దెబ్బతిన్న త్రాచులా బుసకొట్టాడు మాధవరావు. లేడిపై దూకిన వ్యాఘ్రంలా విశ్వంవాడిని పూరికి మెడపట్టుకున్నాడు.

★ నిరూపించలేని నిజం ★

—"దహనం - దహనం చేయించావా? తల్లీ దండ్రీ బిడ్డను కడసారి చూచుకొనే అవకాశమైనా లేకుండా దహనం చేయించావా? వేణూ! ఇప్పటికైనా నిజం గుర్తించావా? వీడే నా మంజూకు విషం పెట్టి ప్రాణం తీయకుంటే ఇంత ఆత్రంగా దహనం చేయించవలసిన అవసరమేముంటుందో ఇప్పటికైనా తెలిసికోగలిగావా? ఏం; మాట్లాడవేం వేణూ!—ఇదేనా మీ వూరు వారి సుజనత్వం. ఒక్కరు - ఏ ఒక్కరూ నా మంజుల శరీరాన్ని దగ్ధం చేయకుండేందుకు ఈ ద్రోహిని - నరహంతకుని వారింపలేకపోయారా? బిడ్డల కన్న కడుపులు కావా ఈవూరువారివి.—మాడు! ఈ ముఖం చూడు! వీడిలోని ఈ ధైర్యం చూడు. తన నేరాన్ని బుజూపరిచే మంజుల శవం బూడిద అయిపోయిందనీ - తన ఘాతుకత లోకం దృష్టికి రాకుండానే మాసిపోయిందనీ కదూ వీడి ధైర్యం. కానీ - కానీ ప్రభుత్వ మేమైంది? నా మంజులకు - మాకూ జరిగిన ఈ ఘోరాన్యాయానికి అది - ఆ న్యాయస్థానం ఏం చెబుతుందో అడుగుతాను. అడుగుతాను వేణూ!" - అంటూనే వున్నాడు. వాని చేతిలో విశ్వం గొంతు బిగిసి విలవిలలాడుతూనే వున్నాడు. వేణు పరిస్థితుల వక్రత్వాన్ని గుర్తించి తక్షణం ఇద్దరనూ బలవంతంగా విడదీశాడు. పులి నోటినించి తప్పించుకున్న లేడిలా రెండు అంగలు దూరంగా వేశాడు విశ్వం మెడ నరాలను సవరదీసుకుంటూ - లేని ధైర్యాన్ని తెచ్చుకుంటూ—"వేణుగారూ! ఇంత వరకూ పెద్దమనుష్యులు, కుమార్తె మరణంతో దుఃఖితులు అనుకుంటూ ఏం చేసినా - ఏమన్నా సహించాను. ఇక క్షణం వూరుకుంటే నా ప్రాణానికీ, గౌరవానికీ భంగం కలిగేలా వుంది. ఈ క్షణం పోలీసులకు రిపోర్టు చేస్తాను. వారే తగిన బుద్ధి చెప్పుతారు" అంటూ బయటకు పోబోయాడు.

"ఆగు! బుద్ధి వారు చెప్పేముందు నీకు తగినబుద్ధి నేనే చెప్పదలిచాను. ఆగు!" అంటూ వానిపై దూకబోయాడు మాధవరావు. నిజంగా వేణుగోపాలరావే అడ్డుపడకుంటే గుమ్మడికాయను నేలకు కొట్టేనట్టు కొట్టివేసేవాడే విశ్వాన్ని.

"మనం మా ఇంటికి పోదాం పదండీ! ఇక్కడవుంటే ఈ ఉద్రేకంలో చెయరాని ఘోరాన్ని మీరె చేసేలావున్నారు. జరిగింది జరిగిపోయింది. మీకు మనస్సులో ఒక అను

మానం - విశ్వం [illegible]. అయితే

అది 'నిజమా - అబద్ధమా' అని తేల్చుకునే సాధనాలు మనకు లేకుండా మట్టిలో కలసిపోయాయి. ఇక మనం ఉచితానుచితాలు ఆలోచించి సౌమ్యంగా మనదారి మనం పోవడమే ఉత్తమమార్గం."

"అంటే - ఒకమహాపాపిని - ద్రోహిని - నరహంతకుని తగినరీతి శిక్ష అనుభవింపజేయకుండా - "

"శిక్ష! నేరస్థునికి శిక్ష విధింపబడడం ప్రతిమానవుడూ హర్షింపదగిందే! అయితే ఆశిక్ష మనవల్ల కాదు బావగారూ! న్యాయస్థానంవల్ల విధింపబడాలి."

"అందుకోసమే నేనూ ప్రయత్నించదలచింది."

"కాని ముందే చెప్పానుకదూ! అందుకు తగినసాధన మట్టిలో కలిసిపోయింది. ఇక—"

"మంజులశరీరం దగ్ధం కావచ్చు. బూడిదగా మారవచ్చు. న్యాయం - న్యాయం కావాలివేణూ! ఆమెఆత్మ నా కలలో కనిపించి చెప్పింది. విషం - విషం పెట్టిచంపారని చెప్పింది వేణూ!"

"అయితే ఏంలాభం? 'లా'కు కావలసింది ప్రత్యక్షసాక్ష్యం. మీరు మీకలలోని ఘటనను కోర్టుముందు చూపగలరా? అలాంటప్పుడు ఎందుకు అపహాస్యం పాలుగావడం. పదండి పోదాం." అని చేయి పట్టుకుని నడిపిస్తూ తీసుకొనిపోసాగాడు.

"'లా'! - 'లా'కు కావలసింది ప్రత్యక్షసాక్ష్యం. మానవులు తమ విజ్ఞానం తెలివితేటలతో సాక్ష్యాన్ని మాపుజేయగలిగితే ఎటి నేరానికీ శిక్ష లేదన్నమాట! 'లా'! ఆ 'లా' వారి నేమీ చేయలేదన్నమాట. వేణూ! నువ్వు దూరదృష్టితో నే చెప్పావు. కోపంలో యుక్తాయుక్తాలను ఆలోచించలేకపోతున్నాను. ఈ ద్రోహి - వీడికి నా బిడ్డమూలంగా ఏం అపకారం జరుగుతూందని విషం పెట్టి చంపాడు? అడ్డు వీడికీ వీడి ప్రియురాలి కాముకత్వానికీ - అగ్నిసాక్షిగా అర్ధాంగి స్థానాన్ని పొందిన ఆ ఒకే ఒక అధికారం మూలంగా - సౌశీల్యవతి మంజుల అడ్డునిలుస్తుందనే అపోహతో తొలగించుకు నేందుకా ఇటి హీనాతి హీనమైన విధానాన్ని అనుసరించడం? ఇటి పాపులకు ఈ లోకంలో తగిన శిక్ష - శిక్ష అనేదే లేదా వేణూ!" - నీరవుడై కన్నీటితో అడుగులో అడుగు వేస్తూ అడిగాడు అతడు.

"నిజం మనకు తెలియనప్పుడు 'శిక్ష'ను గురించి ఆలోచించడం సవ్యం కాదు. విష ప్రయోగంతో మంజుల మరణించిందని

మనం అంటే - లోకం నమ్మదు. న్యాయం

కార్యకర్త: అబ్బ...ఎంత పని, ఎంతపని, చావటానికైనా తీరికలేదంటే నమ్మండి!

అతను: పాపం! అలాగా! అయితే ఒక పని చేస్తాను. మీరు కాఫీ త్రాగేది ఎప్పుడో చెప్పండి. కొంచం విషం కలిపిస్తాను.

—కౌజ వెంకట శ్రీనివాసరావు,
విజయవాడ.

నమ్మదు. అందుకు ఆధారాలు చూపమంటుంది. మీరు కలలో నా కుమార్తె చెప్పిందంటే ఈ ఇరవయ్యో శతాబ్దిలో విశ్వసించేది ఎవరు? నీటిమీది వ్రాలు కెంత విలువవుంటుందో - మీ కలలోని మరణవాఙ్మూలానికీ అంతే విలువవుంటుంది. ఇలాంటి సమయంలో మనం అనుకోవలసింది ఒకటే. మంజులను విషం ఇచ్చివీళ్ళు చంపివుంటే న్యాయం దృష్టినించి - ప్రభుత్వ దృష్టినించి తప్పించుకున్నా, ఆ భగవంతుని దృష్టినించి తప్పించుకోలేరు. కనక జగదాధారుడైన జగదీశ్వరుడే వీరికి తగిన శిక్ష విధించగలడు ఇక మీరు శాంతించండి. మా ఇంటికిపోదాం పదండి. అన్నాడు వేణు

కుమార్తెను తలచుకుని తలచుకుని ఏడ్చి ఏడ్చి స్మారకం తప్పి పడివుంది భాగ్యం. కళ్ళువుబ్బి - కన్నీటి చారలతో ముఖమంతా కళావిహీనంకాగా వెక్కి - వెక్కిలంగాతో కళ్ళను ఒత్తుకుంటూంది విమల. అంతకుముందుగానే అక్కడకు వచ్చిన వేణుగోపాలరావు భార్య రమణమ్మ - ప్రేమతో విమలను ఓదారుస్తూ - భాగ్యవతికి విసురుతూ కూర్చుంది.

భార్యతో వారిద్దరినీ బండిమీద తమ ఇంటికి తీసుకురావలసిందిగా చెప్పి - మాధవరావుకు ఊతంగా తాను నిలచి బయటకు నడిచాడు వేణు. వారందరూ ఇంటిని విడచిపోయేవరకూ చావడిలో నిలచి చూస్తూ - అత్తగారెక్కిన బండి దృష్టి దూరమయ్యాక తలుపులు వేసుకుంటూ వికృతహాసం చేశాడు విశ్వం. వెనుకనించి కిలకిల నవ్వులతో లేడిలా ఎగురుకుంటూ వచ్చి - బాహుబంధంలో వాని చిక్కించుకుని - "అన్నీ సవ్యంగానే జరిగిపోయినయ్! ఇక భయంలేదు విశ్వం!" అంటూ అధరాన్ని అందించింది ఏసుదాని.

'తమకేనా' అన్నాడు విశ్వం. ★



రాధా మాధవలాస్యం

చిత్రకారుడు:— కార్యంపూడి కృష్ణమూర్తి (పేరాల)

ఉద్యోగాలు

(గతసంచిక తరువాయి)

ఆ వూరు చేరేటప్పటికి చీకటైంది. స్టేషనునుంచి ఒక రిక్షా కట్టించుకొని కాలేజీ హాస్టలుకు వెళ్లేడు. ఆ రాత్రికి హాస్టలులో గడిపి మళ్ళీ రోజున ప్రిన్సిపాల్‌ను చూసి తగినవిధ యేర్పాటు చేసుకోవచ్చుననుకున్నాడు. ఎట్టి పరిస్థితులలోనూ రాఘవరావును మాత్రం కలుసుకోలేదు. అతనివల్ల తనకు సహాయమేమీ లభించదని తెలుసుకున్నాడు.

హాస్టలులో సుమారు ఏభై, అరవై గదుల వరకూ వున్నాయి. అదొక మొగపెళ్ళివారి విడిదిలాగ వుంది. కొన్ని గదులు తాళంవేసి వున్నాయి. కొన్ని గదులలో పదేసిమంది విద్యార్థులు కూర్చుని వాదించుకుంటున్నారు. శర్మ హోల్డాలు చంకలో పెట్టుకొని 'ఫలానా విజయసారథి రూమెక్కడ?' అని అడిగేడు. కొందరు తెలియదన్నారు. మరికొందరు ఏవేవో గదులనెంబర్లు చెప్పి ఆనవాళ్లు చెప్పేరు. ఒకసారి మేడమీదకు మరొకసారి క్రిందకు ఈవిధంగా రెండుమూడుసార్లు తిరగవలసి వచ్చింది. చివరకు అతికష్టంమీద తనకు కావలసిన "రూం"ని కనుక్కున్నాడు. రూంలో విజయసారథి లేడు. అతనిరూంలో వుంటే యింకోవిద్యార్థి భోజనం పూర్తి చేసుకొని సమయానికి గది తాళం తీస్తున్నాడు. "విజయ సారథిరూం యిదేనా?" అన్నాడు శర్మ.

"ఔను. లోపలికి రండి" అన్నాడతను. తర్వాత "విజయ సారథి సినీమాకు వెళ్లేడు. పదిగంటలకుకాని రాడ"ని చెప్పేడు.

శర్మ హోల్డాలు గదిలో పెట్టుకొని "ఇప్పుడే వస్తాను" అని చెప్పి ఊళ్ళోకి బయలుదేరేడు. ఊరు చాలా పెద్దది. బజారులోవున్న వెల్‌కం హోటల్‌లో భోజనం చేసి తిరిగి రూంకి వచ్చేడు. విజయ సారథి సహాధ్యాయి ఒక పడకకుర్చీలో కూర్చొని సిగరెట్టు పీలుస్తూ ఒక వారపత్రికను తిరగవేస్తున్నాడు. శర్మ రాగానే లేచి టేబుల్ దగ్గరవున్న కఱ్ఱ కుర్చీవద్దకు వెళ్లి శర్మను పడకకుర్చీలో కూర్చోమన్నాడు. తర్వాత ఒక సిగరెట్టును శర్మకు అందియ్యబోయేడు. "థాంక్యూ అవసరం లేద"న్నాడు శర్మ. మళ్ళీ సిగరెట్టును పెట్టెలో చేర్చాడు విద్యార్థి.

తర్వాత శర్మ తను వచ్చినపని చెప్పేడు. దాంతో విద్యార్థికి అతనిపై గౌరవం యెక్కువైంది. చేతిలోవున్న సిగరెట్టు ముక్కను కిటికీగుండా అవతలకు విసిరేసి కఱ్ఱ కుర్చీమీద కూర్చున్నాడు. శర్మ తన కుర్చీని వరండాలోకి మార్చుకొని కాళ్ళను ఒక స్తంభానికిఆన్చి పడుకొని ఆలోచించటం మొదలుపెట్టేడు. రూంలోని విద్యార్థి మాత్రం నిశ్శబ్దంగా కూర్చొని వారపత్రికను తిరగేస్తున్నాడు. చుట్టుప్రక్కల కొన్ని గదులుతాళంవేసి వున్నాయి. బహుశా వారు కూడా సినిమాలకువెళ్లి వుండవచ్చును. లేదా ఇంకొకరి గదులలో గుమిగూడి వుంటారు. క్రిందిహాస్టల్ అరుపులతోటి ప్రతిధ్వనిస్తోంది. కొన్ని గదులలో విద్యార్థులు రాజకీయాలమీద వాదోపవాదనలు చేస్తున్నారు.

జె. పరబ్రహ్మం

"ఫలానావారికి బుద్ధి యెంతమాత్రం లేదని అతను మంత్రిపదవికి యెంతమాత్రం పనికిరాడ"ని వాదిస్తున్నాడు. కేవలం తెలివితేటలు తన సొత్తేనని ఆ మంత్రిపదవి తనకే వస్తే అంతకంటె యేదో చేయగలనని అతని భావం. ఇంకొకడు ఇంకోవిధమైనపద్ధతిలో వాదిస్తున్నాడు. మొత్తంమీద వారందరికీ వాదనలలో నెగ్గటానికి వాక్చాతుర్యం తెలివితేటలుకంటె స్వరంమీదే యెక్కువ నమ్మకం వున్నట్టు కనబడుతోంది. ప్రతివారూ మాట్లాడేవారే కాని వినేందుకు ప్రయత్నించేవారొకరూ వున్నట్టు కనబడలేదు.

చాలాగదుల్లోంచి ఘాటైన సినిమా విమర్శలు యెక్కువగా వినబడుతున్నాయి. "ఫలానా చిత్రంలో సురయా నటన ఎంతమాత్రం బాగుండలేదని, ఇంకొకచిత్రంలో యాకూబ్ 'ఓవర్ యాక్టు' చేసేడని, కథలో టెంపో లేదనీ, డైరక్టరు చాలా అసమర్థుడని" మొదలైన సంభాషణలెన్నో వినబడుతున్నాయి. వారి సంభాషణలను బట్టి వారిలో చాలామందికి సినిమాలలో నటించాలనీ, లేదా దర్శకత్వం వహించాలనీ అభిలాష వున్నట్టు శర్మకు అర్థమైంది. "యేదోవిధంగా వారికి చేతనైనట్టుగా కళాసేవ చేయటమే వారి వుద్దేశ్యమైనట్టున్న కొందరు పైకి చెప్పేస్తున్నారు. అయితే సినిమాలలో నటించడంవల్ల, కామాన్ని అర్థాన్ని ఒకేసారి సేవించవచ్చునన్న ఉద్దేశ్యం వారి ప్రతిమాటల్లోనూ శర్మకు కనపడుతూనే వుంది.

శర్మ కూర్చున్న వరండాకు యెదురుగుండా వున్న రూం కొంత నిశ్శబ్దంగా వున్నట్టు కనపడింది. అందులోని విద్యార్థులు చాల బుద్ధిమంతులైవుంటా రనుకున్నాడు శర్మ. కాని యింతలోనే "డైమను త్రించా పెట్టి కోయవలసింది. కళావరు జాకీ దింపితే బాగుండేది" మొదలైన మాటలు బయలుదేరేయి. శర్మ నవ్వుకున్నాడు.

హాస్టలులో సినిమా గానప్రియులు హెచ్చుమందే వున్నట్టున్నారు. "సోజా రాజకుమారీ" పాటలతోటి, "మేరా బుల్ బుల్ సో రహా హై" పాటలతోటీ కొన్ని గదులు మ్రోగిపోతున్నాయి. మొత్తంమీద హాస్టల్ అతిఅట్టహాసంగా వుంది. "చదువు నిమిత్తమై వచ్చినట్లు ఒకడుకూడా కనబడటం లేదు. వీరికా చదువు చెప్పటం?" అనుకున్నాడు శర్మ. "వీరిమీద దుర్వినియోగం చేసే డబ్బుని యే ప్రాజక్టుమీదేనా వినియోగపరిస్తే దేశం అయిదురెట్లు యెక్కువ బాగుపడేది" అనుకున్నాడు.

"అయితే ఇదంతా యీ కొత్త ప్రపంచములో నవజీవనానికి కావలసిన పద్ధతులకు తర్ఫీదై వుండవచ్చు. ఇంతకంటే జాగ్రత్తగా చదివి తను సాధించిన దేమిటి? ఈ విధంగానే విద్యాభ్యాసం చేసిన రాఘవరావు సాధించకపోయిన దేమిటి? తనొకడే ప్రయోజకుడు, మిగతావారంతా అప్రయోజకులు అని యెవరికివారే అనుకొని రెండవ వారిని మోసగించటమే ఒక లక్ష్యంగా పెట్టుకొని జీవితంలో ముందుకు త్రోసుకొని పోవటమే ఈరోజుకు సరియైన పద్ధతి. ఈ పద్ధతిలో తనకు తర్ఫీదు లేదు. అటువంటి పద్ధతులు నేర్చుకునే సమయం దాటిపోయింది. అయితే తను చేయవలసిం దేమిటి?"...

"ఈ చదువులో సారంలేదని ఈ విద్యార్థులు పూర్తిగా గ్రహించినట్టున్నారు. అది నిజమే కావచ్చు. శిష్టపారంపరకూ చదివిన కృష్ణారావు జీవితంలో తనకు అను

గడుక్కూ యెదురయ్యే క్లిష్టమైన సమస్యల్ని అతి సులభంగా పరిష్కారం చేసికోగల్గుతున్నాడు. తనో, దానికి పూర్తిగా వ్యతిరేకం" ఈవిధంగా ఆలోచించుకుంటూ పడుకున్నాడు.

తర్వాత విజయసారథివచ్చి శర్మని గుర్తించేడు. ఆరాత్రి హాస్టలులో గడిపేడు శర్మ. మర్నాడుదయం కాఫీ టిఫిన్లు హాసల్‌లోనే తీసుకున్నాడు. పదిగంటలకు కాని కాలేజీ ప్రారంభించరు. ఈలోగా ఆ గదిలోవున్న విద్యార్థులకు 'షొరాబ్ అండ్ రుస్తుం'లో కొన్ని ఏ నొటేషన్లు వికార్ ఆవ్ వేక్‌ఫీల్డులోని బర్చిల్ శీలం మీద ఒక వ్యాసం వ్రాసియిచ్చేడు.

తొమ్మిదిన్నరకు సరిగా కాలేజీకి వెళ్ళేడు. ఒక అరగంటకు ప్రిన్సిపాల్ వచ్చేడు. శర్మ ప్రిన్సిపాలుదగ్గరకు వెళ్ళి తను ఫలానా శర్మ వని చెప్పుకొని కాలేజీలో ట్యూటరుగా నియమిస్తూవున్న ఉత్తరువును చూపించేడు.

ప్రిన్సిపాల్ తన టేబుల్‌కి యెదురుగా వున్నకుర్చీ చూపించి కూర్చోమన్నాడు. ఆయన శర్మయొక్క విలువని గ్రహించినట్టున్నాడు. శర్మవంటివాడు తమ కాలేజీకి రావటం చాల సంతోషంగావుందన్నాడు. ట్యూటరు వుద్యోగం తాత్కాలికమైనప్పటికీ వచ్చే సంవత్సరం కాలేజీలో క్రొత్త కోర్సులు ప్రారంభించబోతున్నామనీ ఒక లెక్చరర్ వుద్యోగం కాళీ వస్తుందని ఆ పనిని శర్మకే ఖాయం చేయగలమనీ కూడా చెప్పేడు.

తలవనితలంపుగా వచ్చిన ఈ అదృష్టానికి శర్మ చాలా సంతోషించేడు. కేవలం పైవేషంతో నిమిత్తంలేకుండా తన విలువని గుర్తించే వ్యక్తి ఇప్పటికి తనకు కనపడ్డాడు. శర్మహృదయం కృతజ్ఞతతో నిండిపోయింది. పైకిమాత్రం యేమీ మాట్లాడలేకపోయేడు.

"చాలాకృతజ్ఞుణ్ణి"అనిమాత్రంఅన్నాడు.

తర్వాత ప్రిన్సిపాల్ వారానికి నాలుగు గంటలుమాత్రమే మీకు పని వుంటుంది. ఈరోజు మీకు పర్కు లేదు. రేపు మీ టయింకువచ్చి మీపనిని చూసుకోవచ్చును" అన్నాడు. ఆరోజు పనిలో జేరినట్టు శర్మ సంతకంపెట్టి వూళ్లోకి బయలుదేరేడు. గత రాత్రి వెళ్లిన వెల్కంహొటలుకే భోజనానికి వెళ్లేడు. కాని అన్నం హితవుగా లేదు. ప్రొద్దుట హాస్టలులో తీసికొన్న టిఫిన్‌వల్లనో, లేక హొటల్ తిండి తత్వమో కాని వికారంగా వుంది. అసంపూర్తి భోజనంచేసి మళ్ళీబజారులోకి వచ్చేడు. యేదేనా ఒకబస యేర్పాటు చేసుకోవాలి. నాలుగైదు వీధులు తిరిగేడు. కానీ, అర్థం లేకుండా తిరిగితే బస్తీలో బస యెక్కడా దొరకదు

తుంది. యెండలో తిరగటంవల్ల తలా, వళ్లు వేడెక్కినటయింది మళ్ళీ కాలేజీకి జేరేడు. అక్కడ స్టాఫ్‌రూంలో ఒక కుర్చీలో జార్లబడి కూర్చున్నాడు. స్టాఫ్‌రూంలో ఇంకొకాయన కూడా కూర్చొని కాగితం మీద యేవేవో వ్రాసుకుంటున్నాడు. ఆయనకూ శర్మవయస్సే వుంటుంది. ఆకాలేజీలో మేథమెటిక్స్‌డిపార్టుమెంటులో పని చేస్తున్నానని చెప్పేడు. శర్మ తన విషయం కూడా చెప్పుకొని ప్రస్తుతం బస యేదేనా కుదుర్చుకునే ప్రయత్నంలో వున్నానని చెప్పేడు.

"ఈవూళ్ళో రూమ్స్ దొరకటం చాల కష్టమండీ. ఏమైనా హాస్టల్‌లో మాత్రం ఇక వుండకండి. ఈ రాత్రికి మీకెక్కడ బస దొరక్కపోతే మారూంకి వచ్చేయండి. నేను ప్రస్తుతం వంటరిగా నేవుంటున్నాను" అన్నాడాయన.

"మీ ఉపకారబుద్ధికి యెంతో కృతజ్ఞుణ్ణి" అన్నాడు శర్మ.

శర్మ ఒక గంటసేపు విశ్రాంతి తీసుకొని మళ్లీ బయలుదేరేడు. వళ్లంతా నొప్పులుగా వుంది. ఒకరిక్షా చేసుకొని కొన్ని వీధులు తిరిగేడు. తిరిగినంత మాత్రంలో గదులు దొరికేటట్టు లేవు కొందరు గదులు కాళీ లేకపోయినప్పటికీ తాత్కాలికమైన ఏర్పాటేవో చేసి అద్దెకు యిసామన్నారు. కాని వారు అద్దె నలభై, యాభై రూపాయలు చెబుతున్నారు.

సాయంత్రం రాఘవరావు సైకిల్‌మీద వెడుతుండగా కనపడ్డాడు. ఒక వదులైన పైజమా, పొడుగాటి చొక్కాపైన ఒక కోటు వేసుకొనివున్నాడు. శర్మ అతనిని పిలువలేదు. రాఘవరావు కూడా శర్మని చూడనట్టు నటించి వెళ్ళిపోయేడు. తల నొప్పి యెక్కువగా వుంది దగ్గరలోవున్న సెంట్రల్ కేఫ్‌కి వెళ్ళి కాఫీ పుచ్చుకున్నాడు. కాఫీ కూడా నోటి కెంతమాత్రం హితవుగాలేదు. ఇక తిన్నగా హాస్టలులోని విజయసారథి రూంకి జేరేడు.

తలవని తలంపుగా కృష్ణారావు అక్కడ కనపడ్డాడు. అతనుకూడా ఆ విద్యార్థులకు యేవేవో చెబుతున్నాడు. శర్మని చూడగానే తనప్రసంగం ఆపివేసి సంతోషంతో శర్మని అభినందించేడు. కంపెనీ పనిమీద వచ్చినట్లు ఒకటి రెండు రోజులు తనా వూళ్ళోనే వుంటానని చెప్పేడు. ఆరాత్రికి తనతోబాటు ఆ 'రూం'లోనే వుండమన్నాడు.

శర్మ రాఘవరావు తన ఉత్తరానికి సమాధాన మీయలేదని ఈ వూళ్ళో కనబడి కూడా చూడనట్టు నటించి వెళ్ళిపోయేడని

చెప్పేడు.

"వాడంతేలే" అన్నాడు కృష్ణారావు.

"రేపు నిన్ను మళ్ళీ కలుసుకుంటాను. ఈ పూటకి శెలవు" అన్నాడు శర్మ.

తర్వాత సైకిల్ రిక్షాలో హోల్డాల్ పెట్టించుకొని మేథమెటిక్స లెక్చరర్ యిచ్చిన చిరునామా వెతుక్కుంటూ అతని రూంకు చేరేడు. ఆ పూటకు తన కారియర్‌తో శర్మకు కూడా భోజనం తెప్పిస్తానన్నాడు.

"నో. థాంక్యూ. ఈపూట నాకాకలిగా లేదు" అన్నాడు శర్మ. కారియర్ తెచ్చే కుఱ్ఱవాడితో రెండు బత్తాయి పళ్ళు తెప్పించుకున్నాడు.

లెక్చరర్ ఏవో కాగితాలు ముందువేసుకొని కూర్చున్నాడు. శర్మకుమాత్రం వళ్ళు తెలియనంత బాధగావుంది. హోల్డాలు వాల్చి లెక్చరర్‌తో మాట్లాడుతూ పడుకున్నాడు. లెక్చరర్ మాటల సందర్భములో తను ఐ. ఏ. ఎస్ పరీక్షకు వెడుతున్నానని చెప్పేడు.

"దరఖాస్తు చేయటానికి యింకా యెంత టైముందీ?" అన్నాడు శర్మ.

"మీరు దరఖాస్తు చేయదల్చుకుంటే నా దగ్గర ఇంకొక అప్లికేషను ఫారం కూడా వుంది" అన్నాడాయన.

డ్రాయరులోంచి ఇంకొక ఫారంతీసి శర్మకిచ్చేడు. శర్మ లేచి టేబుల్ లైటు దగ్గర కూర్చొని ఫారం పూర్తిచేసేడు.

"దరఖాస్తును రేపు పంపించివేద్దా మనీ

ఉద్యోగాలు

కుంటున్నాను" అన్నాడు లెక్చరర్.

"మీరు శ్రమ అనుకోకుండావుంటే నా దరఖాస్తును కూడా మీ దానితోపాటు పంపించమ"న్నాడు శర్మ.

"ఇందులో శ్రమేమివుంది?" అన్నాడు లెక్చరర్.

శర్మ హోల్డాలులోంచి ఒక పెద్ద కవరు తీసి దానిలోంచి తన యం ఏ సర్టిఫికేటు కావలసిన యితర యోగ్యతాపత్రాలు ఆయనకు యిచ్చేడు. "చెలాన్ ఇంపీరియల్ బాంక్ లోకట్టి 'టైంకు' అందిస్తానని" చెప్పేడు.

అయితే శర్మదగ్గర ముప్పై రూపాయల కంటె యెక్కువలేవు. కృష్ణారావుదగ్గర అప్పు తీసుకుందామనుకున్నాడు. ఒకవేళ అతను సర్దుబాటు చేయకపోతే తన దగ్గర వున్న రెండు ఉంగరాలు అమ్మివేద్దామను కున్నాడు. పరీక్షఫలితా లెట్లాగవున్నా వుంగరాలు మాత్రం మాయమవుతాయి.

ఆరాత్రి శర్మకు యేమీ నిద్రపట్టలేదు. తెల్లవారినా ప్రక్కనుంచి లేవాలనిలేదు. బలవంతంగా లేచి మొహం కడుక్కున్నాడు. లెక్చరర్ కుఱ్ఱవాడిచేత రెండు కప్పుల కాఫీ ప్లాస్కులో తెప్పించేడు. శర్మ కాఫీ త్రాగి మళ్ళీ హోల్డాలుమీదకు చేరేను.

"స్నానం చేస్తారా?" అన్నాడు లెక్చరర్.

"నాకు చలిగావుంది. స్నానం చేయలేను" అన్నాడు శర్మ.

తొమ్మిదిన్నరకు లెక్చరర్ డబుల్ కారియర్ తెప్పించేడు. అన్నం ముద్ద నోట పెట్టుకోలేకపోయేడు శర్మ.

"చాలా మొహమాటం పడుతున్నట్టున్నారు" అన్నాడాయన.

"లేదండీ. యెందుకో సహించటం లేద"న్నాడు శర్మ.

భోజనం అయిందనిపించి శర్మ రిక్షామీద హోసలుకు బయలుదేరేడు. కృష్ణారావు సరిగ్గా అప్పుడే బజారునుంచి తిరిగి వస్తున్నాడు. చేతిలో లెదర్ బ్యాగ్, ఫుల్ సూటు, నెక్టయి వగైరాలతో పెద్ద ఆఫీసరులాగ వున్నాడు.

"నావుద్యోగాని కీవేషమే ముఖ్యం" అన్నాడు కృష్ణారావు నవ్వుతూ.

తర్వాత శర్మ తనకొక యాభైరూపాయలు అవసరమని ఉంగరాలు అమ్మివేయ దలచుకున్నానని చెప్పేడు.

'నీకేమన్నా మతిపోయిందా యేమిటి? ఆమాత్రం నేను సర్దుబాటు చేయగలనులే" అన్నాడు కృష్ణారావు.

"పెద్ద సంసారాన్ని ఈదుతున్నావు నీకెందుకీశ్రమ." అన్నాడు శర్మ.

"నెలాఖరుకు నీకు జీతంరాగానే కొంత తీర్చివేయవచ్చు. ఈ లోగా నాకేమీ ఇబ్బంది వుండదులే" అన్నాడు కృష్ణారావు.

కృష్ణారావు తనకు ఇంపీరియల్ బ్యాంకులో పనివుందని, శర్మపేర చలాన్ కట్టి మేథమెటిక్స్ లెక్చరర్ రూంలో యిస్తానని చెప్పేడు.

'నీసహాయాన్ని వేయిజన్మల్లో కూడా తీర్చుకోలేను" అన్నాడు శర్మ.

"ఇంతకంటె యెక్కువ సహాయం తీసుకున్నవాళ్ళున్నారుకాని ఎవరూ ఇటువంటి మాటలు ఇంతవరకూ అనలేదు" అన్నాడు కృష్ణారావు.

"నేను కాలేజినుంచి నాలుగు గంటలకు వచ్చి సెంట్రల్ కేఫ్‌లో నీకోసం యెదురు చూస్తూ వుంటాన"న్నాడు శర్మ. "సరే" అన్నాడు కృష్ణారావు.

తర్వాత శర్మ కాలేజీకి వెళ్లేడు. తను సామాన్యంగా యెక్కడకు వెళ్ళినా నడిచి వెళ్ళటం మామూలు. ఈ రోజునమాత్రం నడవలేకపోయేడు. ప్రొద్దుటనుంచి యెక్కడకువెళ్ళినా రిక్షామీదే ప్రయాణం. తన టైంప్రకారం క్లాసులోకివెళ్లేడు. క్లాసులో విద్యార్థులు పదిమందికిలోపుగా వున్నారు. "ఈ పీరియడ్ మాష్టారు సెలవుమీద వెళ్ళేరని తెలిసి స్టూడెంట్సు అందరూ ఇళ్ళకు పోయేరు" అని ఒకడన్నాడు. ఈవిధంగా జరుగుతుందని తెలుసు. క్లాసు వుంటుందా, వుండదా అన్న సందేహం వచ్చినప్పుడు వుండదు అన్న నిర్ణయానికే విద్యార్థులు మొగ్గు చూపిస్తారు. ఆ పదిమందిచేత కాంపోజిషన్ వ్రాయించి వారి పుస్తకాల్ని వారి యెదుటే తప్పులుదిద్ది వారి కిచ్చివేసేడు.

నాలుగు గంటలకు సెంట్రల్ కేఫ్‌కు జేరేడు. అప్పటికే కృష్ణారావువచ్చి శర్మ కోసం యెదురు చూస్తున్నాడు.

చలాన్ కట్టి రసీదు మేథమెటిక్స్ లెక్చరర్‌కి యిచ్చేనని చెప్పేడు.

"టైంకి అందించావా?" అన్నాడు శర్మ.

"ఆ. ఈపూటే రిజిష్టరుచేసి పంపుతానన్నాడు మీ ఫ్రెండ్" అన్నాడు కృష్ణారావు

శర్మ కాఫీత్రాగలేక అంతావదిలివేసేడు. కొంచెం మించు మించుగా యేభైమైళ్ళ ఆహారంలేకుండా మూడురోజులనుంచి గడుపుతున్నాడు.

"అయితే ఇంకొక పని మిగిలివుంది" అన్నాడు శర్మ. "ఏమిటది?" అన్నట్టు చూసేడు కృష్ణారావు

"రేపు నాకు క్లాసులేదు. అందుచేత శెలవు పెట్టదలచుకున్నాను. ఎల్లుండి శనివారం శెలవు. తర్వాత ఆదివారం. అందుచేత రేపుదయం ఇంటికివెడతాను. ఈలోగా ఒకరూం చూసుకొని తాళం వేసుకొని వెళ్ళాలి." అన్నాడు శర్మ.

"యేమంతతొందర?"

"యేమో. ఇల్లువదిలి చాలారోజులైనట్టుంది. ఇల్లువదిలినతర్వాత ఒక్క మెతుకు కూడా సహించలేదు. అదికాకుండా డబ్బు తెచ్చుకుంటే కాని ఈనెల గడపటం కష్టం"

"నాకుకూడా పూళ్ళోపని పూర్తయింది. ఇద్దరం కలిసి వెతుకుదాం" అన్నాడు కృష్ణారావు.

శర్మ బద్ధకంగా నడకసాగించేడు. కృష్ణారావు మాత్రం ధైర్యంగా ప్రతియింటిలోకి వెళ్ళి "గదులు ఖాళీగావున్నాయా?" అంటూ వాకబుచేస్తున్నాడు. చాలమంది ఖాళీలు లేవన్నారు.

ఒక యింటి యజమాని ఒక గదిని చూపించేడు. ఆ గదికి గాలికాని వెలుతురుకాని వచ్చే సావకాశం యెంతమాత్రం లేదు. అయితే లైటంగువుంది. ఇతర సదుపాయాలేవీ లేవు. పంపుదగ్గర నీళ్ళు పోసుకోవచ్చునని పాకీ దొడ్డిమాత్రం ఉమ్మడి అని యజమాని చెప్పేడు.

"అద్దెంత?" అన్నాడు కృష్ణారావు.

"నలభైఐదు రూపాయలు" అన్నాడు ఆయన శర్మ "ఇక ఆలోచించక్కర్లేదు. వెళ్ళిపోవచ్చును" అనుకున్నాడు.

"మేము విద్యార్థులం కాము" అన్నాడు కృష్ణారావు యజమానితో.

"విద్యార్థులైనా కాకపోయినా అద్దె అంతే. బ్రహ్మచారుల కందరికీ ఒకరేటు" అన్నాడాయన.,

"మేము బ్రహ్మచారులం కాము. అతనికి ఒక మొగపిల్లవాడు, నాకు మొగా, ఆడా, అందరూ కలిసి అరడజనుమంది పిల్లలున్నారు" అన్నాడు కృష్ణారావు.

"అయినా సరే మీరు కుటుంబాలు తెచ్చుకోవటంలేదు. అంతకు తక్కువకిచ్చేదిలేదు." అన్నాడు యింటి యజమాని.

"మీరు ఇయ్యకపోయినా మాకు సంతోషమే కాని మమ్మల్ని బ్రహ్మచారులని మాత్రం అనద్దు" అన్నాడు కృష్ణారావు.

శర్మకు నిల్చునే ఓపికకూడా క్షీణించింది. "దావోయి. ఇక వెళదాం. ఒకవేళ

ఆయన దయదల్చి అయిదురూపాయలు తగ్గించినప్పటికీ నేను యిచ్చుకునే స్థితిలో లేను. అందుచేత వాదన అనవసరం." అని ద్గాగితీసేడు. కృష్ణారావుకూడా శర్మవెంట వచ్చేడు. దారిలో కృష్ణారావు "విద్యార్థులకో రేటు కుటుంబీకులకో రేటు వుంటుంది" అన్నాడు.

"సబబే" అన్నాడు శర్మ. హాస్టలు పరిస్థితులు తను స్వయంగా చూసేడు. విద్యార్థులకు గదు లివ్వటంలో రకరకాలైన ప్రమాదాలు వున్నాయి. ఆ ప్రమాదాలను యెదుర్కొనే నిత్తమై అద్దెకాకుండా కొంత భీమారుసుముక్రిందకూడా వసూలు చేయవలసి వుంటుంది.

ఇక శర్మనడవలేనన్నాడు. కృష్ణారావు చేయి పట్టుకున్నాడు.

"వళ్లు వేడిగా వున్నట్టుందే?" అన్నాడు కృష్ణారావు.

"అయితే ఈరాత్రికి ఇంటిక్కి ఉడాయిస్తాను" అన్నాడు శర్మ.

"నన్నుకూడా వెంట రమ్మంటావా?" అన్నాడు కృష్ణారావు.

"అక్కర్లేదు" అన్నాడు శర్మ. ఇద్దరూ గుఱ్ఱపుబండీ చేయించుకొని లెక్చరర్ రూంకి వెళ్ళేరు. లెక్చరర్ అప్లికేషన్లు రెండూ పంపించివేసేనన్నాడు. శర్మ ఇంటికి వెళ్ళవలసిన పనివున్నదని చెప్పి మర్నాటికి మట్టుకు శలవుచీటీ వ్రాసి ఆయనకు యిచ్చేడు. తర్వాత ఆయనతో "మీ కెంతో ఋణపడి వున్నాను. మీ సహాయానికి కృతజ్ఞత యేవిధంగా చెప్పుకోవాలో కూడా తెలియటం లేదు." అని ఇంగ్లీషులో అన్నాడు. ఆయన నవ్వేడు. తర్వాత కృష్ణారావే శర్మ హోల్డాలు బండీలో పెట్టేడు. ఇద్దరూ బండియెక్కి స్టేషనుకు వెళ్లేరు:

కృష్ణారావు తనకో ప్లాట్‌ఫారం టిక్కట్టు, శర్మకు రైలుటిక్కట్టు తెచ్చేడు. శర్మ రైలు యెక్కేడు. లోపల కూర్చునేందుకు మాత్రమే చోటువుంది. కృష్ణారావు లోపలికెక్కి హిందూస్తానీలో గుక్కతిప్పుకోకుండా ఏవేవో మాట్లాడేడు. కొందరు తప్పుకొని శర్మకు ఇంకా కొంచెము చోటిచ్చేరు. కృష్ణారావు శర్మ హోల్డాలు పరిచి పడుకోమన్నాడు. తర్వాత కృష్ణారావు దిగిపోయేడు.

శర్మ రైలులో కృష్ణారావును గురించి ఆలోచించటం మొదలుపెట్టేడు. కిందటి జన్మలో యేదో సంబంధం వుండితీరాలి. లేకపోతే తనమీద ఇంత అభిమానం ఎందుకు వుండాలి? తనూ అతనూ చిన్నప్పుడు ఒక క్లాసు చదివేరు. అయితే రెండవ ఫారంలోనే విడిపోయేరు కాని వారి స్నేహం మాత్రం విడిపోలేదు. కృష్ణారావుని అందరు ఒక రౌడీక్రిందా తనను ఒక అమాయకుడిక్రిందా జమకట్టేరు. కృష్ణారావు హృదయం ఎటువంటిదో యెవరూ గ్రహించలేకపోయేరు.

రాఘవరావు ప్రకృతి యితనికి పూర్తిగా భిన్నం. పెద్దమనిషిక్రింద చలామణీ అవుతున్నాడు. నిజానికి కృష్ణారావుతో పోల్చిచూస్తే గొన్నోరెట్లు దుర్మార్గుడు. కృష్ణారావు జీవితం సుఖంగా గడుపుకుంటున్నాడు. నెలకు మూడు నాలుగు వందలు తెచ్చుకుంటున్నాడు. అంతర్వాహినిగా వున్న అతని గుణసంపదే దానికి కారణమై వుండవచ్చు. కృష్ణారావు మనుష్యులలో

★ ఉద్యోగాలు ★

వున్న బలహీనతను ఇట్టే పోల్చి వేయగలడు. దుష్టులతో యెట్లాగ వుండాలి, మంచివాళ్ల దగ్గర ఎట్లాగ నడుచుకోవాలి మొదలైనవి అతనికి తెలుసు. కొందర్ని పొగిడి వశపర్చుకోగలడు. కొందర్ని భయపెట్టి లొంగదీయగలడు. అతని శక్తి తప్పకుండా అసాధారణమైనది. గడిపేడు. తను దిగవలసిన స్టేషను రాగానే హోల్డాలు సద్దుకుని దిగిపోయేడు.

అప్పటికి రాత్రి రెండు గంటలైంది. అక్కడనుంచి కారెక్కి తన వూరు చేరాలి. కారు స్టేషనుదగ్గరనుంచి నాలుగు గంటలకు బయలుదేరుతుంది. అంతవరకూ స్టేషనులో గడపాలి. ప్లాట్‌ఫారందాటి వరండాలోకి వచ్చేడు. వరండా నిద్రపోయేజనంతో నిండి వుంది. యేవిధమైన పంచాలేనివారుపడుకునేందుకు యిక్కడకు వస్తుంటారు. బెంచీలమీద కొందరు నిద్రపోతున్నారు. భరించలేనంత చలిగావుంది. నేలమీదే హోల్డాలుపరిచి ఒక దుప్పటీ కప్పుకొని పడుకున్నాడు.

తర్వాత కారెక్కి తెల్లారకుండానే యిల్లు చేరేడు.

శర్మ తన ఉద్యోగవార్తలన్నీ టూకీగా చెప్పేడు. వచ్చేయేడు లెక్చరర్ వుద్యోగం వచ్చే సావకాశం కూడా వుందన్నాడు. అయితే ఐ. ఏ. ఎస్ పరీక్షకు దరఖాస్తు చేసినట్టుగాని ఏభై రూపాయలు అప్పు చేసినట్టుగాని చెప్పలేదు: తల్లిమాత్రం "అబ్బాయి బాగా నలిగిపోయేడు. అసలు అన్నంతింటున్నాడో లేదో" అంది. "పాపం. పొట్టకోసం పరాయిచోటుకివెళ్లి అవస్థలు పడవలసివస్తోంది" అనుకుంది. శర్మమాత్రం మాట్లాడకుండా ఒక మంచంమీద చేరి దుప్పటీ కప్పుకొని పడుకున్నాడు. అతనికి గాఢనిద్రలాగ పట్టింది. మర్నాడుదయం ఎనిమిదిగంటలైనా లేవలేదు. రాత్రంతా నిద్రలేదు కాబోలు. కాసేపాగి లేపుదామనుకున్నారు.

"మొహం కడుక్కొని స్నానం చేస్తే నిద్ర బద్ధకమంతా తీరిపోతుంది. భోజనం చేసి సాయంత్రంవరకూ పడుకోవచ్చును" అని రాజ్యం శర్మను లేపటానికి వచ్చింది. శర్మ వళ్లు చుఱ్ఱున కాలుతోంది. కంగారుపడి వెంటనే ఈ సంగతి అత్తగారితో చెప్పింది. ఆమె చేతిలోవున్న పనిని వదిలేసి ఇంకా కంగారుగా శర్మదగ్గరకు వచ్చింది. ఈ హడావుడి అంతా చూసి శర్మ తండ్రి కూడా వచ్చేడు. అందరూ భయపడ్డారు. శర్మను లేపేరు. శర్మకళ్లు యెఱ్ఱగా జ్యోతుల్లాగ వున్నాయి.

ఒక్కగానొక్క కొడుకు. ఉద్యోగమని పేరుపెట్టి వీడిప్రాణాన్ని నిష్కారణంగా తీసేస్తున్నామా? అనిపించింది. "ఉద్యోగం లేకపోతే అందరితోపాటే గంజో అంబలో త్రాగి ఇంటిదగ్గరే పడివుంటాడు. ఉద్యోగంకోసం బలవంతంగా గెంటేము" అని బాధపడిందితల్లి.

"రాకరాక ఉద్యోగం రావటమేమిటి? ఈ జ్వరమేమిటి? గ్రహచారం కాకపోతే" అనుకున్నాడు తండ్రి.

రాజ్యానికి యేమనుకోటానికీ వీల్లేకుండా మనస్సు పూర్తిగా చెదిరిపోయింది.

"త్వరగా వెళ్లి డాక్టరును తీసుకురాండి" అంది తల్లి. కండువా వేసుకొని వెళ్లేడు తండ్రి. ఈలోగా శర్మకు మంచందగ్గరే మొహం కడిగించి కాఫీ కాచియిచ్చేరు. తర్వాత శర్మ మళ్ళీ పడుకున్నాడు. డాక్టరు పదకొండుగంటలకు వచ్చిచూసేడు.

"ఆసుపత్రికి రాండి. మందిస్తాను. ఈ పూటకు కాఫీ హార్లిక్సు తప్ప మరేమీ ఇయ్యవద్దు" అన్నాడు. శర్మ తండ్రివెళ్ళి మందూ, హార్లిక్సు మొదలైనవి తీసికొని వచ్చేడు.

ఇక ఆరాత్రి శర్మ ఈ మానవప్రపంచంలో లేడేమో అనిపించింది.

ఇష్టమొచ్చినట్లు యేవేవో పలవరిస్తున్నాడు. "కాలేజీ - అప్లికేషను, యాభై రూపాయలు మొదలైనవెన్నో అసందర్భమైన మాటలు మాట్లాడుతున్నాడు. అప్పుడప్పుడు 'కృష్ణారావు, కృష్ణారావు,' అని గట్టిగా అరుస్తూ మంచంమీదనుంచి లేచి వెళ్ళబోయేడు. తల్లీ తండ్రీ అతనిప్రక్కనే కూర్చునివున్నారు. రాజ్యం దూరంగా పోయి యేడుస్తూ పడుకుంది.

తెల్లవారిన తర్వాత మళ్ళీ డాక్టరువచ్చి చూసేడు. అందరూ ఆతురతగా వున్నారు. "అబ్బాయిని బ్రతికించి పుణ్యం కట్టుకోండి. మీ ఋణం యేదో విధంగా తీర్చుకుంటాం." అంది తల్లి.

"టైఫాయిడ్ జ్వరం, తగ్గటానికి మూడు వారాలు పడుతుంది. మీరు తొందరపడితే లాభంలేదు" అన్నాడు డాక్టరు.

"ఎప్పటికో అప్పటికి అసలు తగ్గితే చాలు" అన్నాడు తండ్రి.

"లంకణాలు అతి కఠినంగా చేయించాలి" అన్నాడు డాక్టరు.

అసలు యేమి ఇచ్చినా వుమ్మేస్తున్నాడు శర్మ.

డాక్టరు వెళ్ళిపోయిన తర్వాత మధ్యాహ్నం శర్మ తల్లి ఒక నాటువైద్యుణ్ణి పిలిపించింది. వాడు వచ్చి శర్మ చేయిచూసి మాట్లాడకుండా వెళ్ళిపోయేడు. శర్మ తల్లి ఒక్కసారి ఘొల్లుమంది. కంగారుగా తండ్రి లోపలకు వచ్చేడు. జరిగిన సంగతి తెలుసుకొని "వాడి మొహం. ఇటువంటి వాళ్లని యెందుకు పిలుస్తావు?"అని చివాట్లు వేసేడు. "ఒక సమర్థుడైన డాక్టరు వచ్చి చూస్తున్నాడు. భగవంతుని మీద భారంవేసి ఆయన్నే నమ్ముకుందాం" అన్నాడు.

ఆనాటి రాత్రి ఉధృతం మరీ యెక్కువైంది. డాక్టరును వెంటనే తీసుకొని రమ్మనమని యింటిలోనివారి పోరు యెక్కువైంది. "డాక్టరు దేవుడా యేమిటి ఒక్కసారిగా జ్వరాన్ని తీసివేయటానికి. ఓపిక పట్టాలి" అన్నాడు తండ్రి.

"ఓపిక మాకు లేదు. వెళ్ళి తీసుకురావలసిందే" అంది తల్లి. గత్యంతరంలేక వెళ్లేడు తండ్రి చీకట్లో.

డాక్టరుగారి యింటిదగ్గర కుక్క మీదపడి కరచినంత పనిచేసింది. ఆ సందడికి డాక్టరుగారు లేచేరు. శర్మ తండ్రి యింటి దగ్గర పరిస్థితులన్నీ చెప్పి "ఒక్కసారి వెంటనే దయచేయవలసిందనీ, గుర్రపు బండీని తీసుకొని వస్తానని" ప్రాధేయపడ్డాడు. డాక్టరుగారు నెమ్మదిగా ఆవులిస్తూ 'యేమీ కంగారులేదు. రేపు నేను వచ్చి చూస్తాను. మీరు వెళ్లండి"అన్నాడు.

డాక్టరుకు కంగారులేని మాట నిజమే కాని తమకు లేకుండా యెక్కడకు పోతుంది? శర్మ తండ్రికి కోపము వచ్చింది. ఇక మాట్లాడలేకపోయేడు.

"చిత్తం. అల్లాగే. తప్పకుండా ఉదయమే ఒకసారి దయచేయండి" అన్నాడు.

"తప్పకుండా వస్తాను" అన్నాడు డాక్టరు.

ఈలోగా ఇంటిదగ్గర పరిస్థితి మరీ అయోమయంగా వుంది. వాళ్ళు అనుక్షణం

ఒక పత్రికా సంపాదకుడు సంపాదకీయం వ్రాయడానికి విషయ మేమీ దొరక్క, బైబిలులోని దశనిబంధనలను (టెన్ కమాండ్‌మెంట్సు) సంపాదకీయ స్థానంలో అచ్చువేశాడు. మరునాడు ఒక పాఠకుడు ఇలా వ్రాశాడు : "నిన్నటి మీ సంపాదకీయం కొందరు వ్యక్తులను మనస్సులో పెట్టుకుని వ్రాశారు. కనుక నేను కట్టిన చందా యింతవరకూ లెక్క చూచి మిగతాది పంపివేయవలెను."

—"రవి"

డాక్టరుకోసం యెదురు చూస్తున్నారు. క్షణం ఒక యుగంలాగ గడుస్తోంది. ఆరాత్రి శర్మ యిక వారికి దక్కడేమో అనిపించింది.

చివరకు డాక్టరు లేకుండా శర్మ తండ్రి ఒక్కడే వచ్చేడు. ఇక వారి ఆవేదన చెప్పటానికి వీల్లేదు. "ఎప్పుడు తెల్లారుతుందా" అని కనిపెట్టుకొని కూర్చున్నారు. యెంతకీ తెల్లవారకుండా వుంది.

ఉదయమే డాక్టరు వచ్చేడు. శర్మను పరీక్షచేసి డెబ్బయి రూపాయల మందుల జాబితా ఒకటి తయారుచేసి శర్మ తండ్రికిచ్చి వాటిని అర్జంట్‌గా తెప్పించమన్నాడు. ఐస్ తెప్పించి మొహంమీద వేయమన్నాడు. మళ్ళీ మధ్యాహ్నం వచ్చి చూస్తానని డాక్టరు వెళ్ళిపోయేడు. శర్మ తండ్రి ఒక కుర్రవాడిని సైకిల్ మీద పక్కనున్న బస్తీకి పంపి అర్జంటుగా మందులన్నీ తెమ్మన్నాడు. తల్లి "ఇక్కడున్నట్టుగా రావాలి" అని గట్టిగా చెప్పింది.

మందులు తీసుకొని కుర్రవాడు పదకొండు గంటలకు వచ్చేడు. వాటిలో నాల్గురకాలైన మాత్రలు అనేక యింజక్షను బుడ్లు వున్నాయి. ఒక అరగంటలో డాక్టరు వచ్చేడు. ఆ మాత్రలు వేసే క్రమాన్ని చెప్పేడు. ఒక పెద్ద యింజెక్షను గొట్టాన్ని తీసి నాలుగు బుడ్లను పగలగొట్టి గొట్టాన్ని నింపేడు.

"ఇది ఆహారం నరాలగుండా శరీరంలోకి యెక్కించాలి" అన్నాడు డాక్టరు. ఆ దృశ్యాన్ని చూడలేక తల్లి భార్యా, అవతలకు వెళ్ళిపోయేరు. శర్మతండ్రి కళ్ళు సగం మూసుకుంటూ, సగం తెరుచుకుంటూ, చూడలేక చూస్తున్నాడు. డాక్టరుగారు మాత్రం ఏమీ తొణకకుండా మందంతా నరంలోకి యెక్కించేరు.

"ఐస్ తలమీద వేయటానికి వీల్లేదు" అంది తల్లి! జలుబు చేస్తుందని ఆమె భయం. తండ్రి కేకలువేసేడు. మొత్తంమీద భయపడుతూనే ఐసు ముఖంమీద వేసేరు.

ఆరాత్రి గత రాత్రంత గందరగోళంగా లేదు. శర్మ పేలాపన తగ్గించి అలిసిపోయిన వాడిలాగ కదలకుండా పడుకున్నాడు. తల్లీ తండ్రీ మాత్రం మంచందగ్గరే కూర్చున్నారు.

మర్నాడుదయం డాక్టరుగారు వచ్చి చూసేరు. "జ్వర తీవ్రత తగ్గుముఖం పట్టింది. ఇక పరవాలేదు. పత్యం మాత్రం అతి కఠినంగా చేయాలి. జ్వరం తగ్గటానికి మూడు వారాలు పడుతుంది" అన్నాడు.

"తు. చ. తప్పకుండా మీరు చెప్పినట్టే చేస్తాం" అన్నాడు తండ్రి.

డాక్టరు ఆహారాన్ని మామూలుగా నరంలోకి యెక్కించేడు. తండ్రి భయం లేకుండా దగ్గరనుంచుని చూసేడు.

ఆరోజున అందరి మనస్సులూ స్థిమితపడ్డాయి. మధ్యాహ్నం శర్మ తండ్రి కాలేజీ ప్రిన్సిపాలుగారికి శర్మ టైఫాయిడ్ జ్వరం వచ్చి వళ్ళు తెలియని పరిస్థితిలో వున్నాడనీ, దయచేసి ఒక నెల్లాళ్ళు సెలవు మంజూరు చేయవలసిందని వ్రాసేడు.


ఆనాటి సాయంత్రమే శర్మ అత్తగారు మామగారు, విశాలాక్షి రంగారావు మొదలైన బంధువులు ఒక్కరొక్కరే దిగేరు యెంతో ఆదుర్దాగా - పరిస్థితి కొంత కుదుటపడిందని తెలిసి సంతోషించేరు.

శర్మ క్రమేపీ మనుష్యుల్లోకి వస్తున్నాడు. వచ్చినవారిని గుర్తుపట్ట గలిగేడు. చెప్పినది అర్థం చేసుకుంటున్నాడు. మందులు స్వయంగా అడిగి సక్రమంగా వేసుకుంటున్నాడు.


నాల్గవరోజున కాలేజీవారి దగ్గరనుంచి సమాధానం వచ్చింది.

"శర్మది తాత్కాలికపు టుద్యోగమవటం చేత సెలవు మంజూరు చేయటానికి వీల్లేదని శర్మవంటి తెలివైన వానిని ఉపయోగించుకోలేకపోయినందుకు కాలేజీవారు విచారపడుతున్నారనీ, అతనికి రావలసిన జీతం లెక్కకట్టి నెలాఖరుకు పంపించివేయగలమని" రాసేరు. అదునుగ "వచ్చేయేడు ఏదైనా ఖాళీవస్తే శర్మ దరఖాస్తుని సానుభూతితో పరిశీలించగలమని కూడా వ్రాసేరు.


(ఇంకావుంది)




హళేబీడు దేవాలయం



హళేబీడు దేవాలయము







మైసూరు సోమనాథాలయంలో ఒక రాతిలో చెక్కబడిన శిల్పం

★

బేలూరు దేవాలయము

మనగర
సామ్రాజ్య
శిల్ప
వము





32

నోటర్ డామ్ చర్చివద్ద ఈ ముట్టడి జరుగుతున్న సమయంలో పారిస్ నగరం నిద్రపోతోంది. బాస్టిల్‌లో మాత్రం పై అంతస్తులో దీపం వెలుగుతోంది. మహారాజు పదకొండవ లూయీ రెండు రోజులై పారిస్ నగరం వచ్చాడు. రెండు రోజు లిక్కడే ఉండి తిరిగి తన మాంటిల్జ్ కోటకి వెళ్ళిపోతాడు.

మహారాజు మాంటిల్జ్ కోటలోని బ్రహ్మాండమైన మందిరంలో తానొక నలుసైనట్లు బాధపడతాడు. బాస్టిల్ కారాగార భవనం పైభాగం మహారాజు పారిస్ నివాసాని కేర్పాటు చెయ్యబడింది. ఇక్కడి పడకగది, ఆలోచనామందిరం చిన్నవి. అట్టే ఆడంబరమైన అలంకారం లేదు. ఆలోచనామందిరంలో దిండ్లు అమర్చిన ఒక్క పడక కుర్చీ తప్ప మరో కుర్చీగాని, మేజాగాని, బెంచీగాని ఏవీ లేవు.

ఆరాత్రి ఆ మందిరంలో అయిదుగురున్నారు. సర్వాభూషణాలతో ఆడంబరంగా అలంకరించుకున్న ఒక అధికారి ఒక పత్రం చదివి వినిపిస్తుంటే కుర్చీలో కూర్చుని మహారాజు వింటున్నాడు. మహారాజు నిరాడంబరమైన దుస్తులు ధరించాడు. వృద్ధాప్యంవల్ల కొంచెం నడుము వొంగింది.

వెనకవైపున ఫ్లెమిష్ రాయబారు లిద్దరు నిలబడి గుసగుస లాడుకుంటున్నారు. మరొకడు కిటికీవద్ద నిలబడి తదేకంగా ఆకాశంవంక చూస్తున్నాడు. అతడు సైన్యాధికారి దుస్తులు ధరించి ఉన్నాడు.

ఫ్లెమిష్ రాయబారు లిద్దరూ గుసగుసలాడుకుంటున్నారు: "అబ్బబ్బ! కాళ్లు నొప్పులు పుడుతున్నాయి. ఇక్కడ కుర్చీలూ బెంచీలూ ఏవీ లేవే."

రెండోవాడు తల అడ్డంగా తిప్పాడు.

"అబ్బ! చతికిలబడి కూచుందామనుంది."

"అహహ! అంతపని చెయ్యబోకు. ఇక్కడ నిలబడాలి. లేకపోతే మోకరించాలి. అంతే!"

అధికారి పత్రం గబగబ చదువుతున్నాడు. మహారాజు పరివారానికి, వారి ఖర్చులకు తయారైన జాబితా ఏకరువు పెడుతున్నాడు.

"ఆగాగు" అన్నాడు మహారాజు. "ఇంతమందీ నాకోసమే! అంతా ఉత్తది. నన్ను దోచేస్తున్నారు. ఖజానా కొల్లబోతోంది. నాలుగేళ్ళలో ఖర్చు రెట్టింపయిపోయింది. సింహాలూ పులులూ వద్దను—అందరూ కుక్కలూ పిల్లులూ పెంచుకుంటే నేను సింహాలూ పులులూ పెంచుకోవాలి. కాని ఈ మనుషుల్తోనే వస్తుంది. అందరూ నన్ను దోచుకుతిని బలుస్తున్నవాళ్ళే నా చుట్టూ ...కానీ ఏంచేస్తాం. కొన్నాళ్ళకి అందరం మళ్ళీ దేశంమీద పడి ప్రజల్ని దోచుకుందాం. ఇంతేగా మనం చేసేపని...అప్పుడుగాని మహారాజొకడున్నాడని ప్రజలకి తెలిసిరాదు అయితే ఇక్కడ ఖైదీ కింకా డబ్బెందుకు ఖర్చు పెడుతున్నారు? ఎప్పుడో ఉరితియ్యవలసినవాణ్ణి ఎందుకుంచినట్టు? ఇదో ఖర్చా? లాభంలేదు. ఇంక వాడికోసం చిల్లిగవ్వ ఖర్చు పెట్టనివ్వను, వాణ్ణి రేపుపొద్దుట ఉరితీయించవలసిందే. వాడి ఖర్చు కొట్టెయ్య......"

ఇంతలో ఒకడు గబగబ తలుపులు గెంటుకుంటూ వచ్చి మహారాజుముందు మోకరించి ఒగర్చుకుంటూ అన్నాడు: "మహారాజా! నగరంలో తిరుగుబాటు..." అతడి మాటలు ముగియకముందే మహారాజు అతణ్ణి కోటుపట్టుకుని గుంజి లేవనెత్తాడు. అతడికే వినపడేలాగ అతి మెల్లిగా అన్నాడు: "ఇశ్: నోరేనా మూసుకో మెల్లిగా నేనా చెప్పు." అతడు మహారాజు చెవిలో చెప్పాడు. అది విని మహారాజు ఒకసారి ఓరకంట ఫ్లెమిష్ రాయబారుల్ని గమనించి తరవాత బిగ్గరగా నవ్వాడు. నవ్వి బిగ్గరగా అన్నాడు:

మూలం: విక్టర్ హ్యూగో

అనువాదం: సూరంపూడి సీతారామ్

"ఓస్! ఇదా నువ్వుచెప్పేది. చెప్పు గట్టిగా చెప్పు. ఇక్కడ నా మిత్రులుకూడా వింటారు."

"కాని..."

"కానిలేదు గీనిలేదు. చెప్పు, ఏమిటి? నగరలో బికారులు తిరగబడ్డారా?"

"న్యాయసభా భవనాధికారి పైనండి"

"ఎవరు చూశారు?"

"నేనుకూడా చూశానండి"

"ఎందుకు?"

"వారి నివాసం న్యాయసభాధికారి అధీనంలో ఉందండి"

"అతనిమీద వాళ్ళకి కోప మెందుకు?"

"వాళ్ళెప్పుడూ మీ అధికారానికి తప్ప ఇంకెవరి అధికారానికీ లోబడమని చెప్తున్నారండి."

"ఓహో!" అన్నాడు మహారాజు, సన్నగా ఆగంతకుని వైపు కన్నుగిలికి.

"అలా పార్లమెంటుకుకూడా వాళ్లు విన్నవించుకున్నారండి."

తృప్తి కలిగింది మహారాజుకు. కొంతసేపు ఆలోచించాడు.

"చాలమంది ఉన్నారా?"

"కనీసం ఆరువేలమంది ఉంటారండి"

"ఆయుధా లున్నాయా వాళ్లదగ్గిర?"

"పలుగులూ పారలూ అవీ రకరకాలున్నాయండి."

మహారాజు ముఖంలో ఆందోళన ఎంతమాత్రం కనపడకపోవడం గమనించి ఫ్లెమిష్ రాయబారులు ఆశ్చర్యపడ్డారు.

"మహారాజు సహాయం పంపకపోతే న్యాయసభాభవనాధికారి పని మూడిపోతుందండి."

"ఓ! తప్పకుండా పంపుతాను. ఆరువేలమంది! బికారి వెధవలు! ఎంత సాహసం! కాని ఇక్కడా ట్టేమంది లేరిప్పుడు. రేపు ఉదయం చూద్దాం."

"వెంటనే అవసరమండి. లేకపోతే అక్కడ భవనాలన్నీ కొల్లగొట్టేస్తారు."

"రేపు ఉదయం అన్నాను. వినపడిందా? అంతే" అన్నాడు మహారాజు. ఇంక దినికి సమాధానం లేదు. తరవాత తనలో తాను అనుకుంటున్నట్లు అందరికీ వినపడేలాగ అన్నాడు: "బాగుంది. లేకపోతే ఈ నగరాన్ని, ఈ దేశాన్ని సామంతులూ అధికారులూ పంచుకొంటున్నారు. ఎవడి ప్రాంతానికి వాడు చక్రవర్తి అనుకుంటున్నాడు. తన సైన్యం, తన న్యాయాధిపతులు తన శాసనం అంటూ ఉరి స్తంభాలూ, సైనికదళాలూ నిర్మించుకుని కూచున్నారు. ఇంకది లాభం లేదు, దేశాని కంతకీ ఒకే రాజుండాలి, ఒకే శాసనం ఉండాలి, జాతీయసైన్యం ఒకటే ఉండాలి. మంచి పని చేశారు. దోచుకోండి. ఈ రాజులు రాజులు కారు. ప్రజలే ఇకనించి..."

పెదవి కొరుక్కున్నాడు మహారాజు. తలమీద టోపీ తీసి దానివంక ఒకసారి చూశాడు: "నా బుర్రలో ఏముందో తెలుసుకోవాలనుకొన్నావో—జాగ్రత్త. నిన్ను కాల్చి బూడిదచేసెయ్యగలను" అన్నాడు.

ఒకసారి అందరివంకా చూశాడు.

"అయ్యో! తొందరపాటులో మరిచిపోయాను. తిరుగుబాటుదారుల్లో ఇద్దర్ని పోలీసులు పట్టుకుని తీసుకొచ్చారు. వారు ఇక్కడే ఉన్నారు. తమముందు హాజరు పెట్టమంటారా?"

"ఇంకా చూస్తావేం, తీసుకురా త్వరగా."

~~అతను గబగబవెళ్ళి ఇద్దరు బికారుల్ని మహారాజు సమక్షంలో~~

నిలబెట్టాడు. ఒకడు బొద్దుగా పొట్టిగా ఉన్నాడు రెండోవాడు సన్నగా పొడుగ్గా ఉన్నాడు

మొదటివాణ్ని చూసి అడిగాడు మహారాజు "నువ్వెవరు?"

"ముష్టివాణ్నండి."

"చాకులో ఏంచేస్తున్నావ్?"

ముష్టివాడు మాట్లాడలేదు.

"తిరుగుబాటుకి కారణం?"

"నాకు తెలియదండి. అందరూ వెళ్లారు, నేనూ వెళ్ళానండి"

"వా డెవడో నీకు తెలుసా?"

"తెలియదండి."

"చాలు వీణ్ని తీసుకుపొండి."

అంతవరకూ కిటికీవద్ద నిశ్చలంగా నిలబడిన సైనికాధికారి వచ్చి ముష్టివాణ్ని తీసుకుపోయాడు.

మహారాజు రెండోవాణ్ని అడిగాడు "నీపేరు?"

"పీర్ గ్రింగైర్"

"నీ వృత్తి?"

"కవినండి."

"తిరుగుబాటా? ఎంత సాహసం? ఏరా? చెప్పు?"

"అయ్యో! నాకా తిరుగుబాటుతో సంబంధం లేదండి."

"అదేమిటి? నిన్నక్కడే కాదూ పట్టుకున్నది?"

"కాదండి. పొరపాటున నన్నుకూడా పట్టుకున్నారండి. నా మనవి చిత్తగించండి. నేను కవిని. కవులైనవారికి రాత్రివేళ వీధుల్లో తిరగడం అలవాటండి. అదే మాకు మంచి అదను. పొరపాటుపడి పోలీసులు నన్నుకూడా పట్టుకువచ్చారండి. మీ పాదాలంటి ప్రార్థిస్తున్నానండి..."

"నోరుముయ్! సిగ్గులేదూ?"

సైనికాధికారి తిరిగివచ్చాడు. "వీణ్నికూడా తీసుకుపొమ్మంటారా?" అని మహారాజు నడిగాడు.

"ఓ! ఎందుకు తీసుకెళ్ళకూడదు?"

"నే చెప్తానండి" అన్నాడు గ్రింగైర్. మోకరిల్లి మహారాజు ముఖంలోకి దీనంగా చూశాడు. మహారాజు ముఖంలో ఎలాటి మార్పూ లేదు.

"ప్రభువులు నా ప్రార్థన చిత్తగించండి నావంటి అల్పుడిపైన మీవంటివారు కోపగిస్తే మేం ఎలా బ్రతగ్గలం?"

నాటకంలోవలె అభినయిస్తూ పెద్ద ఉపన్యాసం మొదలు పెట్టాడు గ్రింగైర్.

"పిల్లిమీద బ్రహ్మాస్త్రం ప్రయోగించకండి ప్రభూ, మహాప్రభువులకు దాక్షిణ్యమే కిరీటం. తమరు కన్నెర్రచేస్తే ప్రజలు కటకటలాడిపోతారు. ప్రచండ శీతవాయువులు చెలరేగినప్పుడు మనిషి పైన కప్పుకున్న చలికోటు తియ్యడు సరిగదా మరింత బిగించుకుంటాడు. సూర్యభగవానుడు చిరునవ్వుతో ఉదయ కిరణాలను ప్రసరించినప్పుడు స్వయంగా చలికోటు తీసివేస్తాడు. నేను ముష్టివాణ్ని కాను, బికారిని కాను, దొంగని కాను. కవికి దోపిడితో పనిలేదు. తిరుగుబాటులో చెయ్యిచేసుకోడు. రాజభక్తి నా మతం. బిడ్డలకు తండ్రియెడ ఉండే భక్తిప్రపత్తులు, ఆదర ప్రేమలే నాకు మీపట్ల ఉన్నవి. నా దుస్తుల్నిబట్టి నన్ను శిక్షించకండి. నేనంత ధనవంతుడ్ని కాదు నిజమే. పేదవాడినైనా నాకు తమ పట్లభక్తి తప్ప మరొక భావంలేదు. కవులు ధన మార్జించలేరని మీకు తెలుసును. సుగుణాలలోకల్ల దాక్షిణ్యం శ్రేష్ఠమైనది. నన్ను కనికరించండి కవులను రక్షించేవారు ప్రభువులు.. ఆరి

~~స్టాటిల్‌ని అలెగ్జాండర్ ఉరి తియ్యలేదు. యువరాజుగారి వివాహ~~

★ ఘంటారావం ★

ప్రసక్తిగురించి ఒక నాటకం కూడా రచించాను. అటువంటిది వ్రాసినవాడు తిరుగుబాటుదారు కానేరడు..."

మహారాజు వింతగా ఉపన్యాసం వింటూ గ్రింగైర్ వంక చూస్తూనే ఉన్నాడు. చివరి కన్నాడు: "అబ్బ! ఏం ఘోరణి. ఛీ! వీణ్ని విడిచిపెట్టు."

గ్రింగైర్ సంతోషానికి మేరలేదు. మహారాజుముందు సాష్టాంగదండప్రణామంచేసి పాదాలు తాకాడు.

మహారాజు సైనికాధికారివంక తిరిగి అన్నాడు: "అంత ధనం ఖర్చుపెట్టి ఖైదులు తయారుచేయించింది ఇలాంటి పక్షుల కోసం కాదు. గెంటెయ్యి వీణ్ని ఇక్కడనించి."

"ఆహాహా! మహాప్రభువులు" అంటూ లేచాడు గ్రింగైర్. మళ్ళీ మహారాజు మనస్సు మార్చుకుంటాడనే భయంతో త్వర త్వరగా వెళ్ళిపోయాడు.

మహారాజు ఉత్సాహంగా ఉన్నాడు. న్యాయసభా భవనం అధికారిపై తిరుగుబాటును గురించి విన్నప్పటినుంచీ మహారాజు ముఖం కళకళలాడుతోంది. ఇంతలో రాజవైద్యుడొచ్చాడు. అతడు వస్తూనే అతి వినయంగా మహారాజు నడిగాడు. "తమ కేదో బాధ...ఎలా వుందండి?"

"ఓ! బాధా! అవును జ్ఞాపకం వచ్చింది. చెవుల్లో రొద... గుండెల్లో మంటలు భగ్గుమంటున్నాయి"

వైద్యుడు మహారాజు చెయ్యి చేతిలోకి తీసుకుని నాడి పరిశీలించాడు. పరిశీలిస్తున్న వైద్యుని ముఖంలో క్రమక్రమంగా ఆందోళన వ్యక్తం కాసాగింది. మహారాజుకూడా కంగారుపడ్డాడు. ఈ వైద్యుని భుక్తికి మహారాజు అనారోగ్యమే ఆధారం. అందువల్ల తన జీవనాధారాన్ని అతిజాగ్రత్తగా పెంపొందించుకుంటూ వచ్చాడు.

"అమ్మమ్మ! ఇది ప్రమాదమే!" అన్నాడు వైద్యుడు.

"నిజం?"

"నాడీ చలనం వేగంగా ఉంది. క్రమంలేదు. ఉండుండి వేగం హెచ్చుతుంది, ఉండుండి తగ్గుతుంది."

"ఓయి దేవుడా!"

"వెంటనే చికిత్స చెయ్యకపోతే మూడురోజుల్లో ముప్పుంది."

"ఆ! ఆ! అయితే చికిత్సేమిటి? చెప్పు? చెప్పు?"

"ఆగండి, ఆలోచించి చెప్తాను."

మహారాజుని నాలుక చూపమన్నాడు. నాలుక చూసి వైద్యుడు బుర్ర అడ్డంగా తిప్పాడు. వైద్యుని ముఖం గంభీరంగా ఉంది.

"అయ్యా! అన్నట్టు ఒకటి అడగాలనుకున్నానండి, మరిచిపోయాను. తమ అధీనంలో ఉద్యోగాలు కొన్ని ఖాళీ పడ్డాయండి. నాకో మేనల్లుడున్నాడండి. ఇదివరలో మీకు మనవి చేసే ఉన్నాను......"

"నీ మేనల్లుడికో ఉద్యోగం ఇచ్చేస్తున్నాను. తప్పకుండా ఇస్తున్నాను. కాని చికిత్స ఏమిటో చెప్పు."

"తమరు దయాపరులు. నేను ఇల్లు కట్టుకుంటున్నానండి. కొంచెం ధనసహాయం..."

"ఓ. తప్పకుండా."

"ఇప్పుడున్న పాతఇంటికి పైకప్పు వేయించుకోవాలండి. మేడమీద చిత్రపటాలున్నాయండి......"

"కిరాతకుడవ్. రక్తం పీల్చే జలగవ్. కాని. నీ కెంత కావాలో తీసేసుకో. నా నోట్లో ఒక్కపన్ను తియ్యాలంటే, నీ యింట్లో వజ్రాలహారం ఒకటి చేయించుకుంటున్నావు."

"చిత్తం! చిత్తం! చికిత్సావిధానం అంతా రాసిఉంచుతానండి."

దీపం వెలిగించగానే పురుగులు చేరతాయి.

మహారాజు ప్రక్కనే నిలబడి ఖర్చుల జాబితా చదివిన రాజాధికారి అదే మంచి తరుణమనుకున్నాడు. "తమ ఖజానా శాఖలో ఒక ఉద్యోగి ఈమధ్య చనిపోయాడండి."

"అయితే?" అన్నాడు మహారాజు.

"అప్పే. ఖాళీగా ఉందన్నానండి"

"అబ్బబ్బ! నీ ఆశకి అంతులేదు. ఆరేళ్ళకిందట నువ్వే పరిస్థితిలో ఉన్నావో జ్ఞాపకముందా? నిన్నెంత వృద్ధిలోకి తీసుకొచ్చానో గుర్తుంచుకో. అట్టే దురాశకి పోకు, 'దురాశవల్ల చేటు తప్పదు. గర్వాని కెప్పుడూ నీడలాగా పతనం,అవమానం వెన్నంటి ఉంటాయని మర్చిపోకు."

రాజాధికారి నిరాశతో పక్కకు తప్పుకున్నాడు. అయితే అతడు నిర్లక్ష్యభావం స్పష్టపరుస్తూ "మహారాజు ఆరోగ్యం ఇవాళ అట్టే బాగుండలేదు" అన్నాడు.

మహారాజుకి ఆగ్రహం రాలేదు. వైద్యునివంక తిరిగాడు. "మంత్రులకంటె రాజాధికారులకంటె రాజవైద్యుడే అదృష్టవంతుడు. అంతేనా?" అన్నాడు రాజాధికారివంక చూస్తూ. మహారాజుకు కోపం తెప్పించడం అసాధ్యం అనుకున్నాడు రాజాధికారి.

మహారాజు కిటకీవద్దకు వెళ్ళిచూశాడు. దూరాన మంట కనపడింది. "పెద్దమంటలాగే కనపడుతోంది."

"తిరుగుబాటు అణచడం కష్టమే" అన్నాడు రాజాధికారి.

"ఓహో! అలాగా! కాని నేను తల్చుకుంటే..."

"మీరు తల్చుకునేలోగానే కార్యం కాస్తా తీరిపోతుందిలెండి."

"నేను తల్చుకుంటే చిటికలో అణిచివెయ్యగలను."

"అంటే ప్రజలకి అదనుదొరికిందన్నమాటే!"

సైనికాధికారి ఈమాటు ముందుకువచ్చాడు. "మహారాజుతో మాట్లాడుతున్నారని మరిచిపోకండి" అని గద్దించాడు.

"ఫరవాలేదు......మాట్లాడనియ్యి. నిర్భయంగా నాదగ్గర మాట్లాడేవాళ్లు కావాలి. ఆ! ఏమిటోయ్ చెప్పు."

రాజాధికారి తత్తరపడ్డాడు మహారాజు చనువు ఇస్తున్నాడంటే ఏదో ముప్పుందన్నమాటే.

"నేనే పొరపడి ఉండవచ్చండి..."

"ఫరవాలేదు. చెప్పు. ప్రజలకి అదను వస్తున్నదంటావ్. కానీ. బాస్టిల్ అంత చప్పున ప్రజలచేతుల్లో పడదులే .."

ఇంతలో నగరాధికారి ఒకడు గబగబ వచ్చాడు. "మహారాజా! ముప్పు ముంచుకువచ్చింది"

"ఏమిటది?"

రాజాధికారి వెంటనే అందుకున్నాడు. అందరికీ వినపడేలా అన్నాడు: "భికారుల తిరుగుబాటు తమపై నేనండి."

"ఏమన్నావ్?" అన్నాడు మహారాజు కోపంతో. "జాగ్రత్త. నిజం చెప్పు. లేకపోతే నీతల ఎగిరిపోతుంది"

మహారాజు సాధారణంగా ఎవరినీ ఇలా బెదిరించడు బెదిరిస్తే ఏదో మూడిందన్నమాట. రాజాధికారి గజగజలాడిపోయాడు. మహారాజుముందు మోకరిల్లి విన్నవించుకున్నాడు: "తమ న్యాయసభాధిపతి ఒక మంత్రకత్తెకు ఉరిశిక్ష విధించాడు. ఆమె నాటర్ డామ్ చర్చిలో ఆశ్రయం తీసుకుంది భికారులందరూ ఆమెను

అపహరించడంకోసం ఇప్పుడు చర్చిని ముట్టడిస్తున్నారు. నే చెప్పిన మాటల్లో అబద్ధమేదైనా ఉంటే ఈ నగరాధికారినే అడిగి తెలుసుకోండి"

మహారాజుముఖం ఎర్రబారింది. కోపంతో వాణికి పోయాడు: "ఓహో! అలాగా! నాటర్‌డామ్ చర్చిని ముట్టడించారన్నమాట! సరే ఇంక ఈ మూక అంతుచూస్తాను. నాపైనే తిరుగుబాటు చేశారా!"

తరవాత మహారాజు సైనికాధికారిని పిలిచి వెంటనే ఏ యే సైనికదళాలను ప్రయోగించాలో వివరంగా ఆజ్ఞలిచ్చాడు.

"సంకోచించకు, చర్చిలో ప్రవేశించడానికి జంకనక్కరలేదు."

"మంత్రకత్తె నేంచెయ్యమని ఆజ్ఞ?"

"అసలు దాన్నెందుకు అపహరించాలనుకున్నారు వాళ్లు?"

నగరాధికారి చెప్పాడు: "ఆశ్రయంలో ఉన్నదాన్ని అపహరించాలనుకున్నారు కాబట్టి, వాళ్ళ ఉద్దేశం దాన్ని ఉరితియ్యాలనే అనుకుంటానండి."

మహారాజు కొంచెంసేపు ఆలోచించాడు. "ఆ మూకల్ని హతమార్చి, దాన్ని ఉరితియ్యండి. తీరిపోతుంది."

"చర్చిలోకి ప్రవేశించి దాన్ని పట్టుకుని ఉరితియ్యమంటారా?"

"చర్చి ప్రవేశించండి. ఫరవాలేదు." అంటూ మహారాజు ఒక గోడవద్దనున్న మేరీ ప్రతిమవద్దకు వెళ్ళి అక్కడ మోకరించాడు: "దేవీ. నన్ను క్షమించు. మీ చర్చి పవిత్రమైనదే. కాని దేశంకోసం, న్యాయంకోసం అప్పుడప్పుడు మా అధికారులు చర్చి ప్రవేశించక తప్పదు. ఆమంత్రకత్తెని శిక్షించక తప్పదు. ఈమాటుకి క్షమించు. ఇంకెప్పుడూ ఇలా చెయ్యను మీకోక వెండి ప్రతిరూపం నిర్మింపచేసి చర్చికి బహూకరిస్తాను." దేవికి మొక్కి లేచాడు మహారాజు.

33

బాస్టిల్ నుంచి బైటపడి గ్రింగైర్ వీధివెంట గుర్రంలా పరుగెత్తసాగాడు. కొంతదూరం పరుగెత్తి హఠాత్తుగా ఆగిపోయాడు. ఎదురుగా నల్లగా ఒకమనిషి ఆకారం కనపడింది. ఆ మనిషి నిలువెల్లా నల్లనిదుస్తులు ధరించాడు.

"ఎవరు?" అన్నాడు గ్రింగైర్.

"నువ్వా గ్రింగైర్? ఇంత రాత్రివేళ! వీధుల్లో ఏంచేస్తున్నావు?" గ్రింగైర్ గుర్తుపట్టాడు.

"నా తప్పుకాదు." అన్నాడు. "పోలీసులు నన్ను పట్టుకుని మహారాజుదగ్గిరికి తీసుకుపోయారు. కాస్తంతలో తప్పింది ముప్పు. లేకపోతే ఉరితీసేవాళ్ళే ఎప్పుడో అది నాకు తప్పదనుకుంటానులెండి."

"అది నిజమేలే... కాని త్వరగా నడు. చర్చిముందు బికారులు దారికి అడ్డంగాఉన్నారు. గబగబ వెళ్ళాలి మనం. నడు. వాళ్ళతో నీకు స్నేహమేగా!" అన్నాడు క్లాడ్ ఫ్రాలో.

"ఓ! నడవండి. కాని చర్చిలోపలి కెలా వెళ్ళడం?"

"గోపురద్వారం తాళంచెవులు నాదగ్గిరున్నాయిలే"

"తరవాత బయటపడ్డం ఎలాగ?"

"నదిపక్క దారి ఉంది. అక్కడో బోటుకూడా ఉంచాను సిద్ధంగా!"

"అబ్బ! ఎంతలో తప్పిపోయింది ఉరి! నడవండి"

ఇద్దరూ గబగబ నడిచారు.

అక్కడ చర్చిదగ్గర ఏం చేయాలో తోచక క్వాసిమోడో మిద్దెపైన బోనులో పులిలాగ అటూ ఇటూ తిరుగుతున్నాడు ఎమ

ఒకాయనకి యిద్దరు కొడుకులున్నారు. పెద్దవాడు డాక్టరు పరీక్ష, చిన్నవాడు లాయరుపరీక్ష ఒకేసారి ప్యాసయి, కొత్తగా ప్రాక్టీసు ప్రారంభించారు. ఇంకా వాళ్ళకి ఒక్క కేసైనా రాలేదు. ఇంతలో తండ్రి ఒక కారు ప్రమాదంలో దెబ్బ తిన్నాడు.

పెద్దవాడు: "నేను మీగాయం నయం చేస్తాను. ఓం ప్రథమంలో మీతో ప్రారంభించడం నాకు చాలా శుభసూచకం," అన్నాడు. చిన్నవాడు "అలా ఎంతమాత్రంవీల్లేదు. ప్రాణం పోయినా సరేనాన్న గాయం నయం చేయడానికి వీల్లేదు. నేను కేసుపెట్టి గెలిచి, కారు యజమానినుంచి నష్ట పరిహారం గుంజి తీరుతాను. నా మొగటి కేసుకు అడ్డురావడానికి నీకు హక్కులేదు," అని అన్నతో దెబ్బలాడాడు.

రాల్దాను రక్షించగలనన్న ఆశ అతడికి అంతరించింది. తన క్షేమం గురించి అత డాలోచించనేలేదు. ఆమెను కాపాడ్డమే అతని ఏకైక లక్ష్యం.

చర్చి బికారుల స్వాధీనంకాబోతుందన్న సమయంలో హఠాత్తుగా వెనుక వీధులలో గుర్రాల డెక్కల చప్పుళ్లు వినవచ్చాయి. పెద్ద అశ్వికదళం ఒకటి అతివేగంగా వచ్చి బికారులను చుట్టుముట్టింది. బికారులు భీతితో వెనక్కుచూశారు. కన్ను తెరిచి మూసేటంతలో ఆ చౌకులో బికారులకూ అశ్వికులకూ మధ్య సంకులసమరం ప్రారంభమైంది

క్వాసిమోడోకి ఘోష వినరాలేదు కాని కత్తుల తళతళలు, కాగడాల వెలుగులలో అశ్వికులు కనపడ్డారు. అశ్వికుల నాయకుడు కెప్టెన్ ఫీబస్‌ని అతడు గుర్తుపట్టాడు. బికారులు పికాపికలై పరుగెత్తడం చూశాడు. అనుకోకుండా వచ్చిన సహాయం చూసేసరికి అతడి కెక్కడలేని ఉత్సాహం, బలం పొంగివచ్చాయి. నిచ్చెనలెక్కి వచ్చినవారిని గబగబ క్రిందికి గెంటివెయ్యనారంభించాడు.

పారిపోగా మిగిలిన బికారులు మూలచిక్కువడిన పిల్లివలె ప్రాణాలకు తెగించి పోరాడారు. తోడేల్ని చీల్చి ముక్కలు చెయ్యాలంటే కుక్కపళ్లతో కరవాలి అన్నాడొకడు. ఫీబస్ సైన్యం బికారుల్ని చీల్చి చెండాడింది. కొందరు బికారులు అశ్వికుల్ని గుర్రాలపైనుంచి పడలాగి చిత్రవధ చేశారు. చౌకు శవాల కుప్పలతో నిండి నెత్తురుమయమై భీభత్సంగా ఉంది.

గంటలో పోరు ముగిసింది. పారిపోగా మిగిలిన బికారులు చిత్రవధ చెయ్యబడ్డారు చచ్చిపోగా మిగిలిన అశ్వికులు విజయఘోషచేసి వెళిపోయారు.

ముప్పు తీరిపోగానే క్వాసిమోడో విజయోత్సాహంతో ఆకాశంవంక చేతులెత్తి దైవానికి భక్తితో మొక్కాడు ఆనందంతో పరుగుపరుగున సోపానా లెక్కి ఎమరాల్దాగదివద్దకు వెళ్లాడు. వెళ్ళి చూసి నిర్ఘాంతపోయాడు. గది ఖాళీగా ఉంది! గదిలో ఎమరాల్దా లేదు!

(ఇంకా వున్నది)

బొమ్మరిల్లు

కోతి చేష్టలు

★ ★

★

జవ్వాది వెంకట రామారావు

పుంత ప్రక్క చెఱువుగట్టు,
గట్టుపైన చింత చెట్టు
చెట్టుయొక్క కొమ్మ ఒకటి
చెఱువునందు వాలుచుండె.

కొమ్మమీద కోతిపిల్ల
రెమ్మలెన్నొ విరచుచూ
నీటినందు బారవైచి
కొమ్మలపై దూకుచుండె;

ఇంతలోన పిల్ల తల్లి
వలదు కుఱ్ఱ చేష్టలంచు
"వలదు కొమ్మ విరువవద్దు
కలుగు అపాయంబు నీకు
చెఱువునందు బడెద" వనెను;
తల్లి మాట పెడచెవి నిడి
పిల్లకోతి గర్వముతో
అల్లరెంతో చేయుచుండె.

సంతోషం బధికమయ్యె
కుప్పిగంతు లెక్కువయ్యె
సందడిలో కాలుజారి
చెఱువునందు బుడుగుమనియె.

నీతి: —తల్లిమాట విననివారు
పిల్లకోతివలె చెడుదురు.
జూచితిరా పిల్లలార!
కోతిచేష్ట లెంత చెరుపొ?

సజీవ ప్రతిమ

పూర్వం మగధ దేశంలో లావణ్య అనే వేశ్య ఉండేది. ఆమె అపురూపసౌందర్యవతి. ఆమె చక్కదనంగురించి దేశదేశాలవారు చెప్పుకునేవారు. ఒక్కసారి ఆమెనుచూసి పోదామనే ఆశతో రాజాధిరాజులుకూడా ఎంతో దూరదేశాలనుండి వచ్చేవారు. కాని లావణ్యాదర్శనం చేసుకోవటం సులభంకాదు. ఆమెను చూడాలంటే నూరు వరహాలు చెల్లించాలి. ఆమెతో ఒక ఘడియసేపు మాట్లాడాలంటే వెయ్యి వరహాలు చెల్లించాలి. ఇక ఆమెతో ఒకరోజు గడపాలంటే అది ఏమహారాజులో, కుబేరులైన వర్తకులో చేయవలసిన పని.

ఈవిధంగా లావణ్య ఇరవైసంవత్సరాలైనా నిండకముందే అంతులేని ధనం గడించింది. రాజభవనాలకు తీసిపోని అద్భుతమైన మహలు కట్టించి, చుట్టూ బ్రహ్మాండమైన నందనోద్యానం వేయించింది. వందలాది నౌకర్లతో, చాకర్లతో మహారాజులకంటె కూడా గొప్పగా జీవిస్తూవచ్చింది. కనుకనేఎందరుమహారాజులు వచ్చి పెళ్ళాడుతామన్నా ఆమె ఒప్పలేదు. వారామెను తమ పట్టపురాణిని చేస్తామంటే, "పట్టపురాణి పట్టపురాజుకు లోకువ. నేను సాటిలేని పట్టపురాణీని," అని ఆమె గర్వంగా సమాధానం చెప్పింది.

ఇట్లాఉండగా ఒకనాడు లావణ్యాదర్శనం కొరకు ఒక యువకుడు వచ్చాడు. అతడు తనవెంట ఒక మూటకూడా తెచ్చాడు అందులో సరిగా నూరు వరహాలున్నాయి. లావణ్యను ఒక విఘడియపాటు చూడటానికి మాత్రమే అవి సరిపోతాయి. అతను వచ్చినదికూడా లావణ్యను చూడటానికే తప్ప ఆమెతో మాట్లాడటానికి కాదు.

నూరు వరహాలు లోపలికి వెళ్లిన కొద్దిసేపటికి లావణ్య తెర తోసుకుని వచ్చికూర్చున్నది. యువకుడామెను చాలా శ్రద్ధగాపరీక్షించాడు. అతను గాని ఆమెగాని పెదవి మెదపలేదు. విఘడియ అయిపోగానే ఆమె లేచి తెరమాటుకు వెళ్ళిపోయింది. యువకుడు బయటికి వచ్చాడు. అతను నేరుగా చెక్కుడు రాళ్ళు అమ్మేచోటికి వెళ్ళి ఆరడుగుల నిడివిగల రాయి ఒకటి కొన్నాడు. దానిని బండిమీద వేయించుకొని సమీపంలో ఉన్న అరణ్యంలోకి వెళ్ళి, అక్కడ చిన్న కుటీరం వేసుకుని తాను కొన్న రాయిని చెక్కసాగాడు.

ఈ యువకుడొక గొప్ప శిల్పి. దానికితోడు కొన్ని శక్తులనుకూడా సాధించినవాడు ఇతను లావణ్య యొక్క సౌందర్యం గురించి విని ఆమె రూపాన్ని ప్రతిమగా చేయాలనే ఉద్దేశంతో బహుదూర దేశం నుంచి వచ్చాడు. కొద్దిరోజులలో ప్రతిమ తయారయింది. లావణ్యను అతను ఒక్క విఘడియ మాత్రమే చూసినప్పటికీ ఆమె ప్రతిమను అచ్చుగుద్దినట్టుగా తయారుచేశాడు. అంతేగాక, ఈ శిల్పి ఈప్రతిమకు రంగులుకూడా వేశాడు. తాను చూసినప్పుడు లావణ్య శరీరచ్ఛాయా, చీరెరంగులూ, రవికెరంగులూ, ఆభరణాలలో రత్నాలరంగులూ ఏయేవిధంగా ఉన్నాయో ఈప్రతిమకు కూడా అదేవిధంగా రంగులు అమర్చాడు. ఆప్రతిమను చూసిన వారు అది శిలాప్రతిమఅని అనుకోలేరు. మూడుమూర్తులా లావణ్య ఎదురుగా నిలచి ఉన్నట్లేభావిస్తారు.

ఈప్రతిమ పూర్తి అయిపోయిన రాత్రి ఆశిల్పి అర్థరాత్రివేళ దానిని తిరిగి బండిమీద వేయించుకొని లావణ్య ఇంటిముందు దానిని ప్రతిష్ఠించి, తెల్లవారేలోగా మగధ సరిహద్దుదాటి తనదారిన తాను వెళ్లిపోయినాడు.

మర్నాడు ఉదయమే మసక వెలుతురులో లావణ్య ఇంటి ముందుగా వెళ్లే పౌరులు కొందరు ఆప్రతిమను చూసి మనిషి అని భ్రమపడ్డారు. అంతకుపూర్వం లావణ్యను చూసినవారు, ఆమె స్వయంగా ఎందుకో అక్కడ నిలబడిందని కూడా అనుకున్నారు. కాని అది ప్రతిమ మాత్రమేనని త్వరలోనే తేలింది. ఇక చెప్పేదేమిటి? బారెడు పొద్దెక్కేలోపుగానే తీర్థప్రజగా జనం అక్కడ మూగి, ఆప్రతిమను చూడటానికి ఒకరినొకరు తోసుకోసాగారు. తమలోతాము కొట్టుకోసాగారు. అందులో ఆశ్చర్యం ఏముంది? నూరువరహాలు ముడుపు చెల్లిస్తే

★ సజీవ ప్రతిమ ★

గాని చూడలేని లావణ్యను ఊరికే చూసే అవకాశం అందరికీ లభించింది.

ఈ వార్త త్వరలోనే లావణ్య చెవిని పడింది. విషయం కనుక్కొని రమ్మని తన నౌకర్లను పంపింది. వారు వచ్చి ఆమె ఇంటి ఎదట ప్రతిష్ఠించి ఉన్న విగ్రహాన్నీ, దానిని చూడటానికి ఎగబడే జనాన్నీ వర్ణించారు. ఆ ప్రతిమను తనకు తెలియకుండా ఎవరు తయారు చేశారో ఆమె ఊహించలేకపోయింది. ఆమెకు ఒక భయం పట్టుకుంది. అదేమంటే తనను చూడటానికి ఎవరూ నూరు వరహాలివ్వరని.

పొద్దెక్కిన కొద్దీ ప్రతిమను చూడవచ్చేవారు అధికమవుతున్నారు. గలాటా హెచ్చింది. జనం ఒకరినొకరు తలలు పగలగొట్టుకునే దాకా వచ్చింది. తలారి వచ్చాడు. రక్షకభటులను నియోగించి జనాన్ని చెదరగొట్టించాడు. ప్రతిమను చూస్తూ ఆశ్చర్యంతో నిలబడిపోయాడు. ఇంతలో తన కర్తవ్యం గుర్తుకొచ్చింది. ఎదురుగా ఉన్న లావణ్య ఇల్లు ప్రవేశించాడు. లావణ్యకోసం కబురు చేశాడు. లావణ్య వచ్చి తెర వెనుక నిలబడి, ఏమిటి విశేషమని అడిగింది.

"మీ ఇంటిబయట ఉన్న ప్రతిమ ఎవరిది? దానిని అక్కడ ఉంచినవారెవరు? ఎవరి అనుమతితో ఉంచారు?" అని అడిగాడు తలారి.

"అదేమో నాకు తెలియదు," అన్నది లావణ్య.

"అది శాంతిభంగం కలిగిస్తోంది. అక్కడ ఉండటానికి వీలులేదు," అన్నాడు తలారి.

"నాకిప్పించెయ్యండి. నేను కొంటాను," అన్నది లావణ్య.

"వల్లగాదు. ముందు అది ఎవరి సొత్తో తేలాలి. సొత్తుదారును నేర విచారణ చేయాలి," అన్నాడు తలారి.

చాటింపు వేశారు. కాని లాభం లేకపోయింది. ఆ ప్రతిమ తన సొత్తని ఎవరూ ముందుకు రాలేదు. ప్రతిమ రాచసొత్తయింది. దానిని వేలం వేశారు. ఆ ప్రతిమను కొనటానికి ఎందరో లక్షాధికారులు వచ్చారు. పాటపాడరు. కాని లావణ్య తన నౌకర్లచేత ఎక్కువ మొత్తానికి పాటపాడించి ఆ ప్రతిమను తానే కొనుక్కున్నది.

తనను చూడటానికి ఎవరూ రారనీ, నూరేసి వరహాల రాబడి పోతుందనీ భయం తీరిపోయింది. ఆమె ఆ ప్రతిమ ఎదట నిలబడితే అద్దంలో చూసుకున్నట్టే ఉంది. దానిని చేసినవాడు మానవమాత్రుడు కాడు. ఈ ప్రతిమకోసం లావణ్య లక్షవరహాలు ఖర్చుపెట్టవలసివచ్చింది. అయినా నష్టం లేదు. ఈ ప్రతిమను పదేసి వరహాలకు ప్రజలకు చూపవచ్చు. దానిని చూసినవారు తనను చూసినట్టే సంతోషిస్తారు. పదేసి వరహాలంటే అంత ఎక్కువ పెద్ద మొత్తం కాదు గనక ఎంతో మంది వచ్చి చూసి వెళ్ళిపోతారు. దానికోసం తాను ఖర్చుచేసిన లక్షవరహాలు అతిశీఘ్రంగానే తనకు తిరిగివస్తాయి. తన సౌందర్యం శాశ్వతం కాదు. అది రేపు మాసిపోతుంది. కాని ఈ ప్రతిమ ఎప్పటికీ మాయదు. దాని సౌందర్యం శాశ్వతమైనది. ఈవిధంగా అనుకుని లావణ్య తృప్తిపడింది.

కాని కొద్దిరోజులలోగా ఒక చిత్రం బయటపడింది. ఈ ప్రతిమ ఒకప్పుడు చూస్తే ఉన్నట్టు మరొకప్పుడుండేది కాదు. ఉదయం చూస్తే ప్రతిమ కళ్లలో నిద్రమత్తు కనిపించేది. సాయంకాలం పూట చూస్తే ప్రతిమ ముఖంలో అలసట కనిపించేది. ఈ ప్రతిమ వచ్చినప్పటినుంచీ లావణ్యలో కూడా కొంత మార్పు వచ్చింది. ఆమెను ఏ వేళ చూసినా నిండు లావణ్యం తొణికిసలాడుతూండేది. ఒకరోజు ఇంతకంటె గొప్పచిత్రం జరిగింది. లావణ్య భోజనం చేస్తూండగా ఆమె చేతిలోని బంగారు చెంబు జారి కుడికాలివేళ్లమీద పడింది. అదృష్టవశాత్తూ వేళ్లు కదుము కట్టలేదు. కందనైనా లేదు. అయితే ఈ సంఘటన జరిగిన కొద్దిసేపటికి లావణ్య పరిచారిక ప్రతిమను పరీక్షిస్తుండగా ఆ ప్రతిమయొక్క కుడికాలి వేళ్లు కందినట్టూ కదుము కట్టినట్టూ కనిపించాయి. ఇటువంటి దాఖలాలవల్ల ఒక విషయం రూఢి అయింది. లావణ్యలో సహజంగా కలగవలసినమార్పులు ప్రతిమలో కలుగుతున్నాయి. ప్రతిమకు ఉండవలసిన అచలత్వం లావణ్యకు వచ్చేసింది.

కొద్ది సంవత్సరాలు గడిచాయి. లావణ్య ఎప్పటిలాగే ఇరవైఏళ్ల

స్త్రీలాగా ఉంది. కాని ప్రతిమలో వయస్సు తెలుస్తున్నది. ఈ ప్రతిమను ప్రజలు చూడటం క్షేమం కాదని తోచింది లావణ్యకు. ఆమె దానిని రహస్యంగా ఒక చీకటి గదిలో ఉంచింది.

రోజులు, నెలలు, సంవత్సరాలు పుష్కరాలు కూడా దాటాయి. లావణ్యనౌకర్లంతా మారిపోయారు. రాజ్యాలే మారాయి. లావణ్యమాత్రం ఎప్పటిలాగే ఉంది. ఆమె అనమాన సౌందర్యంగురించీ నిండు యవ్వనంగురించీ ఇప్పుడు కొత్తవాళ్లు చెప్పుకుంటున్నారు. కొత్తయువకులు ఆమెకోసం ఆత్మహత్యలు చేసుకుంటున్నారు కొత్తరాజులూ, లక్షాధికార్లూ ఆమెకు అంతులేనిధనం అర్పిస్తున్నారు. ఆమె ప్రతిమగురించి ప్రపంచం ఏనాడో మరిచిపోయింది.

లావణ్యకు చీకూ చింతా లేదు. ఆమెకిప్పుడు దాదాపు ఎనభై సంవత్సరాల వయసుంటుంది. కాని బంగారంలాంటి ఆమె శరీరచ్ఛాయా, పాలుగారే చెక్కిళ్లు నిగనిగలాడే జుట్టూ, తళతళా మెరిసే కళ్లుచూసి ఈసంగతి ఎవరూ గ్రహించలేరు. ఈరహస్యం తెలిసినది చీకటిగదిలో ప్రతిమఒక్కటే. ఎప్పుడన్నా లావణ్య ఒంటరిగా ఆగదిలోకి వెళ్లి దీపం వెలుతురులో ఆప్రతిమను చూసుకుని చీదరించుకునేది. ఆప్రతిమ శరీరమంతా ముడతలుపడిపోయింది బుగ్గలులోపలికి పీక్కుపోయి పళ్లన్నీ ఊడినట్టు స్పష్టంగా తెలుస్తున్నది. ప్రతిమకు నడుము బాగా వంగిపోయింది. జుట్టు చాలాభాగం రాలిపోయింది.



అన్నదమ్ముల ఆప్యాయత — ఫోటో: కె. కృష్ణారావు - తాడేపల్లిగూడెం.

★ సజీవ ప్రతిమ ★

ఛీ! ఎంత వికారస్వరూపం!" అనుకుని లావణ్య బయటికి వచ్చేసేది.

ఏలోటూ లేని లావణ్య జీవితంలో ఈ ప్రతిమ ఒక కళంకంగా నిలబడి వున్నది. ఒక్కొక్కసారి ఈ ప్రతిమ లావణ్యకు కలలో కూడా వచ్చేది. లావణ్య కెవ్వున అరిచి పక్కలో లేచి కూర్చునేది. ఏమహారాజో పక్కన కూర్చుని సరదాగా మాట్లాడే వేళ ఆలోతు బుగ్గలు జ్ఞాపకంవచ్చి లావణ్య గట్టిగా కళ్లు మూసేసేది. ఈ ప్రతిమ ఆమెను దయ్యంపట్టినట్టు పట్టుకుని బాధించ సాగింది.

నానాటికీ అధికమై పోతున్న ఈ బాధను లావణ్య భరించలేక పోయింది. ఆ ప్రతిమను నాశనం చేస్తేతప్ప తనకు సుఖం లేదను కున్నది. ఒకనాటి అర్థరాత్రి ఒక చేతిలో సుత్తే, రెండో చేతిలో దీపమూ తీసుకుని చీకటి కొట్టుకుపోయింది. ప్రతిమ ఎప్పటి కన్నా భయంకరంగా ఉంది. మెడ, కాళ్లూ, చేతులూ పుల్లల్లాగా ఉన్నాయి. ఆ సుత్తితో ఒక్కదెబ్బవేస్తే ప్రతిమ విరిగి ముక్కలై కిందపడేలాగా ఉంది. గుడ్లు వెళ్లుకొస్తున్నాయి. చేతివేళ్లు అష్టవంకరలు తిరిగి ఉన్నాయి. ఏదో భయంకరమైన వ్యాధితో బాధపడుతూ అవసానదశలో ఉన్నట్టుగా ఉన్నది ప్రతిమ.

"చావు ముండా!" అంటూ లావణ్య రెండుచేతులతోనూ సుత్తె ఎత్తి బలంగా ప్రతిమనెత్తిన కొట్టింది. మరుక్షణమే ఆ చీకటిగదిలోనుంచి భయంకరమైన ఆర్తనాదం వినపడింది. ఇంట్లో ఉండే దాసదాసీ జనం పరిగెత్తుకుంటూ వచ్చారు. గదిలో దృశ్యం చూశారు. ఒక పక్కగా దీపం వెలుగుతున్నది. నేలమీద ఒక శతవృద్ధురాలు చచ్చిపడి ఉన్నది. ఆమె తలపగిలి ఉన్నది. గదిలోకి వచ్చినవారి ఎట్ట ఎదుట ఒక దివ్యసుందరవిగ్రహం గల ఇరవైసంవత్సరాల స్త్రీ ప్రతిమ, జీవంతో తొణికిసలాడుతూ, మూడుమూర్తులా లావణ్యను పోలి ఉన్నది.

మర్నాడు మగథలో పుకారు పుట్టింది. లావణ్య ప్రతిమ అయి పోయిందని అందరూ చెప్పుకో సాగారు. ఆమె ప్రతిమఅయిపోయిప్పుడు ఆ ప్రతిమ కాళ్ళముందున తలపగిలి చచ్చిపడివున్న శతవృద్ధురాలెవరో ఆనవాలు పట్టినవారు లేరు.

[ఆస్కార్ వైల్డ్ కథ ఛాయలో]

పిల్లల నాటిక:

పునర్జన్మ

పాత్రలు

జయరాం : ఒకవడ్డీవ్యాపారి
నారాయణ : అతనిదూరపుబంధువు; వరసకిబావ.
మోహన్, సుందరం : జయరాం కుమారులు.
చంద్రం : వీరి స్నేహితుడు.
సుశీల : జయరాం రెండో భార్య.
ఇంకా రైతులు, పోలీసులు వగైరాలు.

(జయరాం ఇల్లు. సాయంకాలం 4 గంటల సమయం జయరాం దూరపుబంధువు నారాయణ, జయరాం రెండో భార్య సుశీల మాట్లాడుకుంటూ ఉంటారు.)

నారా : ఇవ్వాళ వైశాఖశుద్ధ చతుర్దశి. నేనంతాముందే తెలుసుకున్నాను.

సుశీ : కాని ఇలా చెయ్యడంవల్ల లాభమేమిటా అని—

నా : లాభమా! కనీసం బావ ప్రాణాలైనా దక్కుతాయి. రైతులాయన్ని సమయంచూసి చావ కొట్టాలనుకుంటున్నారు.

సు : ఇందులో ఆయన తప్పేముంది. వడ్డీకి డబ్బు యివ్వడం నేరంకాదుగా.

నా : కాదు. కాని అప్పులపేర పేదవాళ్ళ యిళ్ళువాకిళ్ళు వేలం వేయించడం, వాళ్లను నాశనం చెయ్యడం నేరమే.

సు : సరే. ఇంతకూ మీ ఉపాయం చాలా బాగుందికాని అది సరిగా నడుస్తుందా అని—

'కనకమేడల'

నా : ఓ! తప్పకుండా జరుగుతుంది. బావకి జ్యోతిషం మీద చాలా నమ్మకం. వైశాఖశుద్ధ చతుర్దశి మధ్యాహ్నం తన ఇంట్లోనే పాముకరచి చచ్చిపోతాడని చెప్పిన జ్యోతిష్కుని మాటల మీద ఆయనకు పూర్తి నమ్మకం ఉంది.

సు: ఆయనిప్పుడెక్కడున్నారు?

నా : పెద్దచెరువులో గొంతుకలోతు నీటిలో మాట్లాడకుండా చున్నాడు. నీటిమధ్య ఉంటే తన యింట్లో పామెలా కరుస్తుందని ఆయన అభిప్రాయం.

సు: ఓహో! ఐతే ఇవ్వాళ గమ్మత్తుగానే ఉంటుందన్నమాట.

నా : (నవ్వుతూ) ఊఁ. ఇంతకూ నేను చెప్పిందంతా గుర్తున్నదా!

సు: అంతా గుర్తున్నది.

నా : సరే. ఇక నువ్వు లోపలికి వెళ్లు. ఆయన వస్తూఉంటాడు.

(సుశీల వెళ్తుంది. జయరాం మొదటిభార్యకొడుకులు మోహన్, సుందరం వాళ్లమిత్రుడు చంద్రం వస్తారు.)

నా : ఓ! సమయానికొచ్చారు. మీకోసమే చూస్తున్నాను.

మో : ఇక్కడంతా రడీయేనా!

నా: ఆ! అదిగో బావ వస్తున్నాడు. చంద్రం పడుకో—మీరిద్దరూ అతని దగ్గరకూర్చుని ఏడుస్తున్నట్టు నటించండి—

(చంద్రం పడుకుంటాడు. నారాయణ అతనిమీద పూర్తిగా దుప్పటి కప్పుతాడు. మోహన్, సుందరం ఏడుపు సాగిస్తారు.)

నా: చంద్రం! నువ్వు కదలకూడదు. ఇక ఇక్కడంతా సరిగ్గానే ఉందికదూ! నేవెళ్లి తిరిగి సమయానికొస్తాను.

(నారాయణ వెళ్తాడు. జయరాం ప్రవేశిస్తాడు. కొడుకులు ఏడుస్తూంటారు.)

జయ : బ్రతికానురా బాబు! బ్రతికాను. జాతకంకూడా తప్పవుతుందన్నమాట. సరిగ్గా రెండు ఝాములికి చచ్చిపోతాననుకున్నాను. గండం గడిచిందిలే—

మో: అయ్యో! అయ్యో! నాన్నా—

★ పునర్జన్మ ★

సుం: పాము కరిచి చచ్చిపోయావా నాన్నా!

జయ: ఆ! ఎవర్రా చచ్చింది!

మో: (విననట్టు) బ్రహ్మరాతల్ని ఎవరు తప్పించగలరు.

సుం: ఐనా జనం జోస్యాన్ని నమ్మరు.

జ: చచ్చిందెవరురా అంటే?—

మో: (విననట్టు) ఇంత ఇల్లూ వాకిలీ...

సుం: రెండో పెళ్లాన్ని, మమ్మల్ని వదలి...

జయ: చచ్చిపోయిందెవరు?

మో: (చూడకుండా) అయ్యో! జయరాం సెట్టిగారు.

జయ: ఆ! జయరాం సెట్టా! ఎందుకు చచ్చాడు.

మో: ఎందుకు చచ్చాడేమిటి?

సుం: చచ్చారు - అంతే.

జయ: ఇటు చూడండి. నేను బ్రతికే ఉన్నాను.

మో: మీరెవరు?

జయ: నేనే మీ నాన్నని. కనిపించటంలా!

సుం: వాహ్‌రేవా! భలే వేషం వేశావే!

జయ: మీకు పిచ్చెక్కిందా ఏమిటి? నేను వేషమెయ్యడమేంటి?

మో: చాల్లే పోవయ్యా! నాన్న చచ్చి మేం ఏడుస్తుంటే మధ్యలో నీ హాస్యం ఏమిటి?

జయ: ఏమిటిది? మీకు నిజంగానే పిచ్చెక్కినట్టుంది. ఒకసారి నావంక చూసి మాట్లాడండి.

సుం: సరే! చూద్దాంరా అన్నయ్యా!

మో: ఆ! చూద్దాం!

సుం: భలేగా వేషం వేశాడులే.

మో: నిజంగా భలేగానే తయారయ్యావు. కాని ఈ ముక్కుమాత్రం మా నాన్న ముక్కులా లేదు.

జయ: ముక్కు అలా లేదూ? అంటే-నా ముక్కు మారిపోయిందా? (ముక్కు తడిమి చూసుకుంటాడు.)

సుం: రంగుకూడా అలానే వేసుకున్నాడు.

జయ: ఆ! రంగు వేసుకున్నానా!

సుం: పిలకూడా పెట్టుకున్నాడు. భలే - భలే.

మో: కాని ఈముక్కు...

జయ: ఊ! ముక్కు ఏమైంది?

సుం: సరిగ్గాలేదు. నువ్వు మమ్మల్ని మోసగించలేవు తెలుసా?

మో: మాటకూడా అలాగే మాట్లాడుతున్నాడు.

సుం: నకలు బాగానే ఉంది.

[ఇద్దరు రైతులు ప్రవేశిస్తారు]

మొ. రై: ఏమయ్యా! జయరాం సెట్టిగారు చచ్చిపోయారా?

మో: (విచారంగా) ఔను.

రెం. రై: ఐతే ఈయనెవరు?

సుం: ఈయన నకలు మనిషి. మా నాన్నలా వేషం వేసుకొచ్చాడు మమ్మల్ని మోసం చెయ్యడానికి.

మొ. రై: ఆ! మోసం చెయ్యడానికొచ్చావా నాయనా!

జయ: మీదే మోసం! పొండి నా యింట్లోంచి.

రెం. రై: నువ్వేపో యిక్కడినుంచి.

జయ: ఇది నాయిల్లు.

మొ. రై: ఇది మీ యిల్లా. ఇక్కడ మీ పప్పులేం ఉడకవు. వేషం వేసుకొచ్చి అప్పులకింద మాదగ్గర డబ్బు లాగాలని చూస్తున్నావేమో! దమ్మిడీకూడా యివ్వం.

జయ: ఇవ్వరు! ఇవ్వకెక్కడికిపోతారు? కోర్టులో ఫిర్యాదు చేస్తే మాచక్కగా అణా పైసల్తో యిస్తారు.

మో: సుందరం! ఎంతసేపని చూస్తాం. బంధువులెవరూ రాలేదు. శవాన్ని స్మశానానికి తీసకెళ్దాం పద!

సుం: ఊం. ఎత్తుకోమరి.

(శవాన్ని ఎత్తుకుంటారు.)

రైతులు: నారాయణ! నా రా య ణ!!

(మో॥, సుం॥, వెళ్తారు.)

జయ: (అనుమానంగా) వీళు స్మశానానికెవరిశవం తీసుకువెళ్తున్నారిప్పుడు

మొ. రై: శ్రీమాన్ జయరాందాసుసెట్టి గారిది.

జయ: ఐతే నేనెవరిని?

రెం. రై: నువ్వా? మోసగాడవు.

జయ: ఆ! ఎవరు మోసకారి? మీరంతా మోసగాళ్లు. నాడబ్బు ఎగెయ్యాలని చూస్తున్నారు.

మొ. రై: మాటలుచూస్తే కోటలు దాటుతున్నాయే?

జయ: ముందు మీరు నా యింటిదగ్గర నుంచి పొండి.

రెం. రై: ఏమిటోమహా పేలుతున్నాడు వీడి సంగతేమిటో చూద్దాంపట్టు.

మొ. రై: ఇంకా వాగితే బడితపూజ తప్పదు.

జయ: చాల్లే పొండయ్యా!

రైతులు: ఆ!

(ఇద్దరూ అతన్ని తన్నబోతారు. జయరాం 'అమ్మో అమ్మో' అని అరుస్తుండగా నారాయణ ప్రవేశిస్తాడు.)

నారా: ఏమిటిది. ఇక్కడ ఈ గందరగోళం గలాభా ఏమిటి?

జయ: వచ్చావా నారాయణా! వీళ్ళు చూడు.

నారా: అసలు సంగతేమిటి?

జయ: వీళ్లు చూడు—

రై: ఇక నువ్వు ముయ్యవయ్యా!

నారా: అసలు సంగతేమిటి చెప్పండి.

మొ. రై: అయ్యా! జయరాందాసుసెట్టి గారు చచ్చిపోయారు.

రెం. రై: అమాటే విని నేనుకూడా వచ్చాను.

నారా: మరి ఈయనెవరు?

జయ: నేనే జయరాంని

నారా: నువ్వారు.

మొ. రై: ఈయనెవరో సెట్టిగారివేషం వేసుకొచ్చాడండి.

జయరాం: నేను......

రెం. రై: నువ్వు అనవసరంగా మాట్లాడబోకయ్యా!

నారా: ఓష్! ఇంతేగదా! మీరంతా గందరగోళం చేస్తారెందుకు? నేనంతా సర్ది చెప్పేస్తాను.

మొ రై: చెప్పండి వింటాం—

నారా: జయరాంగారు చనిపోయారా?

రెం. రై: ఔనండీ—

నారా: నేనుమాత్రం వినలేదే ఆ సంగతింకా—

జయ: చూడు నారాయణా వీళ్ళు—

మొ. రై: నువ్వాపవయ్యా!

నారా: సరే. ఇంతకూ మీరు సెట్టిగారు మరణించారంటారు. ఆ విషయం మీకు రూఢిగా తెలుసా.

రెం. రై: తెలుసండి. మీరు వచ్చే ముందే వారి పిల్లలాయన శవాన్ని శ్మశానానికి తీసుకువెళ్ళారు.

నారా: ఎలా చనిపోయారు?

మొ. రై: పాము కరచి—

నారా: ఎప్పుడు?

రెం రై: సరిగ్గా రెండు ఝాములికి.

నారా: నమ్మటానికి వీల్లేదు. మీరిద్దరూ? ఈయన్ని మోసగించాలని చూస్తున్నట్టున్నారు.

మొ. రై: అదేమిటండి! మీరు నమ్మ

త్తుగా మాట్లాడుతున్నారే. ఈ సంగతి ఆయనగారి జన్మపత్రికలో కూడా రాసి ఉంది చూడండి కావాలంటే—

నారా : ఇంట్లోంచి తెప్పించండి జన్మపత్రిక - చూద్దాం.

(ఒక రైతు ఇంట్లోకి వెళ్తాడు)

జయ : నిజమే! నా జన్మపత్రికలో అలాగే రాసిఉంది.

నారా: ఐతే ఇంకా అనుమానమెందుకూ?

జయ : నా జన్మపత్రికలో ఉంది కాని నేను చావలేదు.

నారా : అలా జరగడానికి వీల్లేదు. ఐతే నువ్వు అబద్ధమాడుతున్నా వన్నమాట.

జయ : కాదు నిజమే!

నారా : ఏదీ పత్రిక చూస్తాగా.

(రైతు జన్మపత్రికతో తిరిగివస్తాడు.)

మొ. రై : ఇదిగో చూడండి. ఇక్కడ స్పష్టంగా రాసిఉంది.

నారా : (చదివి) ఔను. నిజమే రాసే ఉంది.

జయ: నేనే చెప్పాగా రాసేఉందని—

నారా : ఐతే నువ్వు జయరాంవి కాద న్నమాట దీనిప్రకారం జయరాం ఈపాటికి స్వర్గాన ఉండిఉండాలి.

జయ : కాదు. నే నిక్కడే ఉన్నాను.

నారా : అదెలా దీనిలో రాసి ఉన్నదీ-నువ్వు చెప్పేదీ వ్యతిరేకంగా ఉన్నాయి. ఇందులో ఏదో ఒకట్టే నిజం.

(మోహన్ ప్రవేశిస్తాడు చేతిలో ఒక కాగితంతో)

నారా : మోహన్! అసలు సంగతేమిటి?

మో : ఏముంది! మా నాన్నగారు చని పోయారు.

నారా : ఆ! నిజమేనా!

రెం. రై : మేం చెబితే నమ్మారు కాదు మరి.

నారా : మరి ఈ మనిషెవరు?

మో : ఏమో నాకు తెలియదు. సరిగ్గా మా నాన్నలాగే వేషం వేసుకున్నాడు.

నారా : ఐతే ఇతను మోసకారి అన్న మాట.

జయ : కాదు. కాదు. నేను నిజంగా జయరాంనే. వీడు నాకొడుకైఉండికూడా నన్ను గుర్తుపట్టడంలేదు.

మొ. రై : అబద్ధం. వీడు మోసకారి.

రెం. రై : ఔను. మోసకారి.

జయ : కాదు. కాదు. నేను నిజంగా జయరాంనే. అనుమానంగా ఉంటే మరెవ రన్నా నన్నెరిగినవాళ్లనిపిల్చి కనుక్కోండి.

మోహన్ : అక్కర్లేదు. ఇదిగో మా నాన్నగారు చనిపోయినట్టు డాక్టరిచ్చిన సర్టిఫికేటు.

జయరాం : ఆ!

నారా: (తీసుకు బిగ్గరగా చదువుతాడు.)

I here by certify that Jayaram is dead today due to snake bite.

Dr. Ramachndra Rao

జయ : మోసం మోసం. ఇదంతా మోసం. నేనింకా బ్రతికే ఉన్నాను.

★ పునర్జన్మ ★

నారా : ఏయ్ ఇక నువ్వు నోరు కట్టేసుకోవాలి. ఈ సర్టిఫికేట్టుకిక ఎదురు లేదు. నువ్వు మోసగాడివిలా ఉన్నావు.

జయ : కాదు కాదు.

నారా : కాదేమిటి కనిపిస్తుంటేను. నీమీద కేసు పెడతాను జాగ్రత్త. నిజం చెప్తే వదిలేస్తాం.

జయ : నేను చెప్పింది నిజమే.

నారా : నీకు వ్యతిరేకంగా రెండు సాక్ష్యాలున్నాయి. ఒకటి జన్మపత్రం. రెండోది డాక్టరు సర్టిఫికేటు.

మొ. రై : మీరు కేసు పెడితే జయరాం గారిశవాన్ని స్మశానానికి తీసికెళ్తుండగా చూసినట్టు మేం సాక్ష్యంకూడా ఇస్తాం.

నారా : నిజమే వీళ్ళదొక ముఖ్యమైన సాక్ష్యం. లాభంలేదు. ఇప్పుడైనా నిజం చెప్పు.

జయ : నేను చెబుతూనే ఉన్నాను నేనే జయరాంనని.

నారా : ఆ విషయాన్ని మీరు కోర్టులో నిరూపించుకోవాల్సి ఉంటుంది. మరి సాక్షులున్నారా?

జయ : సాక్షులెందుకు నేనే జయరాం నైతే.

నారా : మరి వీళ్లంతా కాదంటున్నారు.

జయ : ఆ! ఏదో ఊరికే నాటక మాడుతున్నారు.

రెం. రై : నాటకమా ! అదేం కాదయ్యోయ్. నువ్వా నాటకమాడేది

నారా : ఇదిగో - ఏం దేదో ఐపోయింది కాని - నీమీద కేసు పెడితే నీకు పెద్ద శిక్ష పడుతుంది. నామాట విని నిజం చెప్తే వదిలేస్తాం.

జయ : అయ్యో దేవుడా! నేను నిజమే చెబుతున్నానంటే ఎవ్వరూ నమ్మరేంకర్మ!

నారా : ఎలా నమ్మతామయ్యా. ఇవతల ఇన్ని విషయాలు నీకు వ్యతిరేకంగా కనిపిస్తుంటేను.

(ఇంతలో జయరాంబావ మరిది వేషంలో చంద్రం ప్రవేశిస్తాడు)

జయ : ఓహో బావమరిదిగారా ! ఇప్పుడిటుదయచేశారేం ఎన్నడూమాతో మాట్లాడనవ్నా మాట్లాడేవారు కాదు.

చం : (ఆశ్చర్యంగా) ఆ! ఎవరు నువ్వు?

జయ: నేనా! ఎవరో తెలియడంలా - నీకూ మతిపోయిం దేమిటి?

చం: నాకేం మతిపోలేదు.

జయ: మరి నే నెవరినంటావే - నీ బావనేగా.

జయ : నా బావనా - ఏమయ్యోయ్ ! నోటికి మాటలు సరిగ్గారానీ.

జయ: అదేమిటీ?

చం : అదేమిటంటా వేమిటి. మాబావ మధ్యాహ్నమే చచ్చిపోయాడు.

జయ: ఆ! నీకూ ఇదే పిచ్చా-

చం: పిచ్చి కాదు, నిజం. ఇదిగో చూడు ఈ పేపరు. ఇప్పుడే అచ్చయి వచ్చింది.

నారా: ఏముందందులో.

చం : అందులో మాబావ చచ్చిపోయినట్టు రాసిఉంది. అది చూసే నేను మా చెల్లెల్ని ఓదార్చి తీసుకెళ్దామని వచ్చాను.

జయ: ఆ! నేను బ్రతికుండగా ఎక్కడికి తీసుకెళ్తావు.

చం: చాల్చాల్లేవయ్యా ! ఏమండీ - మీరెవరో! తెలిసినవాళ్లులా ఉన్నారు. మీరిది చదవండి.

(నారాయణ పేపరు తీసుకుని చదువుతాడు.)

నారా: 'వడ్డీవ్యాపారంలో పేరుగాంచిన శ్రీ జయరాం సెట్టిగారు నేటి మధ్యాహ్నం స్వగృహంలో పాముకరచి మరణించినట్టు మా కార్యాలయానికి వార్త చేరింది.'

జయ : ఆ! ఈ విషయం నిజంగానే పేపర్లో ఎక్కిందా.

చం : నిజం పేపర్లో ఎక్కక ఏమౌతుంది?

నారా: సరే. మీరు వాదులాడుకోకండి.

చం: మరి చూడండీయన -

నారా: ఇంతకూ మీరేం పనిమీద వచ్చారిక్కడికి.

చం: మా చెల్లెల్ని సామాను వగైరాల్తో సహా తీసుకువెళ్ళడానికి.

జయ: ఎక్కడికి?

చం: మా యింటికే.

జయ: పోనిలే నాకు నెలరోజులు తిండి ఖర్చన్నా తప్పుతుంది.

చం: నువ్వెవరవయ్యా నీకు తప్పడానికి.

నారా: ఊష్. ఆగండి. నేను చెబుతాను.

చం: చెప్పండి మీరే.

నారా : ఇదుగో. ఈయనేమో నేనే జయరాం నంటున్నాడు. మీరంతా కాదంటారు. ఈ విషయం తేలేవరకూ మీరేమీ చేయకండి. వెళ్ళి కాసేపాగిరండి. అప్పటికీ విషయం తేలుతుంది. తర్వాత మీ యిష్టానుసారం చేద్దురుగాని

మొ: పోనీలే. మీరు చెప్పినట్టు మీరు కాస్త ఆగిరండి. ఇంతలో ముం చు వు

పోయిం దేముంది?

మొ. రై : నిజమే లెండి. అలాగే చెయ్యండి.

రెం. రై : నిజమే.

చం : సరే అలాగే. మీరంతా అలా అంటే నేను కాదంటానా?

(వెళిపోతాడు.)

జయ: అలా దారికిరండి.

నారా: ఏ. ఇప్పుడేం కాలేదు. ఇప్పటికైనా నువ్వు నిజం చెబుతావో లేక కోర్టు కెక్కించమంటావో చెప్పు.

జయ: నేను జయరాం నే—

నారా: అలా అంటే కాదు.

జయ: మరి?

నారా: అందుకు సాక్ష్యం కావాలి.

జయ: ఎవరిసాక్ష్యం కావాలి.

నారా: ఎవరైనా సరే.

జయ: ఐతే నా భార్యను పిలుస్తాను.

నారా: పిలువ్. మంచిదేగా. ఆమె నువ్వే తన భర్తఅని అంగీకరిస్తే చాలు.

జయ: సరే.

(తలుపుదగ్గర వెళ్ళి-) ఇదిగో. ఒసేవ్. ఒకసారి ఇటురావే - (లోనుంచి జవాబు రాదు. తిరిగి) సిగ్గుపడితే లాభం లేదు. ఇప్పుడు నా ధన మాన ప్రాణాలు పోయేట్టున్నాయి. బయటికిరావే—

మొ: ఆవిడ మొగుడు చచ్చి ఏడుస్తుంటే రంకు మొగుడల్లే కేకలెడతా వేమయ్యా—

మొ. రై: నిజమే - నిజంగా మొగుడులాగే కేక లెడుతున్నాడే—

నారా: పిలవనివ్వండి మన కెందుకు. ఇప్పుడా విషయంకూడా తేలిపోతే బాధలేదు.

రెం. రై: సరే.

నారా: పిలవ్వయ్యా మరి.

జయ: దానికి సిగ్గండీ. మరి బయటికి రాదు.

నారా: రాకపోతే ఎలా మరి. వీళ్లందరి ముందు ఆమెతో నువ్వు ఆమె భర్తవని ఒప్పించాలి.

జయ: సరే. తప్పుతుందా మరి ఇలావస్తే- (బిగ్గరగా) ఒసేవ్. వస్తావా రావే నువ్వు బయటికి—

(సుశీల ప్రవేశం ఏడుస్తూ)

సు: అయ్యో నా దేవుడా - దేవుడో దేవుడా—

జయ: ఎందుకే ఏడుస్తున్నావ్ - ఎవరు చచ్చారని—

మొ: చెప్పడంలా - మొగుడు చచ్చాడని.

జయ: కాదు కాదు. నేను కనిపించ లేదని ఆడేదుస్తున్న దంతే - ఇదిగో - ఒసేవ్ - ఇటుచూడు.

సు: (జయరాంవంక చూసి) ఎవరునువ్వు?

జయ: ఆ! కళ్లు కనిపించడంలా నీకు! నే నెవరినా - ఒళ్ళు పొగరెక్కిందా నీకు.

మో: ఏమయ్యోవ్! ఎంతయితే మాత్రం నోటికొచ్చినట్టు పేలకు—

రెం. రై: ఆటే వాగితే ఒళ్ళు చితుకుతుంది జాగ్రత్త.

జయ: అయ్యొ రామా! నా పెళ్ళాన్ని కూడా నేను తిట్టుకోకూడదా?

మో: ఎవరు నీ పెళ్ళాం?

జయ: అదే!

నారా: అనిపించు ఆమెతో ఆమాట.

జయ: ఏమే - పలకవేం మొద్దులా నుంచున్నావ్?

సు: నువ్వెరవో నాకు తెలియదు.

జయ: తెలియదూ! (కోపంగా) చూస్తా—

సు: నిజంగానే తెలియదు. మా ఆయన మధ్యాహ్నమే చనిపోయారు.

జయ: ఆ! నీకూ పట్టిందీ ఈ పిచ్చి.

సు: పిచ్చికాదు. నిజం. అందుకే ఏడుస్తున్నాను.

(ఏడవడం సాగిస్తుంది)

జయ: ఏడవకే - నువ్వేడిస్తే నాకూ ఏడుపొస్తోంది.

సు: (ఇంకా బిగ్గరగా ఏడుస్తూ) అయ్యో! నన్నొక్కదాన్నే వదలి మీరు వెళ్ళిపోయారా - ఇక నాకెవరు దిక్కు -

జయ: ఆ! నేనున్నానుగదుటే—

సు: నువ్వెవరవో నాకు తెలియదు.

జయ: పరిహాసానిక్కూడా అంతుండాలి. అవతల వీళ్లు నా ప్రాణాలమీద కూర్చున్నారు.

సు: పరిహాసాలేమిటి-మా ఆయన పోయి నే నేడుస్తుంటే మీ పరిహాసాలేమిటి మధ్య-లొండి పొండి.

మొ. రై: పోవయ్యా పోయిక చాలు గాని.

జయ: ఆగండి నిజం చెప్పేస్తాను.

నారా: ఇందాకటినించీ చెప్పించావు గాలు.

జయ: అదేదో సరసా లాడుతోందంటే.

నారా: సరసాలూ లేవు విరసాలూ లేవు.

జయ: మరి.

నారా: నేను కనుక్కుంటా నాను.

జయ: ఆ! నిజం నువ్వే కనుక్కో-చెబుతుంది.

నారా: ఏమమ్మా - ఈయన నీ భర్తగాదా.

సుశీ: నా భర్తలాగే ఉన్నాడు కాని నా భర్త కాదండి.

నారా: మరి.

సుశీ: నా భర్త మధ్యాహ్నం చనిపోయారండి.

నారా: నిజమేనా.

సుశీ: నిజమేనండి.

నారా: నువ్వు చూశావా?

సుశీ: చూశానండి.

నారా: ఎట్లా చనిపోయారు?

సుశీ: పాముకరచి చనిపోయారండి.

నారా: పామును నువ్వు చూశావా.

సుశీ: చూడలేదండి.

నారా: మరి పాముకరచిందని నీ కెలా తెలుసు?

సుశీ: చనిపోయేముందు ఆయనే అన్నారండి. పైగా ఆయనగారి జాతకపత్రంలో కూడా రాసిఉందండి.

నారా: సరే. ఇక నువ్వు లోపలికి వెళ్లు.

(సుశీల వెళ్ళిపోతుంది)

నారా: మరి నువ్వేమంటావయ్యా! ఆమె తనభర్త చనిపోయారని చెబుతోంది. నువ్వెవరవో ఆమె ఎరగదట.

జయ: ఇదేంపాపం! నా పెళ్ళాం నన్నే ఎరగదూ.

నారా: ఇకచాల్లే నీ ప్రసంగం. కట్టిపెట్టు.

జయ: అదికాదయ్యా.

నారా: ఏది కాదు! అన్నీ ఔను. (మోహన్‌వంక తిరిగి) మోహన్! ఇక మీ ఆస్తిపాస్తుల సంగతి మీ బంధువుని కనక నేనే చూడాలి.

మో: ఔను. మీరే చూడాలి.

జయ: అదేమిటిరా! వాడు ఫ్లీడరుకూడా. మన ఆస్తిఅంతా వాడే కాజేస్తాడు అమాటా ఈమాటా చెప్పి.

నారా: నోటికి సరిగ్గారానీ - ఎందుకని ఊరుకుంటున్నా జాగ్రత్త.

జయ: సరే. నీయిష్టం ఏదట్లా పోతే నాకేం - చివరికంతా వీళ్ళదేగా. పోయేదాన్ని నేను పట్టుకుంటే ఆగుతుందా!

నారా: (రైతులతో) ఇక మీరు వెళ్ళవచ్చు, మీ రివ్వాల్సిన డబ్బు వడ్డీలేకుండా తెచ్చి రేపే వీళ్ళకి కట్టండి.

జయ: అదేమిటి - అమ్మో - అసలుకంటే వడ్డీయే ఎక్కువ. వడ్డీ వదిలితే ఎలా.

మొ. రై: నీకెందుకు ఊరుకోవయ్యా.

నారా: సరే మీరు వెళ్ళరండి.

రైతులు: చిత్తం. డబ్బు రేపు తెస్తామండి.

(రైతులు వెళ్ళిపోతారు.)

జయ: (ముక్కుమీద వేలేసుకుని) అమ్మయ్యో - ఎంతవడ్డీ! ఊరికే పోతోంది.

మో: ఐతేనీకేం. వాళఆస్తి - మాయిష్టం.

జయ: నేనుండగా మీదెలా ఔతుంది. పైగా అంతా నా స్వార్జితం - దానిమీద మీ కేం హక్కు లేదు.

మో: చాల్చాల్లే.

జయ: కాదుకాదు. ఏమైనాసరే వడ్డీ వదలడానికి వీల్లేదు.

నారా: ఆటేచూస్తే నువ్వు మమ్మల్లే దబాయించేట్టున్నావే - నిజంచెప్పి వెళ్ళిపోతావా లేక పోలీసుల్ని పిలవమన్నావా -

జయ: పిల్చుకో - ఏంచేస్తారో చూస్తా.

నారా: మోహన్! వెళ్ళి సబిన్స్పెక్టర్ని పిల్చుకురా వీడిపని పడదాం.

జయ: ఆ! సబిన్స్పెక్టరా. ఎందుకు!

నారా: నీసంగతి తేల్చుకోడానికి.

జయ: తేల్చుకు నేదేముంది. నేను జయరాంని -

నారా: అదే తేలుద్దామని -

జయ: మోసంచేసి నువ్వు నా ఆస్తంతా కాజేయ తల్చినట్టున్నావే? మోసం! మోసం!!

నారా: మోహన్! నువ్వువెళ్లి పోలీసుల్ని పిలువ్!

(మోహన్ వెళ్లిపోతాడు.)

జయ: ఇప్పుడింతకూ నేను బచ్చినట్టూ లేదు. చావనట్టూ లేదు. ఇదంతా నా ప్రాణం మీదికొచ్చింది.

(నారాయణ సిగరెట్టు నోట్లో ఉంచుకుని అగ్గిపెట్టెకోసం ఆజేబు ఈజేబు తడుముకుంటాడు. ఉండదు.)

నారా: సమయానికి దొరికి చావదు వెధవది.

జయ: ఏమిటీ—

నారా: నిప్పెట్టె. ఉందా!

జయ: లేదు. కాని నువ్వు మా చుట్టానివేగా. ఇంట్లో కొల్చుకు రారాదూ.

నారా: ఔ నౌను. మంచిమాట చెప్పావు.

(నారాయణ ఇంట్లోకి వెళ్తాడు.)

జయ: పోలీసు లొచ్చి నన్ను తంతారేమో! పారిపోతే బాగుండునల్లేఉంది. కాదు. కాదు. ఆచాటున దాక్కుని ఏంజరిగేదీ చూస్తా - అదిగో మా పొలచుట్టాలెవరో యిద్దరు వస్తున్నట్టున్నారు.

(జయరాం చాటుగా దాక్కుంటాడు. జయరాం దూరపుబంధువుల వేషంలో వెనకటి రైతులిద్దరూ ప్రవేశిస్తారు.)

మొ, బం: ఇక్కడెవరూ లేరు.

రెం. బం: కొడుకు లెక్కడికిపోయారో.

మొ. బం: చచ్చాడుకదూ. పీడ వదిలిందనుకుని సినిమా కెళ్లారేమో—

రెం. బం: ఏమో—

మొ. బం: పీడ కూడవదిలిందంతో కొడుకులు తగలేస్తారులే యిక.

రెం. బం: లేకపోతే. కడుపు కట్టుకుని సంపాదించాడు. చచ్చేప్పుడు తీసికెళ్లాడా లేకపోయె.

మొ. బం: అలాగే అనుకుని ఉంటాడు.

(55-వ పేజీ చూడండి)



యునైటెడ్ టెక్నీషియన్స్ ఎండ్ ఆర్టిస్టుల వారి "ప్రియురాలు"లో జమీందారిణిగా ఎస్. వరలక్ష్మి.



భరణీవారి "చక్రపాణి"లో ఛాయాదేవి, భానుమతి, నాగేశ్వరరావు.

★

గోకుల్ వారి "నిరుపేదలు"లో రామకోటి, శేషగిరిరావు, రమణారెడ్డి, సాలార్.



అదీ-ఇదీ

సుమారు 50 ఏళ్ల కిందట, అంటే సినిమాలు ఇంకా ప్రారంభ దశలో ఉండే రోజుల్లో, సినిమాలను సాహిత్యం, నాటకం మొదలైన కళలస్థాయికి తీసుకుపోయి వాటికొక గౌరవస్థానం కలిగించడానికి కొందరు మేధావులు ప్రయత్నించారు. వీరి ప్రయత్నాల ఫలితంగా, సినిమాలు కేవలం వార్తాచిత్రాలుగా, బఫూనరీగా కాకుండా కళగా పెంపొందాయి. గడచిన 50 ఏళ్లలోను అనేక ఉత్తమ కళాఖండాలు వచ్చాయి. అవి అప్పటికీ యిప్పటికీ సినిమా అభిమానులకు గౌరవార్హమైనవిగా, ఆదర్శప్రాయంగా ఉంటూనే వున్నాయి.

ఇప్పుడు మళ్ళీ సినిమాలను కళ అనే పీఠంనుండి లాగివేసి, కేవలం వ్యాపారపు సరుకులుగా చెలామణీచేయడానికి కొందరు నిర్మాతలే ప్రయత్నిస్తూవుండడం ఎంతో ఆశ్చర్యం కలిగిస్తోంది. సినిమాలు కేవలం వినోదంకోసమే పుట్టాయనీ, అంతకంటె వాటినుండి మరేమీ ఆశించవద్దనీ, నిర్మాతలు ప్రజలకు ఉపదేశాలు చేయగల అర్హత కలవారు కారనీ కొందరు వాదిస్తున్నారు. వీరి వాదనవల్ల సినిమాలు వినోదమే పరమార్థంగాగల సర్కసు, గారడీ మొదలైన వాటి జాబితాలో చేర్చబడాలనే విషయం వెల్లడి అవుతోంది. కాని గడిచిన యాభై ఏళ్లలో అనేక పరిణామాలతో అనేక విధాలుగా అభివృద్ధి చెందిన సినిమాలు తిరిగి సర్కసు, గారడీ స్థాయికి దిగజారడం అసంభవమనే విషయం వీరు గుర్తించడం లేదు. చిత్రానికి ఒక కథ అంటూ ఎన్నుకున్న తరవాత అందులో ఎవరు ఒద్దన్నా మానవులు, వారి కష్టసుఖాలు, మంచి చెడ్డలు ప్రతిఫలింపక తప్పదు. చిత్రానికి ఒక కథ ఉన్నతరవాత నిర్మాత యిష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే దానికి మానవజీవితాన్ని అత్యల్పంగానైనా సరే తీర్చిదిద్ది శాసించే అధికారం కలుగుతున్నది. చిత్రం చూసే ప్రజలు తమ యిష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండానే, దాని ప్రభావానికి లోనవుతారు. ఇందువల్లనే చిత్రంయొక్క ప్రభావం అవినీతియుతమైనదిగా, అవాంఛనీయమైనదిగా ఉండకుండా చూసే సాంఘికబాధ్యత నిర్మాత నెత్తిపైన ఉన్నది.

ప్రజాస్వామ్య దేశాలలోని అన్నిరకాల కళాకారులు ఈ సాంఘిక బాధ్యతనుండి తప్పుకోడానికే ఎప్పుడూ ప్రయత్నిస్తూ ఉన్నట్లు తోస్తుంది. సినిమాలే కాకుండా సాహిత్యంకూడా వినోదసాధనంగా పరిగణింపబడుతున్నది. ఇలా పరిగణింపబడినంత మాత్రాన సినిమాలకుగాని, సాహిత్యానికిగాని వాటి సాంఘికప్రభావం నశించదు. అమెరికాలో నేరాలకు సంబంధించిన సాహిత్యం విరివిగా ఉత్పత్తి అవుతుంది. ఈ సాహిత్యాన్ని అక్షరాలు చదవడం నేర్చినప్పటినుంచీ శ్రద్ధగా చదివే ప్రజానీకం ఎలాగ తయారవుతుందో చెప్పనక్కరలేదు. అమెరికాలో నేరాల సంఖ్య ఎక్కువౌతూండడానికి ఈ రకమైన సాహిత్యం, అదేరకమైన సినిమాలు చాలవరకు కారణమని అనేకసార్లు అనేకమంది

ఎన్నార్—

అభిజ్ఞులు నిర్ణయించారు. అందుచేత సినిమాలు అపాయరహితమైన వినోదసాధనాలని ఎవ రెన్నివిధాల నమ్మించ చూసినా అది సత్యదూర మవుతుంది.

సినిమా నిర్మాణం ఒక వ్యక్తి స్వీయానందంకోసం జరిగేపనికాదు. చిత్రం తయారుకాగానే అది సంఘంమీదకు విసరబడుతుంది. అందులో మంచిఉన్నా, చెడ్డవున్నా దాని ప్రభావం విధిగా సామాజికులపై ఉంటుంది. కనుక చిత్రం నిర్మించినవాడు సంఘక్షేమానికి తప్పనిసరిగా బాధ్యుడౌతాడు.

"చిత్రంలోని మంచి చెడ్డలను ప్రజలు నిర్ణయించుకోగలరు. ప్రభుత్వానికిగాని, సంఘపెద్దలకుగాని, విమర్శకులకుగాని అలా నిర్ణయించే అధికారం లేదు" అని కొందరు వాదిస్తారు. ఈ వాదన వెనకవున్న అంతరార్థం గ్రహించడం అట్టే కష్టంకాదు. "ప్రజలకి స్వాతంత్ర్యం కావలసివస్తే వాళ్లే అడిగి తీసుకుంటారు. మధ్యలో అలజడిచేయడానికి ఈ నాయకు లెవరు?" అని కొన్ని దేశాలు వలసదేశాలను ఈనాటికీ తమ అధీనంలో ఉంచుకుంటున్నాయి.

"ప్రజలు తమ మంచి చెడ్డలు నిర్ణయించుకొనే మానసికశక్తి కలవారనీ, ఎన్నికలలో తమకు మేలుచేకూర్చేవా రెవరో ప్రజలు ముందే తెల్సుకుని వారికే ఓటు చేస్తారనీ ప్రజాస్వామ్యం విశ్వసిస్తుంది. ఇది కేవలం అపసిద్ధాంతం" అని ఏనాడో బెర్నార్డుషా 'ప్రజాస్వామ్యాన్ని' విమర్శించాడు.

"సినిమాలలో ఉత్తమకళ, నీతిప్రచారం ఉండాలని వాదించేవారు సినిమాలపై వినోదపుపన్ను విధించడాన్ని ఎందుకు ఖండించరు?" అని ఒక ప్రముఖనిర్మాతప్రశ్న. ఈ ప్రశ్నకు సమాధానంగా "సినిమాలు కేవలం వినోదసాధనాలేనని వాదించే మీరు వినోదపుపన్నును ఎందుకు ఖండిస్తున్నారు?"అని ఎదురుప్రశ్న వేయవచ్చు.

కళకూ, వినోదానికీ విరోధం ఉందని ఎవరంటున్నారు? కళ అంటే తలనెప్పి పుట్టించేదేనని ఎవరన్నారు?

* * *

చవకలో చిత్రాలు తీయాలనీ, వృధాగా కాలం వ్యయం చేయక సాధ్యమైనంత త్వరలో చిత్రనిర్మాణం ముగించుకోవాలని ఈ సినిమా శీర్షికలో లోగడ చాలాసార్లు చేయబడిన సూచనలు ఫలవంతం అవుతున్నందుకు సంతోషమవుతోంది.

గోకుల్ పిక్చర్స్‌వారి "నిరుపేదలు", నేషనల్ ఆర్ట్ వారి "తోడుదొంగలు," భరణీవారి "చక్రపాణి" ఇంకా మరికొన్ని చిత్రాలు అనతికాలంలో తయారయ్యాయి. తక్కువ వ్యయంతో నిర్మించిన చిత్రాలు ఒక మోస్తరుగావున్నా, సాధారణంగా తమ డబ్బు తాము రాబట్టుకో గలవడానికి గత సంవత్సరంలో కొన్ని ఉదాహరణలున్నాయి. పెద్దతారలు అవసరంలేకుండానే, పెద్ద హంగామా చేయకుండానే, కథాబలంతో చిత్రాన్ని విజయవంతం చేయవచ్చునని కూడా కొన్ని ఉదాహరణలున్నాయి. ఈ ఉదాహరణలను అనుసరించి ముందు ముందు తెలుగు నిర్మాతలు వ్యాపారంలో నష్టం పొందకుండానే ఎక్కువ చిత్రాలు, మంచి చిత్రాలు తీయవచ్చును. ముఖ్యంగా చేతులో స్టూడియోలు కల నిర్మాతలు ఏడాదికి కనీసం మూడు చిత్రాలు తయారుచేయవచ్చును. అనవసర సన్నివేశాలతో కథలోని పట్టు చెడగొట్టకుండా, చిత్రాల నిడివి పది పన్నెండు వేల అడుగులకు తగ్గించితే ఇంకా ఎక్కువ చిత్రాలే తీయవచ్చు. పాశ్చాత్య దేశాల్లో మాదిరి 'ఫస్టుఫీచరు' చిత్రంగా కొంచెం పెద్ద చిత్రం, 'సెకండ్ ఫీచర్' చిత్రంగా కొంచెం చిన్న చిత్రం కూడా ఒకేసారి తయారుచేసి విడుదలచేస్తే రెండు, రెండున్నర గంటలసేపు ప్రేక్షకులకు రెండు చిత్రాలు చూపించినట్టు అవుతుంది. ఈ పద్ధతి చవకలో, త్వరలో చిత్రం [illegible] వస్తే లాభసాటి అవుతుంది. స్టూడి



విశాలాంధ్రలో
మార్చి 2 వ.తేదీ
విడుదల!
గోకుల్ పిక్చర్సు
నిరుపేదలు
GOKUL PICTURES
దర్శకుడు: టి.ప్రకాశరావు.

★ అదీ - ఇదీ ★

రూలు చేతులోవున్న నిర్మాతలు తెలుచుకుంటే, ఎక్స్పెరిమెంట్ చేసి మార్గదర్శకులు కావాలనే కుతూహలమేవుంటే ఇది కష్టమేమీ కాదు. * * *

ఈస్టిండియావారి "పక్కయింటి అమ్మాయి" చూశాక, హాస్యచిత్రాలరంగంలో మన నిర్మాతలు ఎంతైనా సాధించవచ్చుననిపిస్తోంది. బెంగాలీమాతృకను అనుసరించి తీయబడిన ఈచిత్రంలో ఎన్నిలోపాలుఉన్నా, కథలో సహజంగాఉన్న బలంవల్ల ఇది జనాదరణ పొందింది. కొన్నిచోట్ల పచ్చిహాస్యం, వెకిలితనం, నవ్వు పుట్టించేబదులు విసుగుపుట్టించే సన్నివేశాలుఉన్నప్పటికీ, నిజంగా హాస్యం

ఉట్టిపడే సన్నివేశాలు చాలా వున్నాయి. ఇందులో కథానాయకుడు మామూలు సినిమా హీరోలకు విరుద్ధమైనపాత్ర కలవాడు. వట్టి వెర్రిబాగులవాడు; స్నేహితుల మద్దతులేనిదే ఏపనీ స్వతంత్రించి చేయలేనివాడు; గార్దభ స్వరం కలవాడు. వాడికి ప్రత్యర్థిగా, పాడ గలిగినవాడు, కవిత్వం మాట్లాడగలిగినవాడు ఉంటాడు. వీరిద్దరూ నాయికను ప్రేమించడంతో రసవత్ ఘట్టాలు ఏర్పడతాయి. ముఖ్యంగా ప్లేబాక్ ద్వారా సుబ్బారాయుడు, ప్రేమ్‌కుమార్ సంగీతపు పోటీ జరపడం రసవంతంగా నడిచింది. ముద్దుకృష్ణ గారి సంభాషణలు, రేలంగి నటన ఈ చిత్రానికి చాలా పుష్టి ఇచ్చాయి. ★

సినిమా వార్తలు

గోకుల్ పిక్చర్సువారి "నిరుపేదలు" మార్చి 2 వ తేదీన, వాహినీవారి "పెద్ద మనుషులు" 11 వ తేదీన, భరణీవారి "చక్రపాణి" 19 వ తేదీన విడుదలవుతాయని తెలుస్తోంది.

* * *

పరిమళా పిక్చర్సువారి "ప్రజారాజ్యం" గాని, జయంతీవారి "బంగారుభూమి" గాని మార్చి 26 న విడుదలచేయడానికి డిస్ట్రిబ్యూటర్లు పూర్ణావారు ఆలోచిస్తున్నారు.

"ప్రజారాజ్యం"లో అంజలీదేవి, పద్మిని, కె. ఆర్. రామస్వామి నటిస్తున్నారు. సంగీత దర్శకుడు కే. కే. సుబ్బరామన్.

"బంగారుభూమి"లో అంజలీదేవి, టి. ఆర్. రామచంద్రన్ నటిస్తున్నారు. ★

★ గ్రంథ స్వీకారం ★

ఆంధ్ర సినితారలు

పేరు "ఆంధ్ర సినీతారలు" అని పెట్టినా ఈ పుస్తకంలో తెలుగుసినిమా నటీ నటుల ఫొటోలు, సంగ్రహంగా పరిచయవాక్యాలు మాత్రమే కాక ప్రముఖ సినిమా వ్యక్తుల ఎడ్రెసులు, ఇప్పటివరకూ వచ్చిన తెలుగు చిత్రాల జాబితా, ఆంధ్రలో జిల్లాలవారీగా సినిమామందిరాల పేర్లుకూడా ఉన్నాయి. తెలుగుసినిమారంగం మూడు పేజీలలో సమీక్షించబడింది. దీని ప్రచురణకర్త ఎస్. ఎన్. బాల; సంపాదకులు : ఎస్. ఎన్. పతివాడ; వెల 0-8-0; దొరకుచోటు మేనేజరు, లక్ష్మీ ప్రెస్, రాజమండ్రి.

మంజీర

ఇటీవల హైదరాబాదులో జరిగిన తెలంగాణా రచయితలసంఘ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వెలువడిన పత్రిక. వెల 0-8-0. దొరికే చోటు బి - 18 - 1041, గోషామహాలు, హైదరాబాదు (దక్కను).

ఈ పత్రికలో వున్న రెండు విభాగాలలోను, మొదటిదానిలో కొన్ని పద్యాలు, వ్యాసాలు, రెండవదానిలో వార్షికోత్సవంలో జరిగిన విశేషాలు, ఉపన్యాసాలు ప్రచురింపబడ్డాయి. "ఉత్కృష్టమైన వాఙ్మయాన్ని సృష్టించడం ఉద్దేశ్యంగా" 'మంజీర' పత్రికను నిర్వహించాలనే ఉద్దేశ్యం ఈ సంఘంవారికి ఉన్నట్లు తెలుస్తున్నది. రాజకీయంగా, సాంస్కృతికంగా చైతన్యవంతమవుతున్న తెలంగాణా ప్రాంతపు సాహిత్యావసరాలు తీరుస్తూ, "మంజీర" ఆంధ్రులకు ఆదరణీయంగా అభివృద్ధిపొందుతుందని ఆశిస్తున్నాము.

చైనా విప్లవం - మావో

రచయిత చెన్‌పో—టా; అనువాదకుడు డి. ఎన్. ప్రసాద్ ; వెల 0-12-0 ; ప్రతులకు—విశాలాంధ్ర ప్రచురణాలయం, బకింగ్ హాం పేట పోస్టు, విజయవాడ.

చైనీస్ కమ్యూనిస్టుపార్టీ కేంద్ర సంఘ సభ్యుడైన ఈ రచయిత చైనా విప్లవాన్ని సమీక్షిస్తూ, ఆ విప్లవంలో మ్యావో, ఆయన సిద్ధాంతాలు వహించిన ప్రముఖపాత్ర వివరించారు.

పార్టీ కాంగ్రెసు నిర్ణయాలపై అజయఘోష్ అంత్యోపన్యాసం

వెల 0-4-0; ప్రతులకు విశాలాంధ్ర ప్రచురణాలయం, బకింగ్ హాం పేట పోస్టు, విజయవాడ.

మరణ సుంకాల చట్టం

1953 లో ప్యాసైన మరణ సుంకాల చట్టం గూర్చి హైకోర్టు వకీలు పి. సి. రెడ్డి గారు వ్రాసిన వ్యాఖ్య. వెల 0-4-0; పోస్టేజి 0-1-0; ప్రతులకు ప్రభాత పబ్లికేషన్సు, గూడూరు, నెల్లూరు జిల్లా.

1954 లో మీ అదృష్టం

రచన సత్యప్రకాష్ జోషి; వెల 0-12-0; ప్రతులకు కిశోర్ పబ్లికేషన్స్, 29, గంగాయమ్మన్ కోయిల్ స్ట్రీటు, రాయపేట, మద్రాసు - 14.

1954 సంవత్సరపు ఫలితాలు వివిధరాసులలో జన్మించినవారికి ఎలా వర్తించేదీ వివరింపబడిన గ్రంథం.

కుర్చీలో కూనిరాగం

(11-వ పేజీ తరువాయి)

అవవలసిన వయస్సు వచ్చేక దాని ప్రశంసనీయమైన సేవని గుర్తించి కోర్టువారు పింఛనుగూడ మంజూరు చేశారు. ఈ మంజూరుకాగితాలు రెడ్ టేపులో చిక్కుకోకుండా ఉంటే - కోర్టువారు అదృష్టవంతులు. లేకపోతే ప్రఖ్యాత విదేశీకథ రాసిన కథకుడిలాంటివాళ్లు అవహేళన చేస్తారు.

* * *

రాజధాని హైకోర్టు ఒకదగ్గరే పెట్టాలి. ఇది రాజాగారి అభిప్రాయం. చాలామంది ఇలాగే భావిస్తారు. అది రైటే - గాని అంతర్యం ఆ పెరుగుతున్న వాళ్ళ కిలాంటి అభిప్రాయమే ఉండని చెప్పక చెప్పటం లేదా? మహానుభావులు. ఏమైనా చేస్తారు.

* * *

శ్రీనాథుడికి సీసపద్యాలు రాయడం చేతకాదూ? పెద్దన్నదగ్గరనుంచి ప్రతి ఒక్కడూ అబాణీ అనుసరించినవాడేకద! కొసుల పురుషోత్తం అంతకన్నా బాగా రాస్తాడని విశ్వనాథ సత్యనారాయణగారన్నారట. శ్రీనాథుడి సీసాలనుగురించి ఆయన ఆదినుంచీ ఒకేవైఖరి గలవారు. గాని భట్రాజులాగ శ్రీనాథుడు అడిగిన ప్రతివాడికీ అంకితమిచ్చి పద్యాలు చెప్పినందుకు అతడిని వేరొక భట్రాజుతో గారికే చెల్లింది. గుసుగుసీసాలు బావుంటాయని సాహిత్య కిటుకులు తెలిసినవాళ్ళు అంటారుగాని ప్రజలు వప్పుకోవద్దూ! "చింతపం డొకచోట చిరుకందు లొకచోట" అని టకటకా - టకటకా విరిగితేనేగాని సీసపద్యం కాదన్న రోజులొచ్చేశాయి. ఇప్పుడా, ఎప్పట్నించో వచ్చేశాయి. పోనిద్దురూ - ఈ సాహిత్య చర్చలు పద్మవ్యూహంలాంటివి. ఇందులో చిక్కుకొంటే బయటకిరాలేం. శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రిగారి లాంటి "అనేక యుద్ధముల నారియు తేరిన వృద్ధమూర్తి విశ్వనాథవారిలాంటి అతిరథులు సాహిత్యయుద్ధాలు చేయనియ్యండి. ఏం

విశాఖపట్నంలో హైకోర్టు పెట్టడంలో కల [illegible] విశ్వనాథ సత్యనారాయణ [illegible]; చదువుకోండాం. ★



ఉన్న అన్నం కాస్తా పిల్లలు తింటే తమకేమీ మిగలని కార్మికదంపతులు
నేషనల్ ఆర్ట్ థియేటర్ వారి "తోడుదొంగలు"లో మద్దాలి కృష్ణమూర్తి, టి. జి. కమలా దేవి.

★

జయంతివారి "బంగారుభూమి"లో ఒకదృశ్యం.





ఆర్. కె. ఫిలిమ్సువారి "బూట్‌పాలిష్"లో రతన్‌కుమార్, బేబీనాజ్, డేవిడ్.

★

బి. ఎస్. ఫిలిమ్సువారి "ప్రిజనర్ ఆఫ్ గోల్కొండ"లో ఒక దృశ్యం.



యోగాసనములు-దేహారోగ్యము

6. మూత్రరోగములు

ఈ వ్యాసమందు మూత్రరోగ కారణములు, తన్నివారణకు యోగ్యములైన యోగాంగసాధనలనుగురించి చర్చించబడును. దీనితరువాతి వ్యాసము (ఏడవ వ్యాసము) కూడ దీనికి సంబంధించినదే. ఆధారప్రమాణముల విమర్శనరూపముననున్న ఈ వ్యాసములను పాఠకులు జాగ్రత్తగా గమనించవలసిందని మనవి.

మన శరీరములు "దైవనిర్మితములు" "పరమాశ్చర్యకరములైన యంత్రములు"నని ఎవరికైనను తోచక మానదు. ఆధునిక వైజ్ఞానిక ప్రవీణులు ఎన్నెన్ని యంత్రముల నిర్మించినను, ఒక్కటియు శరీరయంత్రమునకు సరిపోలదు.

దైవమనగా స్థూలములైన మన ఇంద్రియములకు గోచరించని అద్భుత శక్తి సంపన్నుడైన ఒక చేతనుడు. అతడు సర్వజ్ఞుడు, సర్వవ్యాపి. యోగశాస్త్రమందు విశ్వాసము కలుగవలెనన్నచో బౌద్ధవాదములు పనికిరావు. ఆ దైవమునకు మనవలె చేతులు కళ్లు ముక్కు మొగము మొదలగునవి కలవో లేవో నిర్ణయించుట మన ప్రస్తుతకర్తవ్యము కాదు. ధారణ ధ్యానాది విషయములందు తెలుసుకొనవలసిన విషయ మది.

కారణములేనిది కార్యముండదని అందరికీ తెలిసినవిషయమే. రోగాదులవిషయమందు కూడ నిదియే రూఢి.

భగవంతుడు మన శరీరయంత్రములనే గాక పలువిధములైన ప్రాణిసమూహములను చిత్రవిచిత్ర శరీరయంత్రములతో నిర్మించియున్నాడు. ఈ యంత్రముల చలన వలన భ్రమణములకు అవసరమైన చక్రములను (కాళ్లు) కీళ్ళను మరికొన్ని పరికరముల చేర్చి వానిని బొంగరములవలె త్రిప్పుచున్నాడను విషయమును గ్రహించి, మనము దైవమునకు అధీనులమై మన శరీరయంత్రములను ఆ దేవుని సేవకు వినియోగించితిమేని, ఏకాంత మాత్రమో ఆరోగ్య సుఖమును పొందగలము. దైవనిర్మితమైన ఈ శరీరయంత్రములో ఏయొక్క భాగము లేదా అంగము చెడినను మనకు కష్టము నష్టము తప్పవు.

"భ్రామయన్ సర్వ భూతాని యన్త్రారూఢాని మాయయా" అని శ్రీ భగవద్గీతయందు చెప్పబడినది. సంసార కార్యరంగములో అభినయించి ప్రేక్షకులకు ఆనందమును కలుగజేయుటకొరకు ఇట్టి శరీర యంత్రమును, మన కంఠ్ఠకగుపడని ఇంద్రియములను కీళ్ళను భగవంతు డమర్చినాడు.

జ్ఞానేంద్రియములకు, కర్మేంద్రియములకు అధిపతి మనస్సు అను అంతరింద్రియము. ఈ అంతరింద్రియముయొక్క ఆధారముపైన ఇతర ఇంద్రియములన్నియు సంసార కార్యరంగమున అభినయించుచున్నవి, జ్ఞానేంద్రియము లైదును:—

1. జిహ్వ (నాలుక) షడ్రసములను తెలుపును.

2. నేత్రములు ఏడువిధములైన వర్ణరూపములను తెలుపును.

3. చెవులు అన్నిరకముల శబ్దములను గ్రహించును.

4. ముక్కు సుగంధ దుర్గంధము లన్నిటినీ గ్రహించును.

5. త్వక్ (చర్మము) స్పర్శ సుఖానుభవ కారణము.

శ్రీ టి. కృష్ణమాచారి

కర్మేంద్రియము లైదును :—

1. వాగింద్రియము వాక్కునకు కారణము.

2. పాణి (చేతులు) కార్యసాధకము.

3. పాదము (కాళ్ళు) గమనాగమనముల కుపయోగపడునవి.

4. పాయు (గుదలింగములు) మలమూత్ర విసర్జనముల కుపయోగపడునవి.

5. ఉపస్థ (రహస్యేంద్రియములు) స్త్రీపురుష సంయోగ కారకము.

ఈ ఇంద్రియముల పదింటిని బాహ్యేంద్రియము లందురు. వీని క్రియాకలాపములు నేత్రగోచరములు.

పదునొకండవ ఇంద్రియము 'మనస్సు'. బాహ్యేంద్రియములన్నియు గ్రహించు వస్తువుల స్థూల సూక్ష్మరూపలావణ్య గంధాదులను స్వీకరించి ఆనందించునది మనస్సు. అంతే కాదు. బాహ్యేంద్రియముల కార్యములను నియమించునది కూడ మనస్సే! మనస్సు ఆజ్ఞ లేనిది ఏ యింద్రియమూ పని చేయజాలదని నిద్ర మూర్ఛ మొదలగు అవస్థలలో తెలుసుకొనవచ్చును.

శరీర యంత్రమునకు కీళ్ళవంటి ఈ పది యింద్రియములలో ఆరోగ్యమునకు అనారోగ్యమునకు ప్రధాన హేతువులైనవి నాలుక, రహస్యేంద్రియము నని సులువుగా నిరూపించవచ్చును. అయితే అట్టి నిరూపణ ఇక్కడ అనవసరమని నా యభిప్రాయము. ఈ రెండింటినీ జయించినవారు నిత్యము ఆరోగ్యసుఖ మనుభవించగలరు. గుడ్డివారికి, మూగవారికి, చెవిటివారికికూడా సమానముగా ఆరోగ్య, అనారోగ్యములను చేకూర్చునవి ఈ రెండే. నా యీ వాద మిప్పుడు కొందరికి రుచించకపోవచ్చును గాని క్రమముగా వారికే బోధపడగలదని నా విశ్వాసము.

శరీరయంత్రములోని రహస్యేంద్రియమను కీలును దుర్వినియోగపరచుట వలన మూత్రకోశ, మూత్రపిండ, మూత్రనాళములు చెడి, అచ్చటి మాంస, వీర్య, శోణిత, మేదస్సులు కుళ్ళి పురుగుబడి దుర్వాసన పుట్టి మూత్రరోగములు అను వ్యాధులు పుట్టును. వీనిని మేహము, ప్రమేహముఅని వ్యవహరింతురు.

"యోగాసనములు, దేహారోగ్యము" వ్యాసకర్తలైన శ్రీ టి. కృష్ణమాచారిగారి చిరునామా కావలెనని పలువురు పాఠకులు కోరుతున్నందువల్ల వారి చిరునామాలు రెండు ఇక్కడ ఇస్తున్నాము. ప్రస్తుతము వారు మద్రాసులో ఉన్నారు.

1. శ్రీ టి. కృష్ణమాచారిగారు
127 రాయపేట హైరోడ్డు
మైలాపూరు
మద్రాసు 4.

2. శ్రీ పతంజలి యోగశాల
1112 వైస్రాయ్ రోడ్డు
చాముండీ ఎక్స్టెన్షన్స
మైసూరు.

మూత్రరోగములు పుట్టుటకు కారణములు
1. మితిమీరిన స్త్రీ పురుష సంపర్కము, 2. సకాలములో నిద్రలేకుండుట, 3. అజీర్ణ వాయువు హెచ్చుట, 4. ఎల్లప్పుడు దుశ్చింతలతో మనస్సును వ్యధబెట్టుట, 5. హస్త క్రియాదులు, 6. పగలు నిద్రపోవుట, 7. ముట్టులోనున్న స్త్రీతో సంగమించుట, 8. మలమూత్రములను బిగబట్టుట, 9. పగటి వేళ స్త్రీపురుష సంయోగము.

ఈ తొమ్మిదింటిలో నేకారణమువలన నైననూ స్త్రీపురుషులకు మూత్రరోగములు రాకమానవు. కొన్ని కారణములవలన త్వరగాను, కొన్నిటివలన కొంతకాలమునకును ఈరోగములు సంభవించును. కాబట్టి శరీరారోగ్యమును కాపాడుకొను సాధనలో రహస్యేంద్రియమును కాపాడుకొనుట అత్యంతప్రధానము.

మూత్రరోగములలో భేదములు: 1. మధుమూత్రము - ఇది వీర్య రజోబిందు మిశ్రమై స్రవించును. 2. తంతుమూత్రము - మూత్రస్థానమునకుముందే జిగురుగా బిందుపతనము. 3 బిందుమూత్రము - అనుక్షణమూ వీర్య రజోబిందు పతనము. 4. అమూత్రము - మూత్రము రాక పడు బాధ. 5. బహుమూత్రము - మితిమీరిన మూత్రస్రావము. ఇవి కొన్ని లక్షణములు మాత్రము.

ఈ రోగములున్న వారికి సాధారణముగా నాలుక, ముఖము, గోళ్ళు, అరిచేతుల వన్నెలో మార్పు కనపడును. నిస్సత్తువ, అలసట ఉండును. ఈ రోగములవలన స్త్రీల రజఃకోశ గర్భకోశములు ఎండి, రొమ్మును స్తన్యమును గుర్బలపరచును. పురుగుల విషయమై పాఠకు లూహించుకోగలరు.


ఈ జాడ్యములు తలిదండ్రులవలన బిడ్డలకు సంక్రమించగలవు. వ్యభిచారము మొదలగు అనాచారములవల్ల యౌవనవంతులు వృద్ధులు యీ రోగముల పాలై అకాలమృత్యువు వాత పడుచున్నారు.

ఈ రోగములకు యోగచికిత్స చేయబూనువారు మొట్టమొదట వారి నాడీస్థానములను, ముఖ్యముగా "విశ్వోదరా" నాడీ స్థానమును పరీక్షించి మూత్రశోధన చేయవలెను.

విశ్వోదరా నాడి పొత్తికడుపులో రహస్యేంద్రియ మూలమునకు పై భాగమునందు, బొడ్డుకు క్రిందుగా 12 అంగుళముల దూరములో మాంసపిండములలో బుట్టి తీగవలె పెరుగును. ఇది శాఖోపశాఖలతో పెరిగి రహస్యేంద్రియముచుట్టూ వ్యాపించి మూత్రవీర్య, రజస్సులను కాపాడును. (ఇది నియమనిష్ఠలతో నుండు వారి విషయములో మాత్రమే కాపాడును.) రహస్యేంద్రియమును దుర్వినియోగపరచుటవల్ల విశ్వోదర నాడి పగిలి ఛిద్రమగును. అప్పుడు మూత్రపిండ మూత్రకోశములు స్థానభ్రష్టము పొందును. మూత్రవీర్య రజో బిందువులను దారితప్పించి శరీరములోని రక్తమును విషపూర్ణ మొనర్చును. పొత్తికడుపులో పుండు ఏర్పడును. వీర్యరజస్సులు చీముగా మారి రహస్యేంద్రియ మార్గముద్వారా అపరిమిత క్లేశముతో బిందువులు బిందువులుగా పతనము చెందును. రొమ్ము, బొడ్డు, వీరనాళ రజోనాళములందు మంట, నొప్పి, దురద పుట్టును.

పలువిధములైన ఈ రోగములకు యోగ చికిత్సలు:—

1. శీర్షాసనము - సాంగముగా, సభా



పర్యంకాసనం

గముగా, విపరీత కరణీవిధానమున మొత్తము 15 నిమిషములు - మొదట ఒక నిమిషము చొప్పున ప్రారంభించి క్రమముగా కాలము హెచ్చింపవలెను.

2. సర్వాంగాసనము. (5 వ వ్యాసముతో ప్రచురించబడిన ఫోటోలు చూడుడు) శీర్షాసనక్రమముననే అన్ని విధములనూ అనుసరించవలెను.
ఇది 10 నిమిషములకు మించరాదు.

3. హలాసనము—2 నిమిషములు.

4. కర్ణపీడాసనము— 1 నిమిషము మాత్రము.

5. పర్యంకాసనము—2 నిమిషములు.

6. భస్త్రికాప్రాణాయామము : నాడీ శుద్ధితో 10 నిమిషములు. ఇది విశ్రాంతి పూర్వకముగా చేయవలెను.

7. ఉడ్డియాణబంధము—ప్రారంభకులు 6 పర్యాయములు, దృఢాభ్యాసులు 24 పర్యాయములు చేయవలెను.

8. శీతలీ ప్రాణాయామము—24 సార్లు. బంధత్రయముతో చేయవలెను.


స్థూలకాయులు, పెద్ద పొట్టగలవారు 1 పశ్చిమతాన 2 పూర్వతాన 3 పర్వతాసనములను చక్కగా అభ్యసించి లావును, పొట్టను కొంత తగ్గించుకొని అటుపిమ్మట నే శీర్షాసనాదులు అభ్యసించవలెను. ప్రాణాయామములకు మాత్ర మీ నియమము లేదు. కృశకాయులైనవారు, మధ్య కాయులు శిక్షకులు సూచించు నియమములను చక్కగా పరిపాలించి చేయవలెను. ఇవి భోజనానంతరము చేయరానివి. భోజనానంతరము 6 గంటలకాలము గడచిన తరువాతనైనచో చేయవచ్చును.

మూత్రరోగులు నడుము వరకో బొడ్డు వరకో చల్లని నీళ్లలో నిలబడి కుంభకము చేయకుండా, సుదీర్ఘ శ్వాసోచ్ఛ్వాసములను ఉడ్డియాణ బంధములతో కూడ 15 నిమిషములు చేసినచో బాధలు త్వరగా తగ్గును. వీని క్రమమును నిపుణులైన యోగాభ్యాసుల వలన తెలుసుకొనవలెను.


కొందరు శస్త్రచికిత్సలతోనూ, గోట్టములను ప్రయోగించియు మూత్రరోగములను నివారించ యత్నించి అనేకులు విఫలులైనారు. అట్టి అపాయకరమగు చికిత్సలకు లోబడక సహనశాంతులతో యోగచికిత్సను బొందుట ఇహపరసాధకమని నా మనవి.

రోగులు పాటించవలసిన మిక్కిలి ప్రధానమైన నియమములు కొన్ని యున్నవి: 1. ఎండలో తిరుగరాదు. 2 గట్టిగా మాటలాడరాదు. 3. వేడిపదార్థములు సేవించరాదు. 4. ఉప్పు, కారము, పులుపు విసర్జించవలెను. 5. చల్లని కొబ్బరికాయ నీరు త్రాగవలెను. 6. ఆవుపాలు, ఆవుపెరుగు,

యోగాసనములు-దేహారోగ్యము



సాలంబ శీర్షాసనం



నిరాలంబ శీర్షాసనం

ఆవునెయ్యినే సేవించవలెను. 7. నిత్యము సుగంధ చందనాదిలేపనము లుండవలెను. 8. మాదకద్రవ్యము, కోడిగ్రుడ్లు, మాంసములు తీసుకొనరాదు. 9 చన్నీళ్లలో మునకలువేసి స్నానము చేయవలెను. 10. పాదరక్షలులేకుండ తిరుగరాదు. 11. చుట్టలు, సిగరెట్లు మొదలగునవి కాల్చరాదు. 12. సదా దైవధ్యాన మవసరము.

ఈ నియమములననుసరించువారికి మూత్రరోగములు త్వరలో నివారింపబడును.


మూత్రరోగములకు ఔషధ చికిత్సలకంటె వ్యాయామయోగచికిత్సలు శ్రేయస్కరములని ఆయుర్వేదసుశ్రుతములో స్పష్టపరచబడినది. (ఇది ముందువ్యాసములో చదువ్నగును)

"సప్తచక్రమ్ నవద్వారమ్
ఏకాదశ గుణాన్వితమ్ ।
"గాత్రయన్త్రమ్ సదా రక్షేత్
యోగాస్త్ర సహితో జనః॥"

అనగా మూలాధార, స్వాధిష్ఠాన, మణిపూరక, అనాహత, విశుద్ధి, ఆజ్ఞా, సహస్రారములు అను ఏడు గాల్లుగల ముక్కు రంధ్రములు, రెండు కండ్ల రంధ్రములు, రెండు చెవుల రంధ్రములు, నోరు, గుదము, మూత్రనాళము అను నీ తొమ్మిది రంధ్రములు గల అయిదు జ్ఞానేంద్రియములు అయిదు కర్మేంద్రియములు, మనస్సు మొత్తము పదుకొకండు కీళ్లుగల శరీరయంత్రమును యోగము అను అస్త్రబలముతో ఎల్లప్పుడు కాపాడుకొన గలవారే మానవులు అని అర్థము.

[సశేషం.]

శీర్షాసక పరివృత్తి



విపరీత కరణి



(43-వ పేజీ తరువాయి)

రెం. బం: నిజంగా ఎంత పిసినిగొట్టను కున్నావు?

మొ. బం: నే నెరుగుదునుగా! పెళ్లాని కూడా సరిగ్గా కూడెట్టేవాడు కాదు.

రెం. బం: వీడు చచ్చినందుకు మన మంతా పండగ చేసుకోవచ్చు.

మొ. బం: ఊళ్ళో రైతులంతా చేసు కుంటున్నారులే.

రెం. బం: కాకపోతే—

మొ. బం: ఎట్టాగయితేయేం - జయరాం చచ్చాడంటే చచ్చాడు.

జయ: (గబ గబా వచ్చి) చావలేదయ్యా చావలేదు.

బంధువులు: (కంగారుగా) అమ్మో! దెయ్యం దెయ్యం!!

(ఇద్దరూ పారిపోతారు.)

జయ: నేను చచ్చానంటే వీళ్ళందరికీ సంతోషం కాబోలు. పండగ చేసుకుంటా రంట పండగ - వాజమ్మలు.

(నారాయణ గబగబా వస్తాడు.)

నారా: ఎక్కడా దెయ్యం!

జయ: దెయ్యమూ లేదు గియ్యమూ లేదు. నేనే దెయ్యాన్నంట.

నారా: ఎవరూ అరిచింది?

జయ: ఇప్పుడే ఇద్దరు వెధవలొచ్చారులే యిక్కడికి—

నారా: పాపం నిన్ను చూసి జడుసుకుని పారిపోయుంటారు.

(పోలీసు ఇనస్పెక్టరు వేషంలో సుందరం, పోలీసు వేషంలో చంద్రం, మోహన్ ప్రవేశిస్తారు.)

జయ: అమ్మయ్యో నిజంగానే పోలీసులు.

నారా: ఇక తేలుతుంది నీసంగతి.

జయ: బాబోయ్. తంతాగు.

(జయరాం పారిపోబోగా ఇనస్పెక్టరు పట్టుకుంటాడు.)

ఇన: ఎవరు నువ్వు.

జయ: జయరాంనండి.

నారా: కాదండి. జయరాం మధ్యాహ్నం చనిపోయారండి. ఈయన ఆవేషంలో వచ్చి అందరినీ మోసగించాలని చూస్తున్నాడండి-

ఇన: నిజమేనా.

జయ: కాదండి.

ఇన: మరి.

జయ: నేనే జయరాంనండి.

నారా: అబద్ధం. కావాలిస్తే మోహన్ నడగండి. ఈ సాక్ష్యాలు చూడండి. ఇదిగో జయరాం చచ్చినట్టు డాక్టరు సర్టిఫికేట్టు. ఇదిగో పత్రికలో వార్త.

ఇన: (చూసి) ఔను. ప్రత్యక్షంగా జయరాం చచ్చిపోయినట్టు తేలుతోంది. నువ్వెవరవో మోసకారివి. నిన్ను అరెస్టు చేస్తాను. తంతాను.

జయ: వద్దండీ!

ఇన: మరెవరవో నిజం చెప్పు.

జయ: నిజమేనండి.

ఇన: అబద్ధం -

జయ: కాదండి.

ఇన: ఏయ్ *Five not Five (505)* వీడికి చేతికి సంకెళ్ళు వెయ్యి.

(జయరాం గింజుకుంటుండగా పోలీసు అతనికి సంకెళ్లు తగిలిస్తాడు.)

ఇన: ఇప్పుడైనా నిజం చెబితే వది లేస్తాను. లేకపోతే లాఠీ దెబ్బలికి సిద్ధంగా ఉండు.

జయ: నేను చెప్పేది నిజమేనండీ.

ఇన: ఛ. మళ్ళీ అబద్ధం (లాఠీతో జయ రాం కాళ్ళమీద ఒక దెబ్బ కొడతాడు.)

జయ: అమ్మయ్యో! నిజం చెబుతానండి.

ఇన: అలా దారికిరా. చెప్పుమరి.

జయ: జయరాం మా అన్నయ్యండి.

ఇన: నిజమేనా -

జయ: నిజమేనండి. మేంయిద్దరం ఒక మాదిరిగానే ఉంటామండి. నన్ను కొట్టకండి.

ఇన: కొట్టనులే. చెప్పుమరి. ఇలా వేషం ఎందుకు వేసుకు వచ్చావు.

జయ: బుద్ధి గడ్డితిని. డబ్బుకోసమండి.

ఇన: నువ్వు చెప్పింది నిజమేనా—

జయ: ఔనండి. కాని అప్పుడప్పుడూ నేను అబద్ధంకూడా ఆడతానండి.

ఇన: ఐతే నిజం చెప్పు.

(మళ్ళీ లాఠీతో బాదుస్తాడు.)

జయ: బాబోయ్! కొట్టకండి. నిజం చెబుతానండి.

ఇన: చెప్పు మరి.

జయ: ఏం చెప్పను?

ఇన: నీ పేరు.

జయ: జయరాం?

ఇన: మళ్ళీ...

(లాఠీతో బాదుస్తాడు)

జయ: కాదు కాదు. మర్చిపోయాను. నా పేరు సుందరదాసండి.

ఇన: సరే! నేను జయరాంని కాను అని స్పష్టంగా అను. వదిలేస్తాను.

జయ: నేను జయరాంని కాను.

ఇన: ముమ్మాటికీ అను.

జయ: నేను జయరాంని కాను - నేను జయరాంని కాను. నేను జయరాంని కాను!

నారా: ఇక చాల్లెండి ఇనస్పెక్టరుగారూ ఈసారికి వదిలెయ్యండి పాపం!

ఇన: సరే మీ యిష్టం.

నారా: ఇకనయినా బుద్ధికలిగి ఉండు. ఇలాంటిపను లెప్పుడూ చెయ్యకు. సరేనా!

జయ: సరే.

ఇన: *Five not five*! బేడీలు తీసెయ్యి.

(పోలీసు చేతి సంకెళ్లు తొలగిస్తాడు.)

నారా: ఇక మీరువెళ్ళవచ్చండి ఇనస్పెక్టరుగారూ!

(ఇనస్పెక్టరు పోలీసు వెళ్ళిపోతారు.)

నారా: మోహన్! ఇక మీ ఆస్తుపాస్తుల విషయం సుశీలతోకూడా మాట్లాడదాం లోనికిరా!

మో: అలాగే.

(నారాయణ మోహన్ లోనికి వెళ్తారు.)

జయ: (కాసేపటికి తెప్పరిల్లి) నేను బ్రతికుండే చచ్చాను. చివరికి లాఠీదెబ్బల్తో చచ్చినట్టు తేలిపోయింది. అసలు చచ్చిం తర్వాత ఏం జరుగుతుందో కళ్ళారా చూశాను. అంతా పండగ చేసుకుంటారు. దీనికంతటికీ కారణం నా పిసినిగొట్టుతనం- ఎక్కువ వడ్డీలు. ఇంకెప్పుడూ అలా చెయ్యను. బుద్ధొచ్చింది. ఇకనించీ కడుపు నిండాతిని అందరికీ దానధర్మాలు చేస్తాను.

(సుశీల ప్రవేశిస్తుంది.)

సు: ఏమిటీ ఒంటరిగా ఆలోచిస్తున్నారు.

జయ: ఆ! ఏంలేదు, ఏంలేదు.

సు: (దగ్గరగావచ్చి) నాతో చెప్పకూడదా! నేను మీ భార్యనేగా!

జయ: ఆ! నువ్వు నా భార్యవా! ఇప్పుడేగా కాదన్నావ్!

సుశీ: ఎవరన్నారు. మీరు నాభర్తగారు.

జయ: కాదు. నేను చనిపోయాను.

(సుశీల నవ్వుతుండగా నారాయణ నవ్వుతూ ప్రవేశం.)

నారా: ఎవరన్నారు?

జయ: మీరంతా ఇప్పుడేగా నేను చనిపోయానని నిరూపించారు.

(మోహన్ ప్రవేశం నవ్వుతూ)

మో: అంతా అబద్ధం. నువ్వే మా నాన్నవి.

జయ: కాదు. నేను చనిపోయాను.

(సుందరం ప్రవేశం బిగ్గరగా నవ్వుతూ)

సుం: నువ్వే మా నాన్నవి. నువ్వు చావలేదు.

జయ: (కంగారుగా) కాదు. నేను చావలేదని ఎవరంటారు? నేను చచ్చిపోయాను.

(పోలీసు వేషంలో చంద్రం, బంధువుల వేషంలోని ఇద్దరు రైతులూ నవ్వుతూ ప్రవేశిస్తారు.)

అంతా: మీరు జయరాంగారే నండి.

విజ్ఞానవీధులు

"డాక్టర్."

> ఒక నాటకం కంపెనీ వారు తమ కొత్త నాటకాన్ని ఇలా ఎడ్వర్టయిజ్ చేశారు:
> "అద్భుతమైన కథ! అపురూపమైన నటన: శ్రీ డైమన్షనల్ దృశ్యాలు! ప్రత్యేకమైన కళ్లజోళ్ళు ఉపయోగించ నక్కర లేదు!"

174. ధర్మయుద్ధము

ఒకొక్క వీరుడు ఒకొక్క వీరునితోనే యుద్ధము చేయవలెననీ, రథికుడు రథికునితోనూ, పదాతి పదాతితోనూ మాత్రమే తలపడవలెను గాని వాహన సౌకర్యముగల యోధ పదాతిని తలపడకూడదనీ, సాయుధులు నిరాయుధులనూ, తక్కిన వారు ద్వంద్వయుద్ధము చేసే వీరులనూ కొట్టరాదనీ భారతీయ యుద్ధ నియమాలు. ఈ నియమాలకు లోబడి చేసినదే ధర్మయుద్ధము, అతిక్రమించినది అధర్మయుద్ధము.

కాని అసలు యుద్ధమే అధర్మము. శక్తి గల రాజు తన చుట్టుపట్లనున్న అశక్తులను లోబరుచుకుని అధికారము చలాయించడమూ కప్పము పుచ్చుకోవడమూ, కిరీట మస్తకాలచే పాదాభివందనాలు పొందడమూ అధర్మాలు కావా? నాటి రోజులలో కాదు. యుద్ధమన్నది ఏదో అధర్మవర్తనాన్ని పురస్కరించుకునే జరుగుతుంది. నాటి రోజులలో 'వీరభోజ్యము రాజ్య'మనే నమ్మిక ఉండేది. ఒక వీరుడు పదిమందితో తనంతట తాను తలపడిపోరాడవచ్చుననే సమయముండేది. ఇవి అధర్మాలు కావు: వీరుల హక్కులు.

చిత్రమేమిటంటే బ్రతుకు తెరువు కావలిసినంత వుండీ, ఏదో అవసరాలకి మాత్రము యుద్ధము చేసే జాతులలోనే 'ధర్మయుద్ధ' ప్రశంసలు గాని, శస్త్రోపజీవులైన (కైబరు ప్రాంతములోని గుంపులవంటి) వారికి యుద్ధ 'నియమా' లేవీ వున్నట్టు లేదు. అనువూ, శక్తీ, ఈ రెండూ వుంటే సరి ఎవడికి అందినది వాడు పట్టుకుపోవచ్చును. తొలి రోజులనుంచీ నేటిదాకా కనపడే యుద్ధప్రక్రియను గమనించితే, ఈ ఆఖరి సూత్రమే ఎప్పటికప్పుడు అమలుకు వస్తూండేది అని బోధపడుతుంది.

రామాయణయుద్ధములో ఇంద్రజిత్తు మేఘాల చాటునవుండి కృత్రిమ యుద్ధము చేశాడు. అది తప్ప తక్కిన యుద్ధమంతా 'ధర్మయుద్ధ' పద్ధతులమీదనే జరిగింది. భారతయుద్ధములో భూరిశ్రవస్సుని హస్తఖండనమూ, భీష్మద్రోణుల పతనమూ, అభిమన్యునిహత్య, కర్ణుని చావూ, సౌప్తిక ప్రళయమూ అంతా అధర్మయుద్ధమే జరిగింది వీటికన్నిటికీ పాండవుల పక్షాన్న మాత్రము ఏవో కుంటి సమాధానాలు వచ్చాయి.

చరిత్ర కందిన యుద్ధము - మన దేశానికి సంబంధించినది - అలెగ్జాండర్ పురుషోత్తముల యుద్ధము. గ్రీకుల అశ్వములు పురుషోత్తముని ఏనుగుల వెనుకభాగముమీద ముందుకాళ్ళు అనితే, బల్లెముతో అశ్వికుడు అంబారీలోని వీరుణ్ణి పొడిచేవాడు. గుర్రము పారిపోగలుగు, ఏనుగు స్థాణువు. కనక పురుషోత్తముడు ఓడిపోయాడు. ఏనుగులమీద ఎక్కి యుద్ధము చెయ్యడములాగే వెనకనించి పొడవడమూ అధర్మమే అప్పటికింకా ఓడినవారి శౌర్య పరాక్రమాలమీద గౌరవము పోలేదు. కనక పురుషోత్తముడు విడుదల అయ్యాడు.

గజనీమహమ్మదు చేసినది నీరవిహారమే. ఘోరీమాత్రము అంతకుముందు తన్ను విడిచిపెట్టినాడన్న విశ్వాసమేనా లేకుండా పృథ్వీరాజుని చంపించేశాడు. విదేశీయుల దారుణపద్ధతులు భారతీయులు మాచుటకిదే మొదలు.

కైబర్ గుంపుల కసాయిపద్ధతులు ఢిల్లీ సుల్తానులకాలములో పూర్తిగా దిగుమతి అయాయి. రాజు అనువుగా దొరికితేచాలు, చంపేసి ఇంకొకడు రాజ్యానికి రావడమే మామూలైంది. ధీరుడైనిలబడ్డ యాదవరాజుని అల్లాయుద్దీను చర్మమొలిపించి చంపించాడు. రాజమహేంద్రవరముదగ్గర తన్ను నాలా చికాకుగా నిరోధించారని, జయించినతర్వాత ఎంతమందినో చిత్రవధ చేశాడు అలూఫ్‌ఖాను క్రీ. శ. 1323 లో.

ఈ కాలములోనే దక్షిణ భారతరాజులు మహమ్మదీయుల దొమ్మియుద్ధాన్ని చూచారు. 1300 తర్వాత ఆనెగొంది నేలిన కంపిలిరాయని కొడుకు కుమారనాధుడు గొప్ప శూరుడు. అతనితో ద్వంద్వయుద్ధము చేయలేక దక్షిణాది రాజులెందరో అతనికి లోబడ్డారు. ఢిల్లీసుల్తానుతో యుద్ధము జరిగితే ఒక గుంపు బల్లెములతో అన్ని వైపుల నుంచీ కుమ్మివేసి చంపేశారు కుమారనాధుణ్ణి. అధర్మయుద్ధానికి ఆహుతియైపోయిన వీరుడని నాటికవులు అతనిచరిత్రని కొమారరాముని కథ అనే కావ్యముగా రచించారు.

దక్షిణభారతములో హిందూరాజులకు జరిగే యుద్ధాలు మాత్రము 'ధర్మపద్ధతుల' పైనే జరిగేవి. కాటమరాజుకథలో కాటమరాజు తన సేన తక్కువకనక తుముల యుద్ధమునకు సాహసించక ఒకొక్క వీరుణ్ణి పంపి, వారంతా ఎదిరిపక్షములోని వీరుల వల్ల ద్వంద్వయుద్ధంలో చచ్చిపోతే తానే బయలుదేరి నల్లసిద్ధిని చంపినాడూ యుద్ధము గెలిచాడు. మహమ్మదీయుల పద్ధతిని నల్లసిద్ధి అవలంబించి యుంటే మొన్న మొన్నటి బొబ్బిలియుద్ధములాగే ఆ యుద్ధము ఒక రోజులో ముగిసిపోయుండేది.

ఏ పద్ధతివల్లనేనా సరే శత్రువినాశము చెయ్యడమే విదేశీయుల యుదనీతి. అక్బరు రాత్రివేళ చెట్టెక్కి, చిత్తూరుకోటలో, పడిన గోడలను బాగుచేయిస్తూన్న జయమల్లుణ్ణి తుపాకీ పేల్చిచంపేడు. అవురంగజేబు, తానీషా సేనాధిపతి మీర్జుమ్లాకి లంచమిచ్చి గోల్కొండని పట్టేడు. ఆంగ్లేయులు శ్రీరంగపట్టణమును ఆరీతినే పట్టినారు. పరుల యుద్ధపద్ధతులను తెలుసుకోకా, తమ పద్ధతులనే శుద్ధిగా ఆచరణలో పెట్టుకునీ భారతీయులు యుద్ధాలలో ఓడిపోయారు.

★

పునర్జన్మ

మేం నవ్వుతాలకి నాటకమాడాం. ఇదిగో చూడండి—

చం: నేను చంద్రాన్ని పోలీసుని కాను.

రై: మేం రైతులం మీ బంధువులం కాం.

జయ: ఆ! నిజమేనా. ఐతే నేను చావలేదన్న మాట.

(జయరాం బిగ్గరగా నవ్వుతాడు)

జయ: మీరంతా కలిసి నాకు బుద్ధి చెప్పారు. ఇకనించీ నేను బుద్ధికలిగి అందరితోనూ చక్కగా ప్రవర్తిస్తాను. నిజంగా ఇది నాకు పునర్జన్మ—

(అంతా నవ్వుతుండగా తెరపడుతుంది.)


★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras



గూడులేని పక్షులు

ఫొటో: బి. రవీంద్రనాథ్-గుంటూరు.


మార్చి
నెలలో
విడుదల
వాహినీ చిత్రము
పెద్దమనుషులు
నిర్మాత-దర్శకుడు
రచన
డి.వి. నరసరాజు
కె.వి. రెడ్డి
మనిషికి ప్రాణంకంటె గూడ నీతిప్రధానం!
యీపరమసత్య నిరూపణే యీ చిత్రానికి
ప్రధాన లక్ష్యం!